

రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెలంగాణ రాజకీయ వైతాళికుడు రావి నారాయణరెడ్డి
06


సంపుటి 08, సంచిక: 277 | ఆదివారం | 7-09-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# వెళ్లొస్తా...

# వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవం


ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కన్నుల పండువగా సాగిన శోభాయాత్ర
- భాగ్యనగరానికి ఆధ్యాత్మిక శోభ
- జనసంద్రమైన హుస్సేన్ సాగర్
- గణపతిబప్పా మోరియా నినాదాలతో దద్దరిల్లిన ట్యాంక్‌బండ్ పరిసరాలు
- ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మంత్రి పొన్నం ప్రభాకర్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి ఏరియల్ సర్వే
- రూ.35 లక్షలు పలికిన బాలాపూర్ గణేశ్ లడ్డు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆధ్యాత్మిక శోభతో కన్నుల పండువగా గణపతి నిమజ్జనోత్సవం ముగిసింది. హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. అనంత చైతన్యంతో మహా గణేశ్ నిమజ్జన శోభాయాత్ర హైదరాబాద్ వీధులన్నీ భక్తి, ఉత్సాహం, ఆధ్యాత్మిక ఉల్లాసంతో మార్మోగాయి. వీధులన్నీ గణనాథుడి నినాదాలతో మారుమ్రోగుతుండగా నిమజ్జనం మహాసంకల్పయాత్రగా మారింది. హైదరాబాద్ నగరం ఆధ్యాత్మిక కాంతుల తారకమైంది. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ లక్షలాది మంది భక్తులు, గణపతి విగ్రహాలతో సందడి నెలకొంది. భక్తులతో హుస్సేన్‌సాగర్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. శోభాయాత్ర మార్గాలు 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో మారుమోగాయి. ఎంజె మార్కెట్, సికింద్రాబాద్, అబిడ్స్, లిబర్టీ, నారాయణగూడ, హిమాయత్ నగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ఇందిరా పార్కు, లోయర్ ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, నెక్లెస్ రోడ్, మినిస్టర్ రోడ్ మీదుగా ట్యాంక్‌బండ్ వరకు గణేశ్ శోభాయాత్రలు తరువాయి 12లో

## మహా గణపతికి ఘన వీడ్కోలు

దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ వినాయకుని నిమజ్జన కార్యక్రమం ఆద్యంతం భక్తజనుల సందడి మధ్య ఘనంగా ముగిసింది. ఈ అద్భుతమైన ఘట్టాన్ని వేలాది మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించి 'జై జై గణేశా.. బై బై గణేశా' అంటూ నినాదాలు చేశారు. మహా గణపతి శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఈసారి గణనాథుడు భక్తుల నీరాజనాలందుకున్నాడు. లక్షలాదిమంది భక్తుల మధ్య మహా గణపతి ట్యాంక్‌బాండ్‌లో నిజమజ్జనమయ్యాడు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన బడా గణేశ్ శోభాయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ట్యాంక్‌బాండ్‌కు చేరుకుంది. ఖైరతాబాద్ నుంచి మొదలైన శోభాయాత్ర టెలిఫోన్ భవన్, సచివాలయం మీదుగా సాగి మధ్యాహ్నం 1:45 గంటలకు హుస్సేన్ సాగర్‌లోని ఎన్‌టిఆర్ మార్గ్ వద్ద ఉన్న 'బాహుబలి క్రేన్4' వద్దకు చేరుకుంది. సుమారు 70 అడుగుల భారీ క్రేన్ సాయంతో ఖైరతాబాద్ గణపతిని నెమ్మదిగా ఎత్తి, భక్తుల నినాదాల మధ్య హుస్సేన్ సాగర్‌లో గంగమ్మ ఒడికి తరువాయి 12లో


పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బి.మహేశ్‌కుమార్‌గౌడ్

## కవిత వ్యాఖ్యలు

# ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా...

- కొందరు నాయకులు, పార్టీలు చేసిన ఆరోపణలే ఆమెకూడా చేశారు
- కొత్తేమీ లేదు : హరీశ్‌రావు
- ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్‌తో భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

తన జీవితం తెరిచిన పుస్తకమని, గత కొంత కాలంగా కొందరు నాయకులు, పార్టీలు చేసిన ఆరోపణలే కవిత కూడా చేశారని, ఇందులో కొత్తదేమీ లేదని తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కవిత ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశారో ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత హరీశ్‌రావు తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ రెండున్న దబ్బాల కాలంలో కెసిఆర్ నాయకత్వంలో తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, తరువాయి 2లో

## చర్లపల్లిలో డ్రగ్స్ తయారీ

# యూనిట్ గుట్టు రట్టు

- 30 వేల లీటర్ల ముడి సరుకు స్వాధీనం
- 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

స్థావరంపై మహారాష్ట్ర పోలీసుల దాడి




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లిలో కెమికల్ ఫాక్టరీ మాటున గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ తయారు చేస్తున్న ఓ ముఠాను మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసారు.శనివారం మహారాష్ట్ర నుండి వచ్చిన పోలీసుల బృందం డ్రగ్స్ తయారు చేస్తున్న స్థావరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుల నుండి 32 వేల లీటర్ల అత్యంత ప్రమాదకరమైన ఎక్స్‌టిసీ, ఎక్స్‌టిసి మోలి అనే డ్రగ్స్‌ను స్వాధీనపరచుకొన్నారు. ఈ ముఠా గత కొద్ది కాలంగా తయారు చేస్తున్న డ్రగ్స్‌ను దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నట్లు తరువాయి 2లో

## ఎర్రకోటలో రూ. కోటి విలువైన

# రెండు బంగారు కలశాలు చోరీ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో జరిగిన జైన మతపరమైన కార్యక్రమంలో రెండు బంగారు 'కలశం' (కలశం), దాదాపు రూ. 1.5 కోట్ల విలువైన ఇతర విలువైన వస్తువులు చోరీ అయ్యాయి. దొంగ జైన పూజారి వేషంలో వచ్చి విలువైన వస్తువులను దోచుకున్నట్లు సిసిటివి ఫుటేజ్‌లో తేలింది. నిందితుడిని గుర్తించామని, అతన్ని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. దొంగిలించబడిన వస్తువులలో ఒక బంగారు 'జారి' (కలశం), దాదాపు 760 గ్రాముల తరువాయి 12లో

## భారత్ ప్రధాని మోదీతో

# స్నేహంగానే ఉంటా

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** భారత్‌–అమెరికా మధ్య ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండు దేశాలమధ్య సంబంధాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ, "కొన్ని సందర్భాల్లో అలా జరుగుతుంది" అన్నారు. భారత్‌పై సుంకాల భారం, రష్యా నుండి చమురు కొనుగోలు చేయొద్దని ఒత్తిడిచేసేందుకు పెనాల్టీ విధించడం వల్ల ఉద్రిక్తతలు తలెత్తిన ప్రస్తుత పరిస్థితులమధ్య శనివారం వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. "నేనెప్పుడూ నరేంద్రమోదీతో తరువాయి 2లో



## ట్రంప్ సానుకూల

# స్పందన శ్లాఘనీయం

'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ ప్రశంస

**న్యూఢిల్లీ:** భారత్‌–అమెరికా రెండు దేశాలమధ్యా బంధం "ప్రత్యేకం" అని డోనాల్డ్ ట్రంప్ కొనియాడిన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా ఎక్స్ వేదికగా అంతకు సమానంగా ఎంతో సానుకూలంగా స్పందించారు. భారత్‌–అమెరికా భాగస్వామ్యంపై అమెరికా నాయకుడు వ్యక్తం చేసిన సానుకూలమైన విశ్లేషణ శ్లాఘనీయం, ఆయనకు నా అభినందనలు అని పేర్కొన్నారు. "ఎంతో గాఢంగా ఆయనకు నా ప్రశంసలు తెలియజేస్తున్నాను, ఇరు దేశాల సంబంధాల విషయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు ఉన్న భావోద్వేగాలు, సానుకూల విశ్లేషణాత్మకమైన అంచనాలు సంపూర్ణంగా పరస్పరం ఇచ్చిపుచ్చుకునేవి" అని మోదీ పేర్కొన్నారు. "చాలా సానుకూలమైన, భవిష్యత్తులోకి తొంగిచూడగల సమగ్ర,ప్రాపంచిక వ్యూహాత్మక తరువాయి 2లో

## రష్యా నుంచి మూడేళ్ళలో చమురు

# దిగుమతులు నిలిపివేత

- యురోపియన్ యూనియన్ నిర్ణయం
- తీవ్రంగా వ్యతిరేకించిన హంగేరి, స్లోవేకియా దేశాలు




**లండన్:** రష్యా నుండి రాబోయే మూడేళ్ళలో చమురు దిగుమతులను నిలిపివేయాలని యూరోపియన్ యూనియన్ నిర్ణయించింది. కానీ ఈ నిర్ణయాన్ని హంగేరీ, స్లోవేకియా దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోకూడదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యూరప్ దేశాలపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న తరుణంలో ఇ యు ఈ నిర్ణయం తీసుకుంది. గడచిన గురువారం ట్రంప్ ఈ మేరకు యూరోపియన్ యూనియన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో 2028 జనవరి ఒకటో తేదీ నుండి రష్యా నుండి చమురు దిగుమతులు నిలిపివేయాలని ఇ యు ఇంధన వ్యవహారాల కమిషనర్ డాన్ జోర్గెన్‌సన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చైనా తియాన్‌జిన్‌లో ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ) తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## జార్జియా హ్యుండయ్ ప్లాంట్‌పై దాడి
475 మంది వలస ఉద్యోగులు అరెస్టు

**జార్జియా:** అమెరికా జార్జియా రాష్ట్రంలో ఉన్న హ్యుండయ్ కంపెనీ బ్యాటరీ తయారీ ప్లాంట్‌పై అక్రమ వలస కార్మికుల నిరోధక అధికారులు దాడి చేశారు. వీసాలు లేకుండా అక్రమంగా ప్లాంట్‌లో పనిచేస్తున్న 475 మంది ఉద్యోగులను అధికారులు అరెస్టు చేశారు. వీరిలో దాదాపు 300 మంది పైగా దక్షిణ కొరియా దేశీయులే ఉన్నట్లు ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారులు గుర్తించారు. స్వల్పకాలిక, తాత్కాలిక పర్యటనల వీసాలపై వచ్చి ఉద్యోగాలు చేయడానికి అమెరికా నిబంధనలను ఒప్పుకోవని అధికారులు చెప్పారు. అమెరికా దేశీయుల ఉద్యోగాలను కాపాడేందుకే ఈ దాడులు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఐతే అమెరికాలోని కీలక పరిశ్రమల్లో కొన్ని వందల బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా పెడతామని హ్యుండయ్ కంపెనీ ట్రంప్ ప్రభుత్వానికి ఇటీవల భరోసా ఇచ్చింది. అరెస్టుల విషయం తెలియగానే కొరియా ప్రభుత్వం రంగంలోకి దిగింది. అధికారులతో సంప్రదింపులు చేసి, కొరియన్ కార్మికుల హక్కులు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

## ఖలిస్థానీ, హమాస్, హిజ్బుల్లా సంస్థలకు కెనడాలోనే ఆర్థిక మద్దతు
ప్రభుత్వ నివేదిక వెల్లడి



**ఒట్టావా:** ఖలిస్థానీ ఉగ్రవాదులకు కెనడా దేశంలోనే అంతర్గతంగా ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. కెనడా కేంద్రంగా ఆవిర్భవించి పనిచేస్తున్న కనీసం రెండు ఖలిస్థానీ ఉగ్రవాద ముఠాలకు అంతర్గతంగానే నిధులు అందుతున్నాయి. ఖలిస్థానీతోపాటు హమాస్, హిజ్బుల్లా గ్రూపులు కూడా అతిపెద్ద అంతర్జాతీయ సంస్థలుగా ఉగ్రవాద నిధులు అందుకుంటున్నాయి. వ్యాపారాలు, బ్యాంకింగ్ రంగాల సేవలను దుర్వినియోగం చేయడం ద్వారా క్రిప్టో కరెన్సీని ఉపయోగించి చారిటబుల్ సంస్థలను, ప్రభుత్వేతర సంస్థలను ఉపయోగించుకుని వాటి ద్వారా తప్పుడు మార్గాల్లో నిధులు సమకూర్చుకుంటున్నాయి.

ఉగ్రవాదులకు అక్రమ మార్గాల్లో నిధులపై కెనడా ప్రభుత్వం ప్రచురించిన సరికొత్త నివేదిక ఈ విషయం వెల్లడించింది.''అక్రమ మార్గాల్లో ధనం తరలింపు, కెనడాలో ఉగ్రవాదులకు పెట్టుబడుల మద్దతు ప్రమాదం–2025'' అనే పేరుతో అక్కడి ప్రభుత్వం ఈ నివేదిక విడుదల చేసింది. కెనడాలో ఉన్న బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్ అండ్ ద ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ నుండి ఈ నిధులు అందుతున్నట్లు గుర్తించారు. రాజకీయ ప్రయోజనాలతో కూడిన హింసాత్మక ఉగ్రవాదం (పిఎంవిఇ) కేటగిరీ కింద 1980వ దశకం రెండో అర్థభాగం నుండీ కెనడాలో ఖలిస్థానీల పేరుతో ఈ ఉద్యమం ప్రారంభమైందని కెనడా ఇంటిలిజన్స్ ఏజన్సీ ప్రకటించిన రెండు నెలలకు ఈ కొత్త నివేదిక వెలువడింది. భారతదేశం పంజాబ్ రాష్ట్రంలో ఖలిస్థాన్ పేరుతో ఒక స్వతంత్ర రాజ్యస్థాపనకు ఉగ్రవాద మార్గాల ద్వారా ప్రయత్నాలు చేయాలనే ఉద్దేశంతో ఈ ఉద్యమం కెనడాలో నలభై సంవత్సరాలక్రితం ప్రారంభమైందని ఆ దేశ ఇంటిలిజెన్స్ విభాగం ప్రకటించింది. ఒక కొత్త రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేయడం కోసం ప్రస్తుతం ఉన్న వ్యవస్థలోనే అంతర్గతంగా హింసను ఆయుధంగా ఉపయోగించే కొత్త వ్యవస్థను, కొత్త నిబంధలను ఉపయోగిస్తున్నారని నివేదిక తెలియజేసింది. ఈ పిఎంవిఇ విధానంలో మతపరమైన శక్తులతోపాటు స్వయంప్రతిపత్తి సాధించడంకోసం ప్రధానంగా దృష్టిపెట్టిన కారకశక్తులు ప్రధానపాత్ర పోషిస్తూ ఉండి ఉంటారని నివేదిక పేర్కొంది. జాతి, వర్ణపరమైన ఆధిపత్యంకంటే రాజకీయ స్వయంనిర్ణయాధికార ప్రయోజనాలే ఇందులో ఇమిడి ఉండి ఉంటాయని పేర్కొంది. ఈ పిఎంవిఇ కేటగిరీలో కెనడా క్రిమినల్ కోడ్ కింద జాబితాలో అనేక ఉగ్రవాద సంస్థలపేర్లు ఉన్నాయి. హమాస్, హిజ్బుల్లా, ఖలిస్థానీ వంటి హింసాత్మక గ్రూపులు, బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్, ద ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ వంటి సంస్థలు అనేకం ఉన్నట్లు కెనడా ప్రభుత్వ గూఢచారి, పోలీసు వ్యవస్థలు గుర్తించాయి. ఆర్థిక లావాదేవీలు, కెనడా విశ్లేషణ కేంద్రం 2022లో హిజ్బుల్లాను రెండవ అతిపెద్ద అంతర్జాతీయ ఉగ్రవాద కార్యకలాపాల సంస్థగా గుర్తించింది. కెనడాదేశంలో నిధులు ఇతర ప్రయోజనాలకు వెళుతున్నాయని పేర్కొంది.

# ఇద్దరు బందీల వీడియో విడుదల చేసిన హమాస్

**గాజా:** ఇద్దరు ఇజ్రాయెలీ బందీల వీడియోను హమాస్ విడుదల చేసింది. తాము హత్యకు గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆ వీడియోలో ఆందోళన వ్యక్తం చేశారు. గిల్‌బోయా దలాల్, అలోన్ ఓహెల్ అనే ఇద్దరు యువకులు కూడా 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేసినవారిలో ఉన్నారు. యుద్ధం ప్రారంభమైన 22 నెలల తర్వాత కూడా తాము ఇంకా సజీవంగా ఉన్నామంటే నమ్మలేకపోతున్నామని, ఇది కలలా ఉందని, కానీ తమను ఇప్పటికీ హత్య చేసేందుకు చాలా అకాశం ఉందని, తమను హత్యచేస్తారని భయపడుతున్నట్లు గిల్‌బోయా దలాల్ ఆ వీడియోలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. అలోన్ ఓహెల్ కూడా వీడియోలో మాట్లాడుతూ, తన కుకన్ను కనిపించడం లేదని, అంధకారంలో ఉన్నాననీ ఆవేదన వ్యక్తం చేశాడు. అలోన్ దుర్భరమైన పరిస్థితిని చూసి తీవ్రంగా కలవరపడిన అతడి కుటుంబీకులు వీడియో చూపించి వైద్యుణ్ణి సంప్రదించారు. అతడు చెప్పిన ప్రకారం కన్ను పోయినట్టుగానే ఉందని వైద్యుడు కూడా ధృవీకరించాడు. అలోన్ ఓహెల్ కళ్ళు రెప్పలు తరచు టప టపా కొట్టుకుంటున్నాయి. బందీలు, గల్లంతైన ఇజ్రాయెలీ బాధిత కుటుంబాల వేదిక ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఐతే వారున్న దుస్థితికి సంబంధించి హమాస్ విడుదల చేసిన వీడియోనుగానీ, ఆ చిత్రాలను గానీ బయట మీడియాకు విడుదల చేయవద్దని కూడా బందీలిద్దరూ విజ్ఞప్తి చేశారు. తాము గాజా సిటీలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. గాజాసిటీలో ఇజ్రాయెల్ దాడులు ఉద్ధృతంగా కొనసాగుతున్న తరుణంలో తమను చంపుతారని వారు భయం వ్యక్తం చేశారు. హమాస్ మార్గదర్శకత్వంలోనే ఇదంతా జరిగిందని భావిస్తున్నారు. 22 నెలల క్రితం ఇజ్రాయెల్‌లో జరుగుతున్న సంగీతోత్సవంపై హమాస్ ఉగ్రవాదులు దాడి చేసి 1200 మంది కాల్చి చంపి మరో 249 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు.



**బతికున్న 20 మందిలో కొందరు మరణించారు: ట్రంప్**
మరోవైపు ట్రంప్ ఓవల్ ఆఫీసులో శనివారం పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ, హమాస్‌తో తాము చాలా లోతైన చర్చల్లో మునిగి ఉన్నామన్నారు. బందీలను గనుక ఇజ్రాయెల్‌కు అప్పగించకపోతే పరిస్థితి చాలా తీవ్రంగా మారుతుందని, కఠిన చర్యలుంటాయన్నారు. ఎంతో అందమైన యువతీయువకులు హమాస్ చెరలో మరణిస్తున్నారన్నారు. గాజాలో 20 మంది బందీలు సజీవులుగా ఉన్నారని, వీరిలో ఈమధ్య కొందరు మరణించారని చెప్పారు. దాదాపు 50 మంది బందీలు గాజాలో ఉన్నారని, వీరిలో సగంమంది మరణించి ఉంటారని ఇజ్రాయెల్ భావిస్తున్నది. హమాస్ ఉగ్రవాదులకు, అమెరికా ప్రభుత్వానికి మధ్యవర్తిగా ఉండి సంప్రదింపులు చేస్తున్న పాలస్తీనాకు చెందిన అమెరికా రాజకీయ కార్యకర్త భాషాబాహ్ గడచిన బుధవారం సౌదీ అరేబియా వార్తాసంస్థ అల్-అరేబియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, యుద్ధం ముగించి, బందీలందరినీ విడుదల చేయడానికి అమెరికా చేసిన సమగ్ర ఒప్పంద ప్రతిపాదన తుది ప్రతి చర్చల బల్లదగ్గర దగ్గర సిద్ధంగా ఉందని చెప్పారు. హమాస్ కూడా వెంటనే స్పందిస్తూ దీనికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పింది. దీనిపై ఇజ్రాయెల్ బందీలు, గల్లంతైన కుటుంబీకుల వేదిక కూడా స్పందిస్తూ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెప్పింది.

**గాజాసిటీ ప్రజలకు ఐడిఎఫ్ అర్జంట్ వార్నింగ్**
గాజా సిటీలో దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని ఇజ్రాయెల్ సైనిక దళం (ఐడిఎఫ్) ప్రతిజ్ఞ చేసింది. ప్రజలు నగరం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని శనివారం అడిషనల్ అర్జంట్ వార్నింగ్ జారీ చేసింది. శుక్రవారంనాడే గాజా సిటీలో అతి ఎత్తైన భవంతులపై దాడులు చేసి వాటిని నేలమట్టం చేసిన ఐడిఎఫ్ శనివారం దాడులు మరింత ఉద్ధృతం చేసింది. యుద్ధ కార్యకలాపాల నిమిత్తం హమాస్ ఇంటిలిజన్స్ కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్న హైరైజ్ భవంతులపై తాజా దాడులుచేసి నేలమట్టం చేసినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఇజ్రాయెల్ సైన్యం కదలికలను కనిపెట్టేందుకు హైరైజ్ భవంతులలో గస్తీ,నిఘా కేంద్రాలను, సంబంధిత సామాగ్రిని హమాస్ ఏర్పాటు చేసుకుందని, ఈ భవంతులను నేలమట్టం చేశామని ఐడిఎఫ్ ప్రకటించింది. ప్రజలకు ఎక్కువ నష్టం చేయదలచుకోలేదని, ప్రజలు నగరం వదిలివెళ్ళిపోవాలని ఐడిఎఫ్ కోరింది.
23 నెలలుగా గాజాలో ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో 64,000 మంది పాలస్తినా ప్రజలు మరణించారు. లక్షలాది మంది గాయపడ్డారు. 42,000 మంది పిల్లలు అనాథలయ్యారు. గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ వరకూ ఆహార కేంద్రాల వద్ద ఆహారంకోసం ఎదురుచూస్తున్న 2,356 మంది ప్రజలు కాల్పుల్లో మరణించారు.

## లెబనాన్ మంత్రివర్గం నిరాయుధీకరణ
ప్రణాళికకు హిజ్బుల్లా సుముఖత



**సనా:** హిజ్బుల్లా తిరుగుబాటుదారులను దశలవారీగా నిరాయుధులను చేసేందుకు ఉద్దేశించిన ఒక ప్రణాళికకు లెబనాన్ మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీనిని హిజ్బుల్లా కూడా స్వాగతించింది. అంతర్యుద్ధం ద్వారా మూడోదేశం ఆధిపత్యంలోకి వెళ్ళేకంటే దేశంలో ఆయుధాలను వదిలిపెట్టడం విజ్ఞత, వివేకాలతో కూడిన విషయమని ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి హిజ్బుల్లా ప్రకటించింది. హిజ్బుల్లా తిరుగుబాటుదారులు ఆయుధాలు వదలిపెట్టేందుకు ఎలాంటి కాలపరిమితినీ మంత్రివర్గం విధించకుండా శుక్రవారం తీర్మానం చేసింది. లెబనాన్ మిలిటరీ ఈ ప్రణాళిక రూపొందించింది. హిజ్బుల్లాకు వ్యతిరేకంగా లెబనాన్‌లో అదేపనిగా సరిహద్దుల నుండి ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తూ ఉండటం దేశ అవృద్ధికి, దేశ సైన్యం ప్రగతికి పెద్ద ఆటంకంగా ఉందని శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం పేర్కొంది. ఆయుధాలు వదిలిపెట్టేందుకు తొలుత హిజ్బుల్లా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఇప్పటికీ హిజ్బుల్లాలో చాలా మంది ఆయుధాలు పూర్తిగా వదులుకోవడానికి సిద్ధంగా లేరు.

## సమస్యలకు సైనిక చర్య పరిష్కారం కాదు
ట్రంప్‌కు వెనిజులా హితవు



**కారకస్:** సమస్యలకు సైనిక చర్య పరిష్కారం కాబోదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వెనిజులా హెచ్చరించింది. కరీబియన్ ప్రాంతంలో ఈ రెండు దేశాలమధ్యా రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో చర్చలకు వెనిజులా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురో శనివారం ఒక ప్రకటన చేస్తూ, చర్చలద్వారా సమస్యను అర్థం చేసుకుందామని రేడియో సందేశం ద్వారా తెలియజేశారు. వెనిజులా మాదకద్రవ్యాలను రవాణా చేస్తోందని, ఈ ముఠాలకు ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపణలు చేసిన ట్రంప్ కరీబియన్ ప్రాంతంలో వెనిజులా చుట్టూ యుద్ధనౌకలను, క్షిపణి ప్రయోగ నౌకలను మోహరించారు. క్రమంగా వీటిసంఖ్య మరింతగా పెంచుతూ ఉండటంతో వెనిజులా–అమెరికా మధ్య కొద్దిరోజులుగా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. వెనిజులా అధ్యక్షుడు మదురో ఒక ప్రకటన చేస్తూ, తాము డ్రగ్స్ ముఠాలను అదుపు చేస్తున్నామని, ఇటీవల భారీగా డ్రగ్స్ కూడా స్వాధీనం చేసుకుని, నిఘా చర్యలకు భారీగా సిబ్బందిని మోహరించామని చెప్పారు. ఐనప్పటికీ అమెరికా వెనిజులాపై డ్రగ్స్ ముద్ర వేస్తోందని విమర్శించారు. బెదిరింపులు చేస్తే అమెరికాకు లొంగిపోయేదిలేదని, ప్రతిఘటిస్తామని మదురో హెచ్చరిక చేశారు. దీంతో ట్రంప్ రెచ్చిపోయి అమెరికాను బెదిరించేందుకు మదురో ఎలాంటి ప్రయత్నాలు చేసినా వారి యుద్ధ విమానాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని ప్రకటన చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్రిక్తతలను సడలించి శాంతిమార్గంలో వెళ్ళేందుకు ట్రంప్‌తో మదురో చర్చలకు ప్రతిపాదన చేశారు.

## స్నేహంగానే ఉంటా
(మొదటి పేజీ తరువాయి)

స్నేహంగానే ఉంటా, ఆయన గొప్ప ప్రధానమంత్రి, ఆయన గొప్ప నాయకుడు, మేం ఇద్దరం ఎప్పటికీ స్నేహితులమే, కానీ ఆ ముఖ్యమైన సందర్భంలో ఆయన అలా చేయడం నాకు నచ్చలేదంతే'' అన్నారు. ''కానీ భారత్–అమెరికా మధ్య ప్రత్యేక సంబంధం ఉంది, ఈ బంధం గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు, ఒక సందర్భంలో అలాంటి క్షణాలొస్తాయి'' అని నవ్వుమొహంతో చెప్పారు. ''గడచిన రెండు దశాబ్దాలుగా దారుణదశలో కొనసాగుతున్న రెండుదేశాల సంబంధాలను చక్కదిద్దేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?'' అని ప్రశ్నించినప్పుడు ట్రంప్ పైవిధంగా చెప్పారు. ఐతే మళ్ళీ రష్యా ప్రస్తావన తీసుకురావడం మాత్రం ఆయన మానలేదు. ''రష్యా నుండి అంత భారీ పరిమాణంలో చమురు కొనుగోలు చేయడం నాకు చాలా చాలా అసంతృప్తిగా ఉంది'' అన్నారు.
''రష్యా నుండి భారీ పరిమాణంలో చమురు కొనుగోలు చేయడం నాకు చాలా అసంతృప్తిగా ఉంది, ఆ విషయం వారు తెలుసుకోవాలని చెబుతున్నా, భారత్‌పై మేం చాలా భారీగా 50 శాతం మేరకు సుంకాలు విధించాం, చాలా భారీ సుంకాలవి, నేను మోదీతో చాలా బాగా కలిసిపోతాను, మోదీ గొప్ప నాయకుడు, ఆయన రెండు నెలలక్రితం అమెరికా వచ్చారు'' అన్నారు. భారత్, రష్యాలను తాము చైనాకు కోల్పోయామంటూ శుక్రవారం సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్‌పై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ పైవిధంగా జవాబిచ్చారు.
''చూస్తుంటే భారత్–రష్యాలను మేం చైనాకు కోల్పోయినట్లనిపిస్తోంది, వారితో మాకు చాలా సంపద్వంతమైన సుదీర్ఘమైన భవిష్యత్తు ఉండవచ్చుకదా'' అని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఎస్‌సిఓ సదస్సు తర్వాత ట్రంప్ తొలుత ఆలోచనాత్మకంగా స్పందించారు. మోదీ,పుతిన్,జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న పాత ఫోటోను కూడా ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ట్రంప్ యంత్రాంగంలో వాణిజ్య,తయారీరంగ సీనియర్ కౌన్సిలర్ పీటర్ నవర్రో ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, అమెరికా నుండి భారత్‌కు వచ్చే దిగుమతులపై చాలా భారీ సుంకాలను భారత్ విధిస్తోందని పేర్కొన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోలు చేసి శుద్ధిచేసి ఇతర దేశాలకు విక్రయిస్తోందని, దాంతో రష్యాకు చాలా లాభం కలుగుతోందని, ఆ ధనంతో ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగిస్తోందని నవర్రో విమర్శించారు. ఈ విషయాలే ట్రంప్‌ను ఆందోళనకు గురిచేశాయన్నారు.

## యూనిట్ గుట్టు రట్టు
(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన బంగ్లాదేశ్‌కు చెందిన ఓ విదేశీ మహిళా నిందితుడిచ్చిన సమాచారంతో తెలంగాణా రాష్ట్రం మేడ్చల్ జిల్లాకు చేరుకొని డ్రగ్స్ తయారీ ముఠాను అరెస్టు చేసారు. ఇక్కడ తయారు అవుతున్న డ్రగ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్నడిస్ట్రిబ్యుటర్లతో ఏర్పాటు చేసుకొన్న భారీ నెట్‌వర్క్‌తో దేశ విదేశాలకు గుట్టు చప్పుడు కాకుండా కెమికల్స్ పేరిట డ్రగ్స్ తయారు చేసి వివిధ దేశాలకు సరఫరా చేస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు సైతం దర్యాప్తు చేస్తున్నారు.నిందితులను మహారాష్ట్ర పోలీసులు ముంబయికి తరలిస్తున్నారు.
**బంగ్లాదేశ్ మహిళా నిందితులి సమాచారంతోనే**
మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని మీరారోడ్ పోలీసులు గత నెలలో విశ్వసనీయ సమాచారంతో బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లా అనే 23 ఏళ్ల మహిళను అరెస్టు చేసి రూ. 24 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనపరచుకొన్నారు. తదుపరి విచారణలో డ్రగ్స్ తెలంగాణా రాష్ట్రం రాజధానిలోని మేడ్చల్ జిల్లా చర్లపల్లి ప్రాంతంలోని పారిశ్రామిక ప్రాంతంలో కెమికల్స్ ఫాక్టరీలో ఈ డ్రగ్స్ తయారీ అవుతున్నాయన్న విఫయాన్ని నిందితురాలి నుండి తెలుసుకొన్నారు. ఈ మేరకు మహారాష్ట్రకు చెంది వాసాయి విరార్ పోలీసులు, క్రైం బృందానికి చెందిన మీరా భయాందర్ నేతృత్వంలో నిందితురాలిని వెంట తీసుకొని తయారీ కేంద్రమైన కెమికల్స్ ఫాక్టరీకి శనివారం చేరుకొని నిర్వహించిన దాడిలో 32 వేలలీటర్ల డ్రగ్స్ ముడిసరుకు స్వాధీనం చేసుకొని 13 మందిని అరెస్టు చేసారు.

## ట్రైనీ ఐపిఎస్‌లతో కొత్వాల్ ముఖాముఖి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 170 మంది ఐపిఎస్ అధికారులు బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి భవనాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి.వి. ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ తాను విధులు నిర్వహించిన తన అనుభవాన్ని వారితో పంచుకున్నారు. గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని తెలిపారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని కమిషనర్ వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీరామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు , వ్యూహాలు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సీసీటీవీల వాడకం, అలాగే మల్టీఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారులు రామ్ నివాస్ సేపట్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐటి సెల్ డిసిపి పుష్పలు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా ప్రముఖ ఉపాధ్యాయులు సమాజ భవిష్యత్తు రూపకల్పనలో వారి విశిష్ట సేవలకు గాను సన్మానించబడ్డారు. ఈ సందర్భంగా ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, సెక్‌ండ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఎన్నికైన కొత్త నాయకులను అభినందించారు. లయన్ అశోక్ కుమార్ స్ట్రవన్ సెక్‌ండ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా 90% ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. అనంతరం, లయన్స్ ఇంటర్నేషనల్ నిర్ణయం ప్రకారం, ఆయనను ఏకగ్రీవంగా ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ప్రమోట్ చేశారు. గత ఇరువై సంవత్సరాలుగా లయనిజం పట్ల ఆయన కృషి, సమాజ సేవా భావం సభ్యులందరి, డిస్ట్రిక్ట్ నాయకుల మరియు మల్టిపుల్ నాయకుల నుండి ప్రశంసలు పొందింది.

## దేశ, సమాజ మార్పు కోసం కృషి చేసే మహనీయులను గుర్తుంచుకోవాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి ఒక్కరూ దేశ సమాజ మార్పు కోసం తమ వంతు కృషి చేస్తున్న మహనీయులను గుర్తుంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో పలువురు గురువులకు 'శిఖరం ఆర్ట్స్' అవార్డులను శనివారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కోటి రెడ్డి,సిఎస్‌సిసి కోర్టు హైదరాబాద్ సీనియర్ సూపరిండెంట్ పివిసి అంజనీ కుమారి, శిఖరం ఆర్ట్స్ అధినేత కృష్ణ, లంక లక్ష్మీ నారాయణ, కోటిరెడ్డి,టి చక్రపాణి, దామోదరం నాగేందర్, ప్రొఫెసర్ సత్యనారాయణ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కోదాటి అరుణ ,వౌవ్ మ్యూజిక్ అధినేత పి.వి లక్ష్మీ , ప్రముఖ రచయిత, విశ్లేషకురాలు కోదాటి అరుణ, కూచిపూడి గురువు రాగ రంజని, కూచిపూడి నాట్య గురువు సాయి, అరికెపూడి రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తారని, ఇందులో వారు తమ కుటుంబాన్ని కూడా పక్కన పెడుతారని తెలిపారు.

## ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సాధనలో, అభివృద్ధిలో తాను చూపిన నిబద్ధత, పాత్ర అందరికీ తెలుసని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా లేక రైతులు గోస పడుతున్నారని, వరద ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కాగా ఇటీవల బిఆర్‌ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత సస్పెండ్‌కు గురైన తర్వాత బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు మొదటి సారి బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం సమావేశమయ్యారు.
అమెరికా పర్యాటన ముగించుకుని వచ్చిన హరీశ్ రావు తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కెసిఆర్‌తో సమావేశమవ్వడం రాజకీయంగా ప్రధాన్యత సంతరించుకున్నది. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావుతో పాటు పలువురు ముఖ్య నేతలు ఉన్నట్టు తెలిసింది. ఈ సమావేశంలో ఇటీవల కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యాలు,'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకల విషయంలో ప్రభుత్వం సిబిఐకి కేసు అప్పగించడం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు తదితర అంశాలు వారి మధ్యచర్చకు వచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా కవిత చేస్తున్న వ్యాఖ్యలపైన బిఆర్‌ఎస్ తరపున ఎలా స్పందించాలనే విషయమై కూడా చర్చించినట్టు సమాచారం. అయితే ఎక్కువ సమయం 'కాళేశ్వరం ప్రాజెక్ట్, సిబిఐ కోర్ట్, న్యాయపరమైన అంశాల'పైనే చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల శాసనసభలో కాళేశ్వరం నివేదికపై జరిగిన చర్చ, ప్రభుత్వం, బిఆర్‌ఎస్ తరపున వినిపించిన వాదనలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను కూడా సమీక్షించినట్టు సమాచారం.
కాగా తెలంగాణ భవన్ కేంద్రంగా జరిగే పార్టీలో చేరికలు, తదితర సమావేశాలు గత కొంత కాలంగా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి వేదికగా మారినట్టు తెలుస్తోంది. ఈ మధ్య జరిగిన పలు చేరికలు కూడా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోనే జరగడం బిఆర్‌ఎస్ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది.

## స్పందన శ్లాఘనీయం
(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం భారత్–అమెరికా మధ్య ఉంది'' అని మోదీ పోస్టింగ్ చేశారు. ఈ ఏడాది జూన్ 17వ తేదీన ఫోన్ సంభాషణ తర్వాత మళ్ళీ మొదటిసారి ఈ నాయకులిద్దరూ ఈ విధంగా అభిప్రాయాలు పంచుకున్నారు. సరుకు దిగుమతులపై 25 శాతం అదనపు సుంకాలతోపాటు రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నదనే సాకుతో మరో 25 శాతం పెనాల్టీ భారత్‌పై ట్రంప్ విధించాక సంబంధాలు క్షీణదశకు చేరుకుంటున్న దశలో ఎస్‌సిఓ సదస్సులో ఆసియా అగ్రనేతల సమ్మేళనం తర్వాత ట్రంప్ దిద్దుబాటు ప్రయత్నాలను మోదీ ఆహ్వానించారు.
''మోదీతో తానెప్పుడూ స్నేహంగానే ఉంటానని వైట్‌హౌస్‌లో శనివారం పాత్రికేయులకు ట్రంప్ చెప్పిన గంటల వ్యవధిలోనే సోషల్ మీడియా వేదికగామోదీ స్పందించారు. ఐతే, ముఖ్యమైన సందర్భంలో భారత నాయకుడు అలా ప్రవర్తించడం నాకు నచ్చలేదంతే'' అని ట్రంప్ చెప్పారుతప్ప జగద్విదితమైన ఆ ముఖ్యమైన సందర్భం ఏమిటో ఆయన పాత్రికేయులకు వివరించి చెప్పలేదు.

## చమురు దిగుమతులు నిలిపివేత
(మొదటి పేజీ తరువాయి)

సదస్సు, చైనా 80వ యుద్ధ విజయవార్షికోత్సవలలో ఆసియా నాయకుల సమ్మేళనం తర్వాత ట్రంప్‌లో ఆందోళన ఆగ్రహం పెల్లుబుకుతూ ఉండటంతో ప్రతీకారచర్యలు ఉద్ధృతమయ్యాయి. ఐతే హంగేరీ ప్రతిరోజూ రెండు లక్షల బ్యారెల్స్, స్లోవేకియా రెండున్నర లక్షల బ్యారెల్స్ రష్యా చమురును ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూ ఆ దేశంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. జోర్గెన్‌సన్ నిర్ణయాన్ని ఈ రెండు దేశాలూ వ్యతిరేకిస్తున్నాయి.
**ఉక్రేన్‌లో సేనల మోహరింపుపై రష్యా నిరసన**
ఉక్రేన్‌లో 26 దేశాల సేనలను మోహరించేందుకు యూరోపియన్ యూనియన్ సంసిద్ధం కావడం, ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీల విషయాన్ని పరిశీలిస్తానని ట్రంప్ చెప్పడాన్ని రష్యా వ్యతిరేకించింది. యుద్ధానంతర చర్యలుగా ఉక్రేన్‌లో సేనవ మోహరింపు తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. యుద్ధం విరమించిన మరుక్షణమే సెక్యూరిటీ గ్యారంటీ అమలులోకి వచ్చి 26 దేశాల సేనలు అక్కడకు వెళతాయి. త్రివిధ దళాలకు సాయం అందించి రక్షణగా ఉంటాయి. పారిస్ సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది.
**పుతిన్ ఆహ్వానాన్ని తిరస్కరించిన జెలెన్‌స్కీ**
కీవ్: సంప్రదింపులు చేయడానికి మాస్కో రావాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇచ్చిన ఆహ్వానాన్ని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించారు. పశ్చిమ ఉక్రేన్‌లో ఇటీవల రష్యా దాడుల్లో ధ్వంసమైన అమెరికా కర్మాగారాన్ని సందర్శించిన జెలెన్‌స్కీ అక్కడే ఎబిసి వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ, రోజువారీ ప్రాతిపదికపై రష్యా తమదేశంపై క్షిపణిదాడులు చేస్తుంటే ఆ టెర్రరిస్టు దేశానికి చర్చలకోసం తాను వెళ్ళేదిలేదని, ఆయనే తమ రాజధాని కీవ్‌కు రావాలని అన్నారు.
రష్యాకు లొంగిపోయేందుకు మాస్కోకు రావాలని తాము పిలవడంలేదని, సంప్రదింపులకోసమే పిలుస్తున్నామని, అంతకుముందు పుతిన్ అన్నారు. చర్చలకు తమదేశం వ్యతిరేకం కాదన్నారు. జెలెన్‌స్కీ సిద్ధంగా ఉంటే మాస్కోకు రావాలని కోరారు. వెంటనే యుద్ధ పరిష్కారం జరుగుతుందని తాను ఆశించడంలేదని, ఐతే సమస్య పరిష్కారానికి తమ కృషి కొనసాగుతుందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

నేటి అధికారిక కార్యక్రమాలపై నెలకొన్న అనిశ్చితి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శనివారం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కీలకమైన అధికారిక పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఆయన, శ్రీశైలం పర్యటన ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రవీణ్ సూద్ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కోఠిలోని సిబిఐ కార్యాలయంలో అధికారిక సమావేశంలో పాల్గొన్న తరువాత ఆయన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. సిబిఐ అధికారులతో సమీక్షా సమావేశంతో పాటు, కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల దర్యాప్తు పురోగతిపై కూడా ఒక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. అయితే, శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో, వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆసుపత్రిలో చేరడంతో, నేడు జరగాల్సిన అధికారిక సమావేశాలపై అనిశ్చితి నెలకొంది.

# గేమ్ ఛేంజర్‌గా దేవరపల్లి రహదారి


గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి భవిష్యత్తులో తెలంగాణ దక్షిణ భారతదేశానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే ఆర్‌వోబి, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. అధికారులకు, ఏజెన్సీలకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. 160 కిలో మీటర్ల జాతీయ రహదారి పూర్తయితే గంటన్నర సమయంలో రాజమండ్రి వెళ్లవచ్చునన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇక్కడి వారికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే రహదారిగా తయారవుతుందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి డిజైన్స్ ఆలస్యం కావడం వల్ల పనులు ఆలస్యం జరిగిందన్నారు. ధంసలాపురం ఆర్‌వోబి నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్‌వోబి నిర్మాణానికి సంబంధించి హైటెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూ సేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని నవంబర్ నాటికి ఒక వైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, జంగారెడ్డి గూడెం వరకు ఉపయోగపడుతుందన్నారు. కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావాలన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు వేస్తే రైతాంగానికి ఉపయోగపడుతుందని దీనికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయ ప్రాంతం అధికంగా ఉందని, నాగార్జున సాగర్ కాలువ క్రింద ఆయకట్టు ఉన్నందున 365 రోజుల పాటు హార్వెస్టర్ రాకపోకలు ఉంటాయని వాహనాలకు ఆటంకం కలుగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో మున్నేరు బ్రిడ్జితో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.3,500 కోట్లతో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉంటే కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, నేషనల్ హైవే పిడి దివ్య, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ యాకోబ్, ఆర్డీవో జి.నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్:** రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం మంత్రి కొండా సురేఖ వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలోని ఆరు దేవాలయాలకు రూ.4.35 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా కోటి దీపాలను వెలిగించే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని ఒత్తులు వెలిగించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట వద్ద ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం, కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం కాశిబుగ్గ, అబ్బని కుంటలోని మహేశ్వరి దేవాలయాల అభివృద్ధి నవీకరణ పనులకు శనివారం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సౌకర్యార్థంగా ఉండే విధంగా ప్రణాళికబద్ధంగా ఆలయాల్లో నిర్మాణాలు చేపట్టాలని, ఆలయాలకు రంగులు వేసి కొత్తదనాన్ని తీసుకోరావాలనిసూచించారు. తూర్పు నియోజకవర్గానికి 18 దేవాలయాల అభివృద్ధి పనులకు మంజూరు చేశామని, అందులో భాగంగా నేడు ఆరు దేవాలయాల అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన దేవాలయాల అభివృద్ధి పనులను త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. దశలవారీగా అన్ని ఆలయాల అభివృద్ధి, నవీకరణ, పునరుద్ధరణ చేయడతామని తెలిపారు. కాకతీయుల కాలం నాటి చారిత్రాత్మక దేవాలయాలు వరంగల్‌లో అధికంగా ఉన్నందున వాటిని పునరుద్ధరణ చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పురావస్తు శాఖ వారి అనుమతి మంజూరైన తదుపరి ఆయా దేవాలయం అభివృద్ధి చేస్తామని, దేవదాయ శాఖకు సంబంధించిన అన్ని దేవాలయాలకు, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా తాను నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రామ తేజస్వి, శిరీష్, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, ఓని స్వర్ణలత, భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఎండోమెంట్ అధికారి సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొలగించిన 43 మంది జెఎంఇటిలు తిరిగి విధుల్లోకి

పునర్‌నియామక ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి సంస్థ

ఫలించిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రయత్నం

క్రమ శిక్షణతో పని చేయండి : సిఎండి ఎన్.బలరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ కారణాలతో తొలగించిన 'ది సింగరేణి సంస్థ'లో పని చేస్తున్న జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలను (జెఎంఇటి) తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సింగరేణి సంస్థలోని గుర్తింపు పొందిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్'(ఎఐటియుసి) చేసిన ప్రయత్నాలు సఫలమయ్యా యి. తద్వారా టర్మినేట్ చేసిన 43 మంది జెఎంఇటిలను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సింగరేణి యాజమా న్యం అంగీకరించింది. ఈ మేరకు సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గైర్హాజరుకు సంబంధించిన, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం తో వారిని విధుల నుంచి తొలగించినట్టు సింగరేణి సంస్థ తెలిపింది. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్( ఎఐటియుసి) కు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు వీలుగా యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టర్మినేటైన 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలకు ఇది తాజా నియామకంగా గుర్తించారు. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలను, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు మొదలైనవి సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్ నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా ప్రాథమిక అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. వారు తిరిగి ఉద్యోగంలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

**మరో అవకాశం రావడం అదృష్టం.. కష్టపడి పనిచేయండి : బలరామ్**



డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి)కు మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం జూలై 24 నాటికి టర్మినేట్ అయిన జెఎంఇటి వయసు 45 సంవత్సరాల కంటే తక్కువ ఉండి, హైపర్ కమిటీలో దరఖాస్తు చేసుకుని మెడికల్ టెస్టులలో ఫిట్ అయినవారికి జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జెఎంఇటి), టి.ఎస్ గ్రేడ్ సిగా పునర్నియామక పత్రాలను త్వరలో అందజేస్తామని సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ వెల్లడించారు. తిరిగి ఉద్యోగాల్లో చేరుతున్న వీరంతా క్రమశిక్షణతో పనిచేయాలని, వచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ మార్కెట్‌లో ఉద్యోగాలను సాధించడం అతి కష్టంగా ఉంటుందని, ఇలాంటి సమయంలో ఒకసారి తొలగించిన వారి కి మరోసారి అవకాశం కల్పించడం అదృష్టమని, వారికి విలువైన అవకాశాన్ని కల్పించిన కంపెనీకి ఉత్తమ సేవలు అందించాలని బలరామ్ కోరారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో పొందగలరు.

**టెండర్ నోటీసు నం. : 06-GS-SC-II-25-OT, తేదీ: 03-09-2025.** PUB/1086

భారత రాష్ట్రపతి తరపున, CAO/C/RSP/SCR-ENGINEERING/SOUTH CENTRAL RAILWAY, సికింద్రాబాద్ 30-09-2025 15:00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తుంది.

**టెండర్ నం. :** 06-GS-SC-II-25-OT. **పని పేరు:** చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ / గతి శక్తి / హైదరాబాద్ యూనిట్ కోసం ప్రాజెక్ట్ పర్యవేక్షణ సేవలు (PSS) అందించడానికి ప్రతిపాదన (RFP) కోసం అభ్యర్థన. **ప్రకటించబడిన విలువ:** రూ.5,60,80,881.92. **బయానా డబ్బు డిపాజిట్:** రూ.4,30,400.00.

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ / గతి శక్తి / హైదరాబాద్.

**టెండర్ నోటీసు నం. : 36/2025, తేదీ: 04-09-2025 స్టోర్ వస్తువుల సరఫరా** PUB/1088

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

కింది టెండర్లు ఆన్‌లైన్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. టెండరుదారులు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించారు. **టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు.** మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి **14:30 గంటలు.** అన్ని స్వదేశీ ఆఫర్ల కోసం, **www.ireps.gov.in**లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే బయానా డబ్బు డిపాజిట్ అంగీకరించబడుతుంది.

| టెండర్ నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 54255012 | ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు. |
| 54255007A | యూనిఫైడ్ టికెటింగ్ నెట్‌వర్క్స్ WAN పోర్టులతో కూడిన రూటర్లు. |
| 66257552 | స్పేర్ డ్యూట్స్ తయారీ ట్రాక్ మెషీన్ల సేకరణ. |
| 76255001A | IRSM 46-2020కి Mig/Mag వెల్డింగ్ ఫిల్లర్ వైర్. |
| 45251004 | బ్రష్‌లెస్ ఆల్టర్నేటర్ 25kw. |
| 45251073 | 120 AH VRLA బ్యాటరీల సెట్. |
| 66257306 | ట్రాక్ మెషీన్ల కోసం కమ్మిన్స్ తయారు చేసే విడిభాగాల సేకరణ. |
| 66257607 | ట్రాక్ మెషీన్ల కోసం CATERPILAR తయారీ విడిభాగాల సేకరణ. |
| 66256053 | ప్లాసర్ తయారీ ట్రాక్ మెషిన్ విడిభాగాలు. |
| 45251021A | 1100 AH లీడ్ యాసిడ్ బ్యాటరీ. |
| 66256285 | ప్లాసర్ తయారీ ట్రాక్ మెషిన్ విడి భాగాలు. |

**గమనిక:- టెండర్ ప్రారంభ గడువు తేదీలు:** క్ర.సం.: 01 తేదీ: 15-09-2025న, క్ర.సం.: 02, తేదీ: 24-09-2025న, క్ర.సం.: 03 & 04 తేదీ: 25-09-2025న, క్ర.సం.: 05 & 06 తేదీ: 23-09-2025న, క్ర.సం.: 07 & 08 తేదీ: 06-10-2025న, క్ర.సం.: 09 & 10 07-10-2025న, క్ర.సం.: 11 తేదీ: తేదీ: 13-10- 2025న.

**సవరణ**

సంక్షిప్త వివరణ: టెండర్ నోటీసు నెం.31/2025 తేదీ: 01-08- 2025 టెండర్ నెం. 76251092 తేదీ: 26-08-2025న గడువు తేదీ; సాలిడ్ మిగ్ / మాగ్ వెల్డింగ్ ఫిల్లర్ వైర్ 1.2mm డయా క్లాస్-1ని ఇప్పటికే ఉన్న టెండర్లకు బదులుగా గడువు తేదీ: 11-09-2025గా చదువుకోగలరు. పైన పేర్కొన్న టెండర్లతో పాటు రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కోసం, దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.
ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్.

**టెండర్ నోటీసు నం. : TRSO/ SC/01/2025-26, తేదీ: 04-09-2025** PUB/1087

క్రింద సంతకం చేసిన వారు అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్ల నుండి ఈ-టెండర్లు ఈ క్రింది పనుల కోసం ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1. టెండర్ నం. & తేదీ: C/E.29/TRSO/SC/12/2025-26, తేదీ: 04-09-2025 (ఇ-టెండర్ నం. CE-29- TRSO-SC-12-2025-26, తేదీ: 04-09- 2025). **పని వివరణ:** భద్రాచలం రోడ్ & డోర్నకల్ జంక్షన్ నుండి రెండు సంవత్సరాల పాటు వివిధ సిబ్బందిని మార్చుకునే పాయింట్లకు మరియు సైడింగ్‌కు వ్యతిరేకంగా 24 గంటలూ సిబ్బంది రవాణా కోసం ఐదు నాన్-ఎసి MUV వాహనాలను అద్దెకు నియమించడం. **టెండర్ విలువ (రూ.) :** 1,62,16,888/-. **బయానా డబ్బు డిపాజిట్ (బిడ్ సెక్యూరిటీ) (రూ.) :** 2,31,100/-. **టెండర్ ఫారం ధర :** లేదు. **పూర్తి వ్యవధి :** 2 సంవత్సరాలు. **ముగింపు & ప్రారంభ తేదీ మరియు సమయం :** 30-09-2025 15:00 గంటలు & 30-09-2025, 15:30 గంటలు.

1. టెండర్ షరతులు / ఇతర వివరాలు **www.ireps.gov.in** లోని IREPS వెబ్‌సైట్‌లోని టెండర్ డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్నాయి.
2. అన్ని కాబోయే టెండరుదారులు ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా మాత్రమే EMD (బిడ్ సెక్యూరిటీ) చెల్లించాలని అభ్యర్థించారు. టెండర్ డాక్యుమెంట్ సమర్పణ : **www.ireps.gov.in** లోని IREPS వెబ్‌సైట్ ద్వారా.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (TRSO), సికింద్రాబాద్.

**ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం.: DRM/వర్క్స్/BZA/21/2025, తేదీ: 04-09-2025** PUB/1089

**భారత రాష్ట్రపతి** తరపున మరియు వారి తరపున, దిగువ సంతకందారు ఈ క్రింది పనుల కోసం **15:00 గంటల వరకు** మరియు ప్రతిదానిపై పేర్కొన్న తేదీ వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం: 1. టెండర్ నెం: E-37- EAST-BZA-2025. పని వివరాలు: పని పేరు: SSE / వర్క్స్ / BVRM విభాగంలో BVRT వద్ద ఉన్న రైలు రకం COP షెల్టర్‌కు బదులుగా COP షెల్టర్ల ప్రతిపాదన. IRPSM ID: 11.06.53.24.3.55.064. **పూర్తయిన వ్యవధి:** 12 (పన్నెండు నెలలు). **టెండర్ విలువ:** రూ.1,70,18,604.35/-. **బయానా డబ్బు డిపాజిట్:** రూ.2,35,100.00/-. **ముగింపు తేదీ:** 26-09-2025.

1) టెండరు గడువు తేదీకి ముందు కాబోయే టెండరుదారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / సవరణను గమనించడానికి www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించబడింది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ.
A1363

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


# విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల్లో మౌలిక వసతులు మెరుగు కోసం ప్రభుత్వ మొదట ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శనివారం జిల్లాపరిషత్ కార్యాలయంలో జిల్లాలోని కేజీబీవీ మోడల్ స్కూల్ రెసిడెన్సియల్ పాఠశాలలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన మౌలిక వసతులు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యరంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ పాఠశాలలోని సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలలో ఉన్న అన్ని కేజీబీవీ పాఠశాలలు మోడల పాఠశాలో రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ రంగంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పనకు ఎంతగానో ప్రాధాన్యమిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కావాల్సిన వసతులపై సమగ్ర నివేదిక రూపొందించాలని వాటి ప్రాధాన్యాన్ని అనుసరించి సీఎస్ఆర్ నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో ఆయా పరిశ్రమలు చేపట్టిన పనులను ఆయా అధికారులు నిరంతరం తనిఖీ చేసి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు.

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందుతాయన్నారు. సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన ఫర్నీచర్స్, కిచెన్ సామాగ్రి స్పోర్ట్స్ కిట్‌లు పిఎస్ఆర్ నిదులతో అందుబాటులో ఉంచారన్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జడ్పీసీఈఓ జానకిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జానాయక్ సిపఓ బాలశౌరి పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్‌శాఖ, అధికారులు టీఎస్ ఈ డబ్ల్యూ ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టు దేని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసిన ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి పలువురు జర్నలిస్టులకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి ఎంతో విలువలతో కూడినదని, సమసమాజ స్థాపన కోసం జర్నలిస్టులు అనునిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పరిపాలనలో లోటుపాట్లు జరిగినప్పుడు, అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినప్పుడు, దోపిడీ పెరిగిపోయినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చేయాలని, వ్యవస్థను, వ్యక్తులను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలనుగుణంగా జర్నలిస్టు వృత్తిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, వృత్తి నియమాలను పాటిస్తూ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వాన్ని ఒప్పించి పెద్ద ఎత్తున నిధుల తెస్తున్నామని, వివిధ అభివృద్ధి పథకాలు కొనసాగుతున్నాయని అన్నారు. మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ అంశంపై దృష్టి సారించామని, నియోజకవర్గాభివృద్ధికి జర్నలిస్టుల సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో చెప్పామని, అనునిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యాల పట్ల, కుటుంబాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంతో కాలంగా విలేకరులు ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు కృషి మొదలు పెట్టామని, దీనిపై ఇప్పటికే కలెక్టర్‌తో పలు దఫాలుగా చర్చించామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నింస్తామని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు ఇంటి జాగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నం తప్పకుండా ఉంటుందని, దీనిలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. నాగాచారి అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో విలేకరులు మోటమర్రి రామకృష్ణ, జనుమాల రమేష్, పందా సత్యానంద్, కాగితపు వెంకటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరావు, కల్లోజి శ్రీనివాస్, లక్ష్మణ్, శశి, గోవిండ్, సతీష్, నర్సింహారావు, రవి, రాజేష్, ఈశ్వర్, నవీన్, కుమార్, అనుపమ తదితరులు పాల్గొన్నారు.



## నేటి వరకు నిమజ్జనాలు:డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు ముఖ్యంగా హైదరాబాద్‌లో జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాన్ని ఆయన తన కార్యాలయం నుంచి అదనపు డిజిపి మహేష్ భగవత్‌తో కలిసి పర్యవేక్షించారు. ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషరేట్ల కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్ ద్వారా మాట్లాడి అక్కడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రఖ్యాత ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, అయితే వినాయక నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగనున్నాయని జితేందర్ తెలిపారు. నగరంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలాపూర్ గణపతి శోభాయాత్ర కూడా ప్రశాంతంగా సాగిందన్నారు. నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగుతాయని తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీ కంట్రోల్ రూమ్ నుంచి వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఎస్‌డిఆర్‌ఎఫ్ కూడా నిమజ్జన విధుల్లో పాల్గొన్నదని తెలిపారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి






సిపిఐ ఉత్తరాఖండ్ రాష్ట్ర మహాసభల్లో గిరీశ్ శర్మ, అజీజ్ పాషా పిలుపు

**డెహ్రాడూన్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఐ కార్యదర్శులు డాక్టర్ గిరీశ్ శర్మ, సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. నిరంకుశ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం కలిసి రావాలని ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక వాదులను కోరారు. ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజలను చైతన్యపరిచారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఉత్తరాఖండ్ రాష్ట్ర మహాసభలను పార్టీ కార్యదర్శి డాక్టర్ గిరీశ్ శర్మ శనివారం ప్రారంభించారు. తొలుత అరుణ పతాకాన్ని ఎగురవేసి అమరవీరులకు నాయకులు అరుణాంజలి ఘటించారు. మహాసభల ప్రారంభోత్సవానికి సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎన్ నేగి, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర పురోహిత్, సిపిఐ(ఎంఎల్) కార్యదర్శి ఇందరేశ్ మైఖురి తదితరులు హాజరయ్యారు. అతిథులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ కులియల్ స్వాగతం పలికారు.

## 'బిసి రిజర్వేషన్ల బిల్లుల' ఆమోదానికి సిఎం ప్రయత్నాలేవీ?

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం పొందేలా సిఎం రేవంత్ రెడ్డి ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల బిల్లులు ఆమోదించడం తప్ప వాటికి రాష్ట్రపతి ఆమోదం కోసం సిఎం చిన్న ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు. మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరె కటిక సంఘం నాయకులు సురేందర్ తదితర బిసి నాయకులు హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో కవిత సమక్షంలో శనివారం జాగృతిలో చేరారు. అనంతరం బిసి సంఘాల నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే యోచనలో ఉన్నదని, ఇదే జరిగితే ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని కవిత తెలిపారు.

## చాకచక్యంగా గీత కార్మికుడి ప్రాణాలు కాపాడారు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని జనగాం గ్రామంలో శనివారం ఉదయం ప్రమాదం తృటిలో తప్పింది. గ్రామానికి చెందిన కొండూరు చంద్రయ్య కల్లు గీత కార్మికుడు ప్రతిరోజు దినచర్యలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతున్న సమయంలో ఒక్కసారి మోకు జారి పడిపోతుండగా అక్కడే ఉన్న ఇతర గీతా కార్మికులు యాదయ్య, ఇస్తారి, లింగయ్య గీతా పనివారల సంఘం అధ్యక్షుడు నాతి కృష్ణయ్యలు అప్రమత్తమై చెట్టు పైకి ఎక్కి చాకచక్యంగా ప్రాణాపాయం నుండి రక్షించారు. గాయాలు తేలికగా ఉండడంతో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపించారు. పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు చేరుకొని ప్రమాదం స్థలంలో సహాయం చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపాలన అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రామపాలన అధికారుల కౌన్సిలింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అభ్యర్థి సొంత నియోజక వర్గం కాకుండా వేరే నియోజక వర్గంలో ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగ్‌లు కేటాయించడం జరుగుతుందన్నారు. నియామక పత్రాలు తీసుకున్న గ్రామ పాలన అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ నియోజకవర్గ సమావేశం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయములో జరిగింది. ఈ సమావేశానికి ఎలిమినేటి హుస్సేన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకై సెప్టెంబర్ 8న, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాల ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నాలు జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి 2 లక్షల 70 వేల కోట్లు కేటాయించాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారి వేతనము 700 రూపాయలు ఇవ్వాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో, మున్సిపాలిటిలో ఉపాధి హామీ పనిని విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను, మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వృద్ధాప్య పెంచన్ 6000 చేయాలని, మహిళలకు గృహలక్ష్మి పథకం అమలు చేయాలన్నారు. పేదలకు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని, ఇల్లు లేని వారికి ఇల్లు, స్థలాలు లేనివారికి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అన్నారు. ప్రమాదవశాత్తు వ్యవసాయ కార్మికులు చనిపోతే వారికి 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మొగిళ్ళ వెంగలయ్య, కిన్నెర భారీములు, నియోజకవర్గ నాయకులు గంగలి పుల్లయ్య, ఏశమోని మల్లేష్, ఆర్.శంకర్ నాయక్, ఎండి జానీమియా తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్చుకోలేక బిజెపి,బిఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి విమర్శించారు.శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని 1 నెంబర్ వినాయక విగ్రహం వద్ద గణేష్ నిమజ్జనం రోజు బిజెపి జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.వారిద్దరి దిగజారుడు రాజకీయాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి,కుసుకుంట్ల రాజిరెడ్డి,దుబ్బ రూపా అశోక్ సుందర్,బొజ్జ శంకర్, సురిగి వెంకన్న గౌడ్,మామిడి కార్తీక్,గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి రమేష్ యాదవ్ ,ఎగ్గడి సుజాత, బొబ్బలి స్వరూప రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల, సంకల్పంతో లక్ష్యసాధన సులభం

చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ సందర్శించిన జస్టిస్ షమీం అక్తర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** చిన్నారులు కష్టపడి చదివి జీవితంలో మంచి స్థానంలోకి రావాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు.శనివారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని పానగల్ లో ఉన్న చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ ను వారి గజాల అంజుమ్ అక్తర్ తో కలిసి సందర్శించారు.చైల్డ్ కేర్ సెంటర్ లోని చిన్నారులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ జీవితం ఘర్షణలతో కూడుకొని ఉన్నదని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివితేనే ముందుకు వెళ్తారని, ముఖ్యంగా పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని అన్నారు. చదువుకునేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు, సౌకర్యాలను కల్పిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, భారత రాజ్యాంగం చదువుకునే హక్కును కల్పించిందని అన్నారు. దాతల సహకారంతో చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ ను నడిపిస్తున్న నిర్వాహక అధ్యక్షులు శ్యామల నాగసేనారెడ్డిని ఆయన అభినందించారు. ఈ కేంద్రం ద్వారా 500 మందిని చదివించి అభివృద్ధి చేయడం, 43 మంది అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడం చాలా గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్మన్ కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, ఎల్ఐసి పాలసీదారుల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కట్ట వెంకట రెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు వెంకన్న,డిపిసి సభ్యులు గణేష్ ,సిడిపిఓ నిర్మల, మేనేజర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## 9న అప్రెంటిస్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలోని (ప్రభుత్వ ఐటిఐ (బాలికల న్యూ) నందు ఈనెల 9 అప్రెంటిస్ మేళా నిర్వహిస్తునట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ భూక్య శ్రీరాములు తెలిపారు. ఈ అప్రెంటిస్ మేళాలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్,మెకానిక్,డ్రాఫ్ట్ మెన్ సివిల్,ఇన్స్యూట్ట్మెంట్ మెకానిక్,మిషినిస్ట్, స్టెన్‌గ్రాఫి ,కోసా,డ్రెస్ కి మికింగ్,వెల్డర్‌లలో ఉత్తీర్ణులు అయిన అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. మేళాలో హేటరో, డిఈసి, మోదులి కానెస్,అడ్వాసరెస్తా ,రెడ్డీస్ ల్యాబ్ లాంటి ప్రముఖ కంపెనీలు పాల్గొనడం జరుగుతుంది. కావున ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటా, ఆధార్ కార్డ్,2పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌తో హాజరై ఈ అవకాశాన్ని సదినియోగం చేసుకోవాలిని కోరారు.

## ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినా భోజనంలో నాణ్యత ఏదీ?

మోడల్ స్కూల్,జూనియర్ కళాశాల హాస్టల్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** ప్రభుత్వం విద్యార్థిలకు మంచి భోజనం పెట్టాలని మెస్ చార్జీలు పెంచినప్పటికీ విద్యార్థులకు పెట్టె భోజనంలో నాణ్యత ఉండడం లేదని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు.విద్యార్థినుల డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్, వంటగది, బాత్రూంలు, లెట్ రూమ్ లు పరిశీలించి నాన్యమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ పాఠశాలను పరిశీలించారు తరగతిగదులు ఆటస్థలం పరిశీలించి మోడల్ పాఠశాల అభివృద్ధికి స్థానిక నాయకులతో కమిటీ ఉంటుందని, వారందరూ వచ్చి మోడల్ పాఠశాలలో ఏ ఏ సమస్యలు ఉన్నాయని విషయాలకు సంబంధించి పరిశీలన చేసి పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం కస్తూరిబా పాఠశాలకు చేరుకొని రూ.1 కోటి 25 లక్షల తన సొంత ఖర్చుతో నిర్మిస్తున్న తొమ్మిది నూతన తరగతి గదులను, 30కి పైగా బాత్రూంలు లెట్ రూమ్ లను, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు.కస్తూరిబా పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాలను తీగలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను ఫోన్లో ఆదేశించారు... కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు ఆడుకోవడానికి నూతన ఆట స్థలం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను సర్వే చేయించి ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆట స్థలాన్ని ప్రభుత్వ భూమి ఎంతవరకు ఉంటే అంతవరకు విస్తరించాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.





## పూర్తి నష్ట పరిహారం తర్వాతే జాతీయ రహదారి 565 పనులు

నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బాధితులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే జాతీయ రహదారి 565 నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం 565 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరికబాయిగూడెం బైపాస్‌లో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించి నిరసన తెలిపారు. బాధితులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే జాతీయ రహదారి 565 నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్వాసితుల పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు సయ్యద్ హాశం, మాజీ కౌన్సిలర్ ఎండీ సలీం, ఉట్కూరు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం 565 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరికబాయిగూడెం బైపాస్‌లో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పానగల్ నుండి సాగర్ రోడ్డు వరకు బైపాస్ నిర్మాణంలో 35 శాతం మంది బాధితులకు నోటీసులు కానీ నష్ట పరిహారం కానీ అందలేదన్నారు. నోటీస్, నష్ట పరిహారం ఇవ్వకుండా శుక్రవారం కాంట్రాక్టర్లు ఊట్కూరు వెంకట్ రెడ్డి సర్వే నంబరులో కోతకు దశకు వచ్చిన వరి పొలాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎక్కడా పనులు పూర్తికాక ముందే పంట పొలాలు ధ్వంసం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని, పంట మీద ఉన్న పొలాలకు కొంత సమయం ఇచ్చి పనులు చేయాలని కోరారు.

## 1140 గ్రాముల గంజాయి పట్టివేత

ఆరుగురు నిందితుల అరెస్ట్

డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీహార్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1140 గ్రాముల గంజాయిని, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి వివరాలు తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు సొగంద్‌కుమార్ సింగ్, కరణ్‌కుమార్‌లు స్థానికంగా కూలీలుగా పనిచేస్తున్నారని, వీరు గంజాయికి అలవాటు పడి స్థానికంగా గంజాయి సేవించే గాంధీనగర్‌కు చెందిన కుక్కల వంశీ, దైద జగదీష్, తాళ్లగడ్డకు చెందిన షేక్ హైమద్, చైతన్యనగర్‌కు చెందిన జంపాల నిఖిల్‌లను కలుపుకోని ఈజీగా డబ్బులు సంపాదించేందుకు బీహార్ నుంచి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి మరికొందరికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఈనెల 5న రాంనగర్‌బంధం శివారులోని హనుమాన్ వెంచర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.నాగభూషణ్‌రావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ సైదిరెడ్డి తన సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్‌ఐలతోపాటు కానిస్టేబుళ్లు నల్లగంతుల శ్రీను, గండికోట నరసింహ, బూర వీరబాబు, నిమ్మనగోటి సంధ్య, భీమనపల్లి ప్రసాద్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా విక్రయించినా కొనుగోలు చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## పక్షపాతానికి తావు లేకుండా పనిపై శ్రద్ధ

గ్రామ పాలనాధికారులుగా ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి నూరుశాతం విధుల్లో చేరాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామ పాలన అధికారులు పనిపై పూర్తి శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్‌కు హాజరై మాట్లాడుతూ గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్ ను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరుగుతున్నదని, ఎలాంటి సిఫారసులకు ,పక్షపాతానికి ఇందులో తావు లేదని అన్నారు. గ్రామ పాలనాధికారులుగా ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి నూటికి నూరు శాతం విధుల్లో చేరాలని కోరారు. అభ్యర్థులందరి సమక్షంలోనే ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగులు కేటాయించడం జరుగుతున్నదని, అందువల్ల గ్రామ పాలన అధికారులు వారి ఐచ్ఛికం మేరకు తీసుకున్న పోస్టులలో చేరి శ్రద్ధ వహించి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి రెవిన్యూ శాఖపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత గ్రామ పాలన అధికారులపై ఉందన్నారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ఉన్నారు.

**మున్సిపల్ పట్టణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి**

తీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఎక్కువ దరఖాస్తులు స్వీకరించే విధంగా మున్సిపల్ పట్టణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జాతీయ కుటుంబం ప్రయోజన పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు బాగా కృషిచేసిన ఆర్‌డిఓలు, 4 గురు తహసిల్దార్లు,4 ఎంపీడీవోలు,4 గ్రామపంచాయతీ కార్యదర్శులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈనెల 13న జిల్లా స్థాయిలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై నిర్వహించే సమావేశంలో ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానిస్తామని చెప్పారు.శనివారం ఆమె వివిధ అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 6,000 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, మరో నాలుగు వేల దరఖాస్తులను పంపించగలమనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. గడచిన 7,8 సంవత్సరాలలో జిల్లాలో 42,000 మంది కి పైగా చనిపోయినట్లు తమ దగ్గరున్న లెక్కల ప్రకారం తెలుస్తున్నదన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 6న ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాలు,ఓటరు జాబితాలు ప్రచురించాలని, 6 నుండి 8 వరకు అభ్యంతరాల సేకరణ, 9నఅభ్యంతరాల పరిష్కారం,10 న తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పిసీఈవో శ్రీనివాసరావు ,ఆర్ డి ఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి,డి ఆర్ డి ఏ శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు.

## చైన్ స్నాచర్స్ అరెస్ట్... 3తులాల పుస్తెలతాడు స్వాధీనం!



**ప్రజాపక్షం/ హాలియా:** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల ఒక మహిళ మెడలో మూడు తులాల పుస్తెలతాడును దొంగిలించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ శనివారం తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం మండలంలోని శ్రీనాథపురం స్టేజి వద్ద గత నెల 27వ తేదీ సాయంత్రం గ్రామం వైపు వెళ్తున్న ఒక మహిళ మెడలో నుంచి ఇద్దరు యువకులు పల్సర్ బైక్ పై వచ్చి మూడు తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించినట్లు చెప్పారు. ఈ విషయమై బాధితమైన మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పుస్తెలతాడు దొంగిలించిన దొంగలను పట్టుకునేందుకు హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఎస్సై సాయి ప్రశాంత్ కొత్తపల్లి గ్రామ శివారులో బాలాజీ రైస్ మిల్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు చెప్పారని తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరి యువకులు పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన కల్లూరి బ్రహ్మారెడ్డి, మూల మాధవ రెడ్డిలుగా గుర్తించినట్లు చెప్పారు. వీరి నుంచి పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, దొంగలు తమ స్వగ్రామమైన చలకుర్తిలో తమ నివాసంలో వారు దొంగిలించిన మూడు తులాల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరి యువకులని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును చేదించడంలో హాలియా సీఐ సతీష్ రెడ్డి, హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్, నిడమనూరు ఎస్ఐ సురేష్, పోలీసులు సురేష్, హరి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేష్ గౌడ్, హాఫీస్, శివరాజ్ ,రైటర్ కృష్ణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పనులు వేగవంతం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొత్తం ఎన్ని ఉన్నాయని, అవి ఏఏ దశలో ఉన్నాయో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎందుకు మొదలు పెట్టలేదని కలెక్టర్ అడగగా వాళ్ళకి ఆర్థిక స్థోమత సరిగా లేక మొదలు పెట్టలేదని పంచాయతీ సెక్రటరీ కలెక్టర్‌కు వివరించారు. ఇంటి ప్రారంభానికి వాళ్ల చేతిలో డబ్బులు లేకపోతే స్థానిక మహిళా సంఘాల సభ్యులకు చెప్పి సంఘం నుండి రుణాలు ఇప్పించాలని అన్నారు. ఏఈలు కూడా ఆలస్యం చేయకుండా వెంట వెంటనే ఫోటో తీసి అప్లోడ్ చేస్తే లబ్ధిదారుల అకౌంట్‌లలో వెంటనే డబ్బులు జమ అవుతాయ అన్నారు.



### వినాయక నిమజ్జనం పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**ప్రజాపక్షం/బీబీనగర్ :** గత తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బీబీనగర్ పెద్ద చెరువు వద్ద ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ల సహాయంతో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా విగ్రహాలు తీసుకువచ్చే వారికి సహాయ, సహకారాలు అందించి నిమజ్జనాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ అధికారులు సీఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్సై రమేష్, అమర్ సింగ్, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా దరఖాస్తుల స్వీకరణ

కేజీబీవీ విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం తిన్న జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/చండూరు:** కుటుంబ పెద్ద చనిపోయిన పరిస్థితుల్లో కుటుంబానికి సహకారంగా జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఒకే సారి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు.శనివారం ఆమె చండూరు తహసీల్దార్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ పెద్ద ఒక వేళ ఏదైనా కారణం చేత మరణించి ఉంటే జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అతి పెద్ద కుటుంబం అర్హులని, ఈ పథకం కింద అవసరమైన ధ్రువపత్రాలు జతచేస్తూ దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో వారి కుటుంబ సభ్యుల అకౌంట్లో 20 వేలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ చండూరు మున్సిపాలిటీలో జాతీయ కు టుంబ ప్రయోజన పథకం దరఖాస్తులను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో దరఖాస్తులను స్వీకరణ వేగవంతం చేయాలని,జాతీయ కుటుం బ ప్రయోజన పథకం పై మున్సిపల్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ కుటుంబ ప్ర యోజన పథకం పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పరిశీలించారు. చండూరు డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి కేజీబీవీ పరిసరాలు, కిచెన్, స్టోర్ రూ మ్, వాష్ ఏరియాను పరిశీలించారు. విద్యార్థుల తో ముఖాముఖి మాట్లాడి వారితో కలిసి మధ్యా హ్న భోజనం చేశారు. చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, ఎంపిడిఓ యాదగిరి ఉన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎస్ఐఆర్ సన్నద్ధతపై ఇసి కీలక భేటీ

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఇటీవల ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన ఎన్నికల సంఘం, ఇప్పుడు దేశవ్యాప్తంగా చేపట్టాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రతినిధులతో దేశవ్యాప్త అమలుకు సంబంధించిన సంసిద్ధతపై చర్చించనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు వచ్చే వారం రాష్ట్ర ప్రతినిధులతో చర్చించనున్నట్లు చెప్పారు. పోల్ అథారిటీ బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 10న జరగనున్న సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరిలో జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మూడ సిఇఒల సమావేశం. బిహార్ తర్వాత, దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం స్పెషల్ రివిజన్ నిర్వహించనుందని పేర్కొన్నారు. 2026లో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎస్ఐఆర్ ప్రాథమిక లక్ష్యం విదేశీ అక్రమ వలసదారులను తనిఖీ చేయడం ద్వారా వారిని తొలగించ డం. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ విదేశీ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

## నిర్భయంగా, నిష్పక్షపాతంగా చట్ట పాలన అమలు చేయడం కోర్టుల విధి



### నేషనల్ లా యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో 'సుప్రీం' న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఉద్బోధ

**న్యూఢిల్లీ :** చట్టపాలనను కాపాడుకోవాలంటే ప్రజాస్వామ్యం సారాంశాన్ని భయం లేదా పక్షపాతం లేకుండా దానిని అమలు చేయడం కోర్టుల విధి అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బి.వి.నాగరత్న ఉద్బోధించారు. శనివారం నేషనల్ లా యూనివర్సిటీ 12వ స్నాతకోత్సంలో ప్రసంగించారు. చట్టం అంటే కేవలం రూల్స్‌కు సంబంధించింది మాత్రమే కాదని, సంపద, హోదా, కులం, లింగం, నమ్మకంతో సంబంధం లేకుండా ప్రతీ వ్యక్తినీ చట్టం ముందు సమానమైన అంశంగా పరిగణించబడుతుంది అన్నారు. చట్టాన్ని శక్తివంతులు మాత్రమే చేరుకోగల కోటగా చూస్తారని, అయితే న్యాయవాదులు హక్కులు, పరిష్కారాల మధ్య వారధిగా మారడం ద్వారా దీనిని మార్చవచ్చని ఆమె అన్నారు. న్యాయవాద వృత్తి పరివర్తనకు ఒక వాహనం అన్నారు. ముఖ్యంగా భారతీయ సమాజంలో 'చారిత్రక మినహాయింపులు, పాతుకుపోయిన అసమానతలు కొనసాగుతున్నాయి' అని పేర్కొన్నారు. 'చట్టపాలన దాని సారాంశం అయిన ప్రజాస్వామ్యంలో అది సంరక్షించబడుతుంది, అమలు చేయబడుతుంది. చట్టపాలన దాని సారాంశం అయిన ప్రజాస్వామ్యంలో దానిని ముఖ్యంగా న్యాయస్థానాలు కాపాడుకోవాలి లేదా అమలుచేయాలి.ప్రజాస్వామ్యం సారాంశంగా చట్ట పాలనను కాపాడుకోవాలంటే భయం లేదా అనుకూలత, పక్షపాతం లేదా ద్వేషం లేకుండా దానిని అమలు చేయడం కోర్టుల విధి. చట్టబద్ధమైన పాలన అనేది అత్యంత ముఖ్యమైన లక్షణం, ఎందుకంటే భారతదేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉంది. ఇతరులతో పాటు ఇండిపెండెంట్ బార్‌కు మద్దతు, సహాయం కారణంగా సుపరిపాలన కొనసాగుతోంది' అని జస్టిస్ నాగరత్న చెప్పారు. రాజ్యాంగాన్ని దాని గొప్పతనం, ఉద్దేశంతో అమలు చేయాల్సిన బాధ్యత అధికార వర్గాలలోని వ్యక్తులపై మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని సమర్థించాల్సిన ప్రతీ న్యాయవాదిపైనా ఉందని వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వాణిజ్యం, లాభదాయక అవకాశాలు పెరుగుతున్న ఈ రోజుల్లో చట్టపరమైన జీవితం అంటే మొదటగా ప్రజాసేవలో జీవించడం అని మర్చిపోవడం సులభమని ఆమె అన్నారు. 'చాలా తరచుగా చట్టాన్ని బలవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే కోటగా చూస్తారు. కానీ మీచేతుల్లో అది వారధిగా మారాలి. హక్కులు, పరిష్కారాల మధ్య రాజ్యాంగం, పౌరుడి మధ్య, న్యాయం మరియు ప్రజల మధ్య వారధిగా మారాలి. చట్టం అందరికీ చెందుతుందని గుర్తుంచుకోండి .కానీ అందరూ దానిని పొందలేరు. ఈ ప్రాప్యత నిరాకరించబడకుండా చూసుకోవడంలో మీరు విభిన్నంగా ఉండాలి' అని జస్టిస్ నాగరత్న సూచించారు.యువ న్యాయవిద్యార్థులకు సలహా ఇస్తూ, రాజ్యాంగ పరిచారకులుగా, న్యాయవాదులు వాణిజ్య పరిస్థితులను సులభతరం చేస్తే, సమాజంలో విశ్వాసాన్ని పెంపొందించినట్లయితే, రాజ్యాంగ విలువలతో పౌరనిర్మాణాన్ని నిర్మించడంలో వారు సరైన పాత్రను పోషిస్తేనే భారతదేశం సరైన మార్గంలో పురోగతి సాధించగలదని జస్టిస్ నాగరత్న ఉద్బోధించారు.' చారిత్రక మినహాయింపులు, పాతుకుపోయిన అసమానతలు కొనసాగుతున్న మనలాంటి సమాజంలో న్యాయవాద వృత్తి కేవలం ఒక నినాదం మాత్రమే కాదు, పరివర్తనకు ఒక వాహనం' అని ఆమె వివరించారు.

## టెంట్లలోనే 'యమున' బాధితులు





### బురదనేల, దోమల మధ్య బిక్కుబిక్కు మంటూ జీవనం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా యమునా నది ప్రమాదస్థాయికి మించి ప్రవహించగా 70కి పైగా కుటుంబాలు నిరాశ్రులయ్యాయి. ఇప్పుడు వీరంతా అక్షరధామ్ సమీపంలోని ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే వెంబడి తాత్కాలిక గుడారాలలో ఒకవైపు బురద, మరోవైపు దోమకాట్లు మధ్య బిక్కుబిక్కుమంటూ జీవనం కపడుతున్నారు. టార్పాలిన్ టెంట్ బయ ట కూర్చున్న గంగాదేవి పేదలందరూ ఎక్కడి వె ళ్లారో అని దీనంగా యోచిస్తోంది. తమ ఇళ్లు కూ ల్చివేతలు లేదా వర్షం వల్ల తమకు ఈ దుస్థితి రాలేదని, కేవలం యమునా నది ఉప్పొంగడం వల్లేనని పేర్కొంది. ఢిల్లీలో చెత్తను శుభ్రం చేయ డం ద్వారా తాము రోజుకు రూ. 300 నుండి 400 వరకు సంపాదిస్తామని, కొందరం చెత్త ఏరుతామని, కొందరు డ్రైనేజీలు శుభ్రం చేస్తారని, ఇంకొందరు పువ్వులు అమ్ముతూ జీవనం గ డుపుతారని, అయితే ఇప్పుడు తామంతా ఎక్కడి వెళ్లాలని ప్రశ్నించారు. 6x8 సైజులో ఎక్స్‌ప్రెస్‌వే అంచున తాత్కాలిక శిబిరం ఏర్పాటు చేయగా, ఇది ఇటీవల యమునా వరద మైదానాలకు సమీపంలో ఉన్న వారి జుగ్గీలు లేదా కుచ్చా ఇంటి నుండి ఖాళీ చేయవలసి వచ్చిన కుటుంబాలకు 'ఇల్లు'గా మార్చబడింది. అటువంటి ఒక టెంట్ లోపల ఇటుకలపై ఒక చిన్న స్టవ్, కొన్ని స్టీల్ ప్లేట్లు, నల్లబడిన పాన్ వంటగదిలో కనిపించాయి. టెంట్ మీదుగా తడి బట్టలు వేలాడుతున్న ఒక తీగ ఉంది. ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండటంతో బట్టలు ఎండిపోవడం లేదని, రెండు జతల బట్టలు మాత్రమే ఉండడం వల్ల వాటినే తాము ధరించాల్సి వస్తుందని కమలేష్ కుమార్ పేర్కొన్నారు. ఏడుస్తున్న తన కొడును ఒడిలో పడుకోబెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తూ తన దీనగాథను వినిపించాడు. అదే విధంగా ముగ్గురు పిల్ల ల తల్లి మీనా కుమారికి పరిమిత స్థలంలో జీవితాన్ని గడపాల్సి రావడం నిత్యం ఇబ్బందిగా మారింది. రాత్రిపూట ఒక బిడ్డ నిద్రలోకి జారుకునే సమయంలో మరొక బిడ్డ కూడా మేల్కొంటుందని, తాము ఆరుబయటే వంట చేస్తున్నామని, వర్షం పడితే ప్రతీదీ తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేసింది. కానీ వరదలు తమ కలలను, జుగ్గీని మింగిన తర్వాత తమకు మిగిలి ఉన్నది ఈ టెంట్ మాత్రమేనని చెప్పుకొచ్చింది. సాయంత్రాలో తమ తమ పిల్లలు టెంట్ల వెనుక ఆడుతూ ఒకరినొకరు తోసేసుంటున్నారని, ఈ సమయంలో తమ కుటుంబాలకు చెందిన పిల్లలు యము నా నది దగ్గరకు లేదా రోడ్డు పక్కన వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాల్సి వస్తోందన్నారు. ఈ శిబిరం ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరం గా ఉందని, అక్కడ భారీ ట్రక్కులు, కార్లు అన్ని సమయాల్లోనూ వేగంగా వెళ్తాయని అని హరీష్ చెప్పారు. తమ పిల్లలు ఆడుకుంటూ హైవే వైపు పరిగెత్తేస్తారేమో అన్న భయం తమను నిత్యం వెంటాడుతుందన్నారు. ఇదిలా ఉండగా, శనివారం ఓల్డ్ రైల్వే బ్రిడ్జి (ఒఆర్‌బి) వద్ద యమునా నది మట్టం 206.47 మీటర్లుగా నమోదై, చాలా రోజుల తర్వాత 207 మీటర్ల మార్క్ నుండి తగ్గుతోందని అధికారులు తెలిపారు.



నది ప్రవాహాన్ని, సంభావ్య వరద ప్రమాదాలను ట్రాక్ చేయడానికి ఓల్డ్ రైల్వే బ్రిడ్జి కీలకమైన పరిశీలన కేంద్రం గా పనిచేస్తుంది. గత కొన్ని రోజులుగా న ది అధిక ఆటుపోట్ల కారణంగా నది ఒడ్డున ఉన్న అనేక ప్రాంతాలను ముంచెత్తింది. నదికి సమీపంలోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను తాత్కాలికంగా ఉంచడానికి ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, మయూర్ విహార్, కశ్మీర్ గేట్, సమీప ప్రాంతాలలో టెంట్లు ఏర్పాటు చేశారు.

## స్టార్‌మర్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

### ఉపప్రధాని డేవిడ్ లమ్మీ, విదేశీమంత్రి కూపర్

**లండన్:**బ్రిటన్ ప్రధానమంత్రి, లేబర్‌పార్టీ నాయకుడు కీర్ స్టార్‌మర్ ఆకస్మికంగా తన మంత్రివర్గాన్ని పునరుద్ధరించారు. ఉప ప్రధానమంత్రి ఏంజెలా రేనర్‌పై విచారణ సందర్భంగా నిజానిజాలు వెల్లడి కావడంతో శుక్రవారం ఆమె ఆకస్మికంగా పదవికి రాజీనామా చేయడంతో మంత్రివర్గాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి స్టార్‌మర్ తక్షణ చర్యలు తీసుకున్నారు. ఏంజెలా రేనర్ స్థానంలో ఉప ప్రధానమంత్రిగా డేవిడ్ లమ్మీని నియమించారు. ఆయన న్యాయశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. ఇప్పటివరకూ ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆయన స్థానంలో మహిళా ప్రతినిధి వై వెట్టే కూపర్‌ను విదేశాంగమంత్రిగా నియమించారు. ఇప్పటివరకూ కూపర్ దేశీయాంగమంత్రిగా విధులు నిర్వహించినప్పటికీ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడంలో కూడా ఆమె విఫలమయ్యారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఐతే కీర్ స్టార్‌మర్ కూడా పనితీరుకు సంబంధించి ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఆయనకు ప్రస్తుతం ప్రజల్లో 'పూర్ రేటింగ్' ఉంది. ఉపప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏంజెలా రేనర్ సముద్రతీర ప్రాంతంలో 40,000పౌండ్లతో నిర్మించుకున్న లగ్జరీ భవంతికి పన్నులు చెల్లించడంలో విఫలమయ్యారని విచారణలో తేలడంతో ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మంత్రుల పనితీరును మెరుగుపరచడంలో స్టార్‌మర్ విఫలమయ్యారని ప్రతిపక్షం విమర్శించింది.



## జిఎస్‌టి పన్ను సవరణ మైలురాయి

### రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లేఖ



**న్యూఢిల్లీ :** సహకార సమాఖ్య స్ఫూర్తిని నొక్కిచెబుతూ కేంద్ర ఆర్థిఖ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ఒక లేఖ రాశారు. వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) విధానం మైలురాయి సవరణను అమలు చేయడంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మద్దతు, చురుకైన పాత్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. పన్నుల రేట్లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదనపై రాష్ట్రాలు వాటి అభిప్రాయాలు తెలియజేశాయని, కానీ అది చివరకు సామాన్యుల ప్రయోజనాల కోసమేనన్న విషయాన్ని అంగీకరించడం సంతోషదాయకం అన్నారు. ఈ వారం ప్రారంభంలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయానికి రావడానికి ఈ వాదన సహాయపడిందని మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం 'పిటిఐ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. సెప్టెంబరు 22 నుంచి జరుగనున్న సరికొత్త మార్పులో వెన్న నుండి చాక్లెట్లు, షాంపూల నుండి ట్రాక్టర్లు, ఎయిర్ కండీషనర్ల ధరలు తగ్గడం చూడబోతున్నాం. సెప్టెంబరు 3న జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం దీనిని అంగీకరించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వం వహించే ఈ ప్యానెల్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. 'నిన్న (శుక్రవారం) నేను రాష్ట్రాలకు చెందిన ప్రతీ ఆర్థిక మంత్రికీ రాసిన లేఖలో కృతజ్ఞతలు తెలియజేశాను. మీరు ఎన్ని తీవ్రమైన వాదనలు చేయవచ్చు కానీ చివరకు కౌన్సిల్ సందర్భానికి తగ్గట్లుగా స్పందించి భారత ప్రజలకు, భారతదేశంలోని ప్రజలందరికీ ఒక గొప్ప ఉపశమనం కలిగించారు. అందువల్ల నేను ఒక లేఖ రాస్తున్నాను' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. కౌన్సిల్‌లో పని 'నిజంగా అద్భుతమైనది' అని ఆమె తెలియజేశారు. చాలా ఉత్పత్తులను వర్గీకరించి కేటగిరీలుగా చేయడం వల్ల ఆదాయం కోల్పోతుందనే భయాలు ఉన్నప్పటికీ సాధారణ వినియోగ వస్తువులకు 5శాతం, మిగతా వాటికి మిగతా వాటికి 18శాతం, 12 మరియు 28 శ్లాబులను తొలగించడం ద్వారా జిఎస్‌టి పునర్విభజనకు కౌన్సిల్ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. కేంద్రం చేసిన ప్రతిపాదనను చర్చించడానికి సెప్టెంబరు 3నుండి రెండు రోజుల పాటు ప్యానెల్ సమావేశం కావాల్సి ఉంది. కానీ రోజంతా జరిగిన సమావేశం తర్వాత మొదటిరోజే దానిని ఆమోదించింది. 'అందువల్ల సభ ఉద్దేశం ఏమిటంటే, సామాన్యులకు నిస్సందేహంగా ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదన ఇది. దీనికి వ్యతిరేకంగా నిలబడటంలో అర్థం లేదు. చివరికి అందరూ ఒక మంచి కారణం కోసం కలిసి వచ్చారు. నేను నిజంగా చాలా కృతజ్ఞతలు చెబుతున్నాను' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. 'రాష్ట్రాలు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటాయని, పన్ను కోతల తర్వాత వారి ఆదాయ ప్రభావం గురించి మాత్రమే వారి ఆందోళన' అని మంత్రి చెప్పారు. శనివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ ఒక ముఖ్యమైన పన్ను సంస్కరణలను అమలు చేయడంలో రాష్ట్రాల సహకారం, సహకార ప్రయత్నాలకు ఆమె కృతజ్ఞతలు వెల్లడించారు. జిఎస్‌టి కౌన్సిల్‌లో రాష్ట్రాల భాగస్వామ్యం, సంస్కరణల పట్ల వారి నిబద్ధతను కూడా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు.

## స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకే... ముంబయికి బాంబు బెదిరింపులు

### పోలీసు దర్యాప్తులో వెల్లడి, నిందితుడి అరెస్టు


**ముంబయి :** వినాయక నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్న సమయంలో శుక్రవారం ముంబయికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెయిల్స్ పంపిన నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని బిహార్‌లోని పాటలీపుత్రకు చెందిన అశ్వినికుమార్‌గా గుర్తించామన్నారు. గత ఐదేళ్లుగా నోయిడాలో నివసిస్తున్నాడని చెప్పారు. తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకోవడానికే నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. అతడు వృత్తిరీత్యా జ్యోతిషుడని పేర్కొన్నారు. 2023లో ఓవివాదం విషయంలో అశ్వినీ కుమార్ స్నేహితుడు ఫిరోజ్ అతడిపై కేసు పెట్టాడు. దీంతో అశ్వినీ కుమార్ మూడు నెలలపాటు జైలు శిక్ష అనుభవించాడు. దీనిపై ప్రతీకారం తీర్చుకోవడాని కి నాటి నుంచి ఎదురు చూస్తున్నాడు. శనివారం వినాయక నిమజ్జనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ముంబయికి బాంబు బెదిరింపులు వస్తే.. కఠిన శిక్ష పడుతుందనే ఉద్దేశం తో శుక్రవారం తన స్నేహితుడు ఫిరోజ్ పేరుతో ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఉగ్ర బెదిరింపు మెయిల్స్ పంపాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు అశ్వినీ కుమార్‌ను అ దుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమరీ కార్డ్ హోల్డర్లు, రెండు డిజిటల్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. 34 వాహనాల్లో మానవబాంబులు ముంబయిలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరిం పు కాల్ వచ్చింది. ముంబయిలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులను ఏర్పాటు చే శాం. 400 కిలోల ఆర్డీఎక్స్ ఉంది. ఇప్పుడు తా ము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబ యి నగరాన్ని కుదిపేస్తాయి అని మెయిల్‌లో పే ర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. లష్కరే జిహాదీ అ నే ఖాతా నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూ ప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు తెలిపారు.

## తెగిన కార్గో రోప్ వే.. ఆరుగురు మృతి



**అహ్మదాబాద్:** కొండపై ఉన్న ఆలయం వద్ద కార్గో రోప్ వే తెగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది మరణించారు. పోలీసులు, అ గ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు శక్తిపీఠమైన పావగఢ్ కొండ ఆల యం వద్ద గూడ్స్ రోప్‌వే వైర్ తెగిపోయింది. కొండపైకి నిర్మాణ సామాగ్రిని తీసుకెళ్లడానికి ఉపయోగించే కార్గో ట్రాలీ కేబుల్స్ తెగిపోయాయి. దీంతో నాల్గవ టవర్ నుంచి ట్రాలీ కిందపడింది. కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయ క చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించినట్లు పంచమహల్ కలెక్టర్ ధృవీకరించారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ మెన్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. సాంకేతిక బృందంతో ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతామని అన్నారు. మరోవైపు పావగఢ్ ఆలయం సుమారు 800 మీటర్ల ఎత్తులో ఉన్నది. 2,000 మెట్లు ఎక్కడం లేదా కేబుల్ కార్ల ద్వారా భక్తులు, యాత్రికులు శిఖరానికి చేరుకుంటారు. అయితే శనివారం ప్రతికూల వాతావరణం కారణంగా ప్రజలు ఉపయోగించే రోప్‌వేను మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు.

## హనీమూన్ హత్యకేసు... 790 పేజీలతో చార్జిషీట్



**షిల్లాంగ్ :** హనీమూన్‌కు తీసుకెళ్లి భర్తను హత్యచేసిన కేసు ఇటీవల దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. రాజా రఘువంశీ హత్య కేసులో మేఘాలయ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో మృతుడి భార్య సోనమ్ సహా ఎనిమిది మంది నిందితులపై పోలీసులు అభియోగాలు మోపారు. సోహ్రా సబ్‌డివిజన్‌లోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ముందు శుక్రవారం పోలీసులు 790 పేజీల చార్జిషీట్‌ను సమర్పించారని తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వివ్వేక సియెమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ప్రకారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ, అతని భార్య సోనమ్ సోహ్రాకు వెళ్లే ముందు మే 21న షిల్లాంగ్‌కు వెళ్లారు. మే 26న, ఆ జంట కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు దాఖలైంది. దీనితో సోహ్రా పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌ఒటి), ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ట్రెక్కింగ్ గ్రూపులు, స్థానిక గ్రామస్తులు భారీ గాలింపు ఆపరేషన్ నిర్వహించారు. రోజుల తరబడి గాలింపు జరిపిన తర్వాత, జూన్ 2న సోహ్రాలోని ప్రసిద్ధ వీ సావ్‌డాంగ్ జలపాతం సమీపం ఉంబ్లాయ్‌లోని అర్లియాంగ్ రియాట్ కునోంగ్రిమ్ వద్ద ఉన్న లోతైన లోయ నుండి రాజా రఘువంశీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోహ్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, తూర్పు ఖాసీ హిల్స్ ఎస్‌పి (నగరం) హెర్బర్ట్ ఖార్కోంగోర్ నేతృత్వంలో ఇతర సీనియర్ అధికారులతో కలిసి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి) ఏర్పాటు చేశారు. రాజ్ కుష్వాహాతో సోనమ్ సంబంధం పెట్టుకున్నట్లు దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. ఈ ఇద్దరు, ముగ్గురు అద్దె దుండగులతో కలిసి, హనీమూన్ నెపంతో రఘువంశీని చంపడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. సోనమ్ సమక్షంలో లోయ వద్ద ఆకాశ్‌సింగ్ రాజ్‌పుత్, విశాల్‌సింగ్ చౌహాన్, ఆనంద్ కుర్మి ఈ హత్యను చేశారని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించిన వారంలోపే సోనమ్‌తో సహా ఐదుగురు నిందితులను గుర్తించి వారిని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా తెలుసుకున్నారు. సోనమ్ రఘువంశీ, రాజ్ కుష్వాహా, ఆకాష్ సింగ్ రాజ్‌పుత్, విశాల్ సింగ్ చౌహాన్ ఆనంద్ కుర్మిలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) (హత్య), 238 (ఎ) (సాక్ష్యాలు అదృశ్యం), 61(2) (నేరపూరిత కుట్ర) కింద అభియోగాలు మోపినట్లు పోలీసులు ఒక ప్రకటన తెలిపారు. తర్వాత, సాక్ష్యాలను నాశనం చేయడంలో వారి పాత్రకు సంబంధించి మరో ముగ్గురు నిందితులు లోకేంద్ర తోమర్, బల్లా అహిర్వార్, శిలోమ్ జేమ్స్‌లను గ్వాలియర్, షాడోరా, దేవాస్‌లో అరెస్టు చేశారు.

## భారత్ పరాక్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన 'ఆపరేషన్ సిందూర్'

### వైమానికదళ ప్రధానాధిపతి అమర్‌ప్రీత్

**చెన్నై:** ఆపరేషన్ సిందూర్ భారతదేశ పరాక్రమానికి నిదర్శనమని వైమానికదళ ప్రధానాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. సూటిగా గురిచూసి ఖచ్చితమైన లక్ష్యాలను ఎంచుకుని, శత్రువును నిర్ణయాత్మకంగా శరవేగంగా దెబ్బతీయడంద్వారా భారత సాయుధబలగాలు తమ శక్తిసామర్థ్యాలు చాటిచెప్పి దేదీప్యమానంగా ప్రపంచానికి ఆ వెలుగులు ప్రసరింపజేశాయన్నారు. భారతదేశ త్రివిధ దళాలమధ్య, ఇతర సాయుధ సంస్థలమధ్య ఉన్న సమన్వయ సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ తెలియజెప్పిందన్నారు. చెన్నైలోని వైమానిక దళాధికారుల శిక్షణాపీఠంలో శిక్షణ ముగించుకుని విధుల్లోకి వెళుతున్న అధికారుల పనితీరును సమీక్షించిన అనంతరం అమర్ ప్రీత్‌సింగ్ వారిని ఉద్దేశించి ప్రసంగించారు. మొత్తం 130 మంది అధికారులు, మరో 25 మంది మహిళా అధికారిణులు భారత సాయుధ సేవా బలగాల్లో వివిధ బాధ్యతల్లోకి వెళ్ళనున్నారు. కాగా తొమ్మిది విదేశాలకు చెందిన 12 మంది మహిళా అధికారిణులు కూడా ఈ శిక్షణాపీఠంలో విజయవంతంగా తమ శిక్షణ పూర్తిచేసుకున్నారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో స్నేహసంబంధాలను కొనసాగించడం,పెంపొందించుకోవడంలో భాగంగా వారు ఈ శిక్షణ తీసుకున్నారు. యుద్ధతంత్రంలో శరవేగంగా మార్పులు సంభవించడం, ప్రపంచవ్యాప్తంగా సైనికపాటవశక్తి ప్రాధాన్యత రోజు రోజుకూ పెరగడం అనే రెండు విషయాలను ఖచ్చితంగా భవిష్యత్తులో సంభవించబోయే విషయాలని, వీటిని గుర్తెరిగి వ్యవహరించాలని ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కొత్తగా విధుల్లోకి వెళ్ళబోయే అధికారులకు హెచ్చరిక చేశారు. ''భారత అసమానధీశక్తి వెలుగులను ప్రపంచమంతగా వెదజల్లిన ఒక గొప్ప ఉదాహరణగా ఆపరేషన్ సిందూర్ నిలిచిపోతుందని ఆయన అన్నారు. సాయుధబలగాలలో భవిష్యత్‌లో భాగస్వామ్యం కానున్న ఈ అధికారులందరూ మనదేశ రక్షణ శక్తిని, సమన్వయదృష్టిని చా లా జాగ్రత్తగా అర్థం చేసుకుని మెలగాలన్నారు. శరవేగంగా శత్రువు కదలికలపై మొదట మనమే స్పందించాలన్నారు. ఈ విద్యాపీఠంలో శిక్షణపొందిన అధికారుల సామర్థ్యం, వారి ప్రవర్తన, వారి భవితవ్యం అంతా వారికి శిక్షణ ఇచ్చిన గురువుల కు ప్రతిబింబంగా నిలుస్తుందని గుర్తుచేశారు. శిక్ష ణ పూర్తిచేసుకుని విధుల్లో చేరిన అధికారుల ప్రవర్తన ఈ శిక్షణాపీఠం కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలన్నారు. భూతల,గగనతల,సముద్రతలాల లో ఎక్కడైనా ఏ సేవలను ఏ ఒక్కరూ ఒంటరిగా చే యలేరన్నారు. ఉమ్మడిస్ఫూర్తిగా, ఐక్యంగా బాధ్యతలు పూర్తిచేసే లక్ష్యాన్ని మరచిపోకూడదన్నారు. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవాలి, మీరు నిర్వహించాల్సిన పాత్రను అర్థం చేసుకోవాలి, ఇతరుల తో కలిసి నిర్వహించాల్సిన పాత్రను గుర్తెరిగి ప్రవర్తించాలి, మాతృదేశంకోసం మీ సర్వశక్తులనూ ధారపోయాలి, చేయగలిగినంతా చేయాలి'' అని స్ఫూర్తినిచ్చారు.

## జాతి కలహాలకు మోదీ పరిష్కారం చూపాలి

### మణిపూర్ శాసనసభ్యులందరితోనూ సమావేశమవ్వాలి : కాంగ్రెస్

**ఇంఫాల్ :** ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం మణిపూర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని శాసనసభ్యులందరినీ కలుసుకుని జాతి కలహాలకు పరిష్కారం చూపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే తోక్‌చోమ్ లోకేశ్వర్ డిమాండ్ చేశారు. మెయిటీ ప్రజలు జాతీయ రహదారి 2 లోని కాంగ్‌పోక్పి విభాగం గుండా వెళితే ఎవరికీ హాని జరగకుండా ప్రభుత్వం చూసుకోవాలని కోరారు. మెయిటీలు మెజారిటీగా ఉన్న భాగంలోని జాతీయ రహదారిపై కుకిజో ప్రజలను కూడా అనుమతించాలని ఖుంద్రక్‌పామ్ నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నారు. మెయిటీలను జాతీయ రహదారి గుండా వెళ్ళడానికి అనుమతించబోమని బహిరంగంగా ప్రకటించిన వారిని అధికారులు అరెస్టు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ వలంటీర్ల సమన్వయ కమిటీతో సహా అనేక కుకి గ్రూపులు కుకి ప్రాంతాలలోకి మెయిటీలను అనుమతించబోమని ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేయడం గమనార్హం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పర్యటన సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్ని సంక్షోభానికి పరిష్కారం చూపించాలని, మొత్తం 59 మంది ఎమ్మెల్యేలను కలుసుకుని ఒక ప్రణాళికను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. జాతి కలహాలకు ఒక పరిష్కారం తీసుకురావాలని లోకేశ్వర్ అన్నారు. మోదీ తన సందర్శనను ఇంఫాల్, చురాచంద్‌పూర్ అనే రెండు ప్రదేశాలకే పరిమితం చేయకూడదని, ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, కాంగ్‌పోక్పి జిల్లాలతో సహా హింస ప్రభావిత ప్రాంతాలన్నింటినీ ఆయన సందర్శించాలన్నారు. మే 2023 నుండి మెయితీస్, కుకిజో గ్రూపుల మధ్య జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఎన్ బిరేన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. 2027 వరకు పదవీకాలం ఉన్న రాష్ట్ర అసెంబ్లీని తాత్కాలికంగా నిలిపివేశారు. ఇందిలా కల్లోలం చెలరేగిన తరువాత ఉండగా ప్రధాని మోదీ తొలిసారిగా మణిపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో భారీ వేదికను నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో శుభ్రపరచడం, పెయింటింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వేదిక ముందు 15,000 మందికి పైగా కూర్చోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కాంగ్లా కోట మాజీ మణిపురి పాలకుల సాంప్రదాయ అధికార స్థానంగా పనిచేస్తుంది. వేదిక నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని మణిపూర్ వెలుపల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. 100 మందికి పైగా కార్మికులు నిర్మాణ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు. అలాగే, భద్రతా సిబ్బంది ఉనికిని పెంచుతున్నట్లు మరొక అధికారి తెలిపారు.
కోటలోకి ప్రవేశించే సందర్శకుల గుర్తింపులను నమోదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జాతి కలహాలతో అల్లకల్లోలంగా ఉన్న రాష్ట్రాన్ని ప్రధాని సందర్శించకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు బిజెపిపై దుమ్మెత్తిపోస్తున్నాయి.

# డోనాల్డ్ ట్రంప్ నిర్వేదం

బెదిరింపులతో భారత్‌ను సులభంగా లొంగదీసుకుని తమకు లాభసాటి షరతులతో కొత్త వాణిజ్య ఒప్పందం సాధించవచ్చునని, దిగుమతి సుంకాలు భారీగా విధిస్తే భారత్ ప్రధాని, అధికారులు తమ వద్దకు పరుగెత్తుకు వస్తారని భావించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు నిర్వేదంలో పడ్డారు. ఆయన అనుకున్నట్లు భారత్ లొంగుబాటు ప్రదర్శించలేదు. ఆగస్టు 25,26 తేదీల్లో వాణిజ్య చర్చలకు ఢిల్లీ రావలసిన అమెరికా ప్రతినిధివర్గం పర్యటన రద్దు చేసుకుంది. ఈలోపు ట్రంప్ ఏకపక్షంగా భారత్‌నుంచి దిగుమతులపై సుంకాన్ని10 నుంచి 25 శాతానికి పెంచారు. ఉక్రేన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న కారణంగా రష్యాను ఆర్థికంగా కృంగదీసి లొంగదీసుకునేందుకు రష్యానుంచి ఏ దేశం క్రూడాయిల్ కొనుగోలు చేయరాదని యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షను ఉల్లంఘించి భారత్, రష్యా ఇస్తున్న తక్కువ రేటుకు క్రూడ్ ఆయిలు కొని, శుద్ధిచేసి లాభానికి ఎగుమతి చేస్తున్నదని ట్రంప్ ఆరోపించారు. ఆగస్టు 22లోపు కొనుగోలు బంద్ చేయకపోతే భారత్ దిగుమతులపై మరో 25శాతం సుంకం విధిస్తానన్న ట్రంప్ ద్వితీయ హెచ్చరికకు భారత్ స్పందించలేదు. 22వ తేదీ నుంచి మొత్తం 50శాతం సుంకాలు అమలులోకి వచ్చాయి. బ్రిక్స్‌కు నాయకత్వం వహిస్తున్న బ్రెజిల్ ట్రంప్ 50 శాతం సుంకాలకు గురైన మరో దేశం.

ఇంతలో ట్రంప్‌పై ఇంట, బయట రెండు పిడుగులు పడ్డాయి. ఒకటి, ట్రంప్ ఎమర్జెన్సీ అధికారాలు ఉపయోగించి భారత్ తదితర దేశాలపై సుంకాల పెంపు చేయటం రాజ్యాంగ విరుద్ధమని అమెరికా అప్పీల్స్ కోర్టు తీర్పు చెప్పింది. ట్రంప్ ప్రభుత్వం దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లింది. రెండు, చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సభ సందర్భంగా చైనా–రష్యా–భారత్ నేతల సంభాషణలు, స్నేహ–సహకారాలు, వాణిజ్యం పునరుద్ధరణ, పెంపుదల నిర్ణయాలు ట్రంప్‌ను ఇబ్బందిలో పడేశాయి. ఆసియాలో చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలబెట్టేందుకు రెండు దశాబ్దాలుగా చేసిన కృషి ట్రంప్ మూర్ఖత్వంతో నేలపాలైందని స్వదేశంలో రాజకీయ, దౌత్యవర్గాలనుంచి విమర్శలు ఉత్పన్నమైనాయి. ట్రంప్‌కు తీసిపోని ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో భారత్‌పై అవాకులు చవాకులు పేలుతున్నారు. ఇదంతా కడుపుమంట వెళ్లగక్కటమే. అమెరికా కోరుకుంటున్నట్లు భారత వ్యవసాయ, పాడిపరిశ్రమ మార్కెట్లను, లఘు మధ్యస్థాయి పారిశ్రామిక ఉత్పత్తుల మార్కెట్ల ద్వారాలను వారి ఉత్పత్తులకు తెరిచి మన దేశంలోని సామాన్య ప్రజలకు నష్టం కలగజేస్తే దోస్తీ, లేకపోతే దూషణలు అనే ధోరణి అమెరికా పెత్తందారీతనానికి నిదర్శనం.

ప్రజాపక్షం 07-09-2025, ఆదివారం

ఎస్‌సిఒలో భారత్ వైఖరి ట్రంప్ ఊహించనిది. "భారత్, రష్యాలను నిగూఢమైన, కారునలుపు చైనాకు కోల్పోయామని అనిపిస్తోంది. అవి కలిసికట్టుగా దీర్ఘకాలం సౌభాగ్యవంతమైన భవిష్యత్ కలిగి ఉండుగాక" అంటూ ఆయన నిర్వేదం, వ్యంగ్యంతో కూడిన ఉక్రోసం వ్యక్తం చేశారు. ఇది కేవలం వాణిజ్యానికి సంబంధించిన విషయమే కాదు. ప్రపంచ రాజకీయాల్లో అమెరికాకు వ్యతిరేకమైన మొగ్గు. అంతేగాక వచ్చే సంవత్సరం అమెరికన్ కాంగ్రెస్ ఎన్నికలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. భారత్‌తో సంబంధం పునరుద్ధరణకు ట్రంప్ తపిస్తున్నట్లున్నది. భారత్ కూడా తన 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' పరిధిలో అమెరికాతో సత్సంబంధాలను అభిలషిస్తున్నది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వ్యాఖ్య దీన్ని సూచిస్తోంది : పరస్పర ప్రయోజనాలు, ప్రజాస్వామిక విలువలు, ప్రజల మధ్య సంబంధాలలో వేళ్లానుకుని ఉన్న సమగ్రమైన విశ్వ వ్యూహాత్మక భాగస్వామ్యం మా మధ్య ఉంది" అని అన్నారాయన. ట్రంప్ బెదిరింపులకు భారత్ ప్రతిఘటన అనేక ఇతర దేశాలకు బలం చేకూర్చింది.

బ్రెజిల్ భారత్–రష్యా–చైనా, దక్షిణాఫ్రికాతో కూడిన బ్రిక్స్ కూడా బలమైన బహుళపక్ష అంతర్జాతీయ వేదికగా విస్తరిస్తున్నది. అందువల్ల ట్రంప్ ఒంటెత్తుపోకడలు, దూకుళ్లు ప్రతిఘటనకు గురికాక తప్పదు. ఉక్రేన్ యుద్ధ విరమణకు రష్యాకు హెచ్చరికలు చేయటం కాదు, కయ్యాన్ని పెంచుతున్న ఇయు దేశాలను అదుపు చేయాలి. అలాగే గాజాలో నరమేధం సాగిస్తూ గాజాను పూర్తిగా ఆక్రమించుకునే ఇజ్రాయిల్‌ను వెనక్కు లాగాలి. దుందుడుకుతనం ఇకపై చెల్లదు – ట్రంప్ కూడా పాఠాలు నేర్చుకుంటేనే అమెరికా ఆధిక్యత కొనసాగుతుంది.

# తెలంగాణ రాజకీయ వైతాళికుడు రావి నారాయణ రెడ్డి



కందిమళ్ళ ప్రతాప రెడ్డి
కార్యదర్శి,
తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు
98490 8212

నిజాం నిరంకుశ మతపక్షపాత ఫ్యూడల్ పరిపాలనకు వ్యతిరేకంగా బావుటా ఎగరవేసి, తెలంగాణా గ్రామీణ రైతులలో, శ్రమజీవులలో నూతన చైతన్యం కలిగించిన ప్రజానాయకుడు. పీడిత తాడిత ప్రజల ప్రాథమిక హక్కుల కోసం సమాజంలో అట్టడుగున పడివున్న హరిజన గిరిజన వెనుకబడిన తరగతుల ప్రజల సముద్ధరణ కోసం అహోరాత్రులు అవిరళ కృషి చేసిన నిస్వార్థ నిరాడంబర దేశభక్తుడు, సంఘ సేవకుడు రావి నారాయణ రెడ్డి ఆధునిక తెలంగాణ పోరాట చరిత్ర రావి నారాయణ రెడ్డి జీవితంతో ముడిపడివున్నది. రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా ఆ వీరుడిని స్మరించుకుందాం.

***రావి నారాయణ రెడ్డి గురించి ఒక సభలో:***
***సుప్రసిద్ధ కవి ఉత్పల సత్యనారాయణ:***

*ఏ యెడ నుంచి వచ్చితివి ఈ నగరమ్మున కోరి నాయనా*
*ఈయననే ఎరుంగవుర? ఈ మహనీయుడు*
*యావదాంధ్ర దేశీయుల కాప్తబంధువుర*
*శీలసమున్నతుడైన రావి నారాయణ రెడ్డి*
*మన చింతనకీర్తికి మారుపేరురా అన్నారు.*

1978లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా ముగ్గురు ప్రముఖులు రావి నారాయణ రెడ్డి, నందమూరి తారాకరామారావు, అక్కినేని నాగేశ్వరరావులకు 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది.

ఆంధ్ర మహాసభ నాయకులు, తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు, హరిజనోద్యమ నిర్వాహకులు, దేశ సేవాదురంధరులు, ప్రజాహిత పరతంత్రులు, ప్రజాప్రతినిధులు –

***ప్రశంసాపత్రంలో ఆచార్య బి. హెచ్. కృష్ణమూర్తి***

***నూతన చైతన్యం రగిలించిన కలిగించిన ప్రజానాయకుడు***

నిజాం నిరంకుశ నియంతృత్వ పరిపాలనలో అణగిమణగి అట్టడుగున పడిపోయిన అమాయక ప్రజల జనహృదయంలో నవచైతన్యము, మానవ చైతన్యము కలిగించి, నిద్రాణము దరిద్రాణము అయిన జాతిని జాగృతము చేసిన మహావ్యక్తి, నిజాం మహాశయుని నిరంకుశ పాలనను ప్రతిఘటించి స్టేట్ కాంగ్రెస్ నిర్వహించిన సత్యాగ్రహోద్యమం ప్రథమ దళమునకు నాయకత్వం వహించి, దాస్యశృంఖలాలు ఛేదించుటకు శంఖారావము పూరించిన ప్రజానాయకుడు, అజ్ఞాన తిమిరాంధకారమును పటాపంచలు చేసి సమాజంలో రాజకీయ సృహను సృజించిన ప్రజారథసారథి రావి నారాయణ రెడ్డి.

**ఎం.ఎల్. నరసింహారావు (ఆర్.ఎన్. జన్మదినం సందర్భంగా, ఆంధ్రభూమి)**

**గుండెను కాగడాగా వెలిగించిన రావి నారాయణ రెడ్డి**

'తెలంగాణా విముక్తికోసం సాయుధ పోరాటానికి సారథ్యం వహించి, గుండెను కాగడాగా వెలిగించి, గెరిల్లా సైనికులకు వెలుగు దారి చూపించి, నిజాం రాచరికాన్ని తుదముట్టించడానికి ఉప్పెనలా పైకెగసి, విజయఢంకా మ్రోగించి, పల్లెపల్లెలో రైతాంగ పోరాటాన్ని ఫెను తుఫానులా హోరెత్తించిన విప్లవయోధుడు, కర్మవీరుడు 'కళాప్రపూర్ణ' కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి'

***ఆచార్య పేర్వారం జగన్నాథం (ఆంధ్రప్రభ 16.9.90)***

***తెలంగాణ వీరయోధులకు తలమానికం రావి నారాయణ రెడ్డి***

1983, జూన్ 4వ తేదీన ఆర్.ఎన్. 75వ జన్మదినోత్సవాన్ని వారి అభిమానులు వేడుకగా జరిపారు. ఆ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపక్షాలకు, సామాజిక జీవితానికి చెందిన ప్రముఖుల అభిప్రాయాలు వారి మాటల్లో: 'తెలంగాణా వీరయోధులకు తలమానికం రావి నారాయణ రెడ్డి, భగతిసింగ్ స్మరించుకున్నట్లే తెలంగాణా పోరాట యోధులు చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు'.

***– భగత్ సింగ్ సహచరుడు విజయకుమార్ సిన్హా***

'అన్ని రాజకీయపార్టీలు భూసంస్కరణలు గురించి మాట్లాడుతున్నాయంటే అది రావి నారాయణ రెడ్డి భూమికోసం నడిపిన పోరాటమే కారణం. మా అందరి గురించి ఏమన్నా అనొచ్చుగానీ, రావి నారాయణరెడ్డి గురించి ఎవ్వరూ ఏమనలేరు. కమ్యూనిస్టులే కాదు అందరూ ఆయనను అభిమానిస్తారు. నేను ముఖ్యమంత్రి అయినంక వారి కోసం ఏదో చెయ్యాలనుకున్నా కానీ ఇంత తొందరగా దిగిపోతానను కోలేదు'.

***– టి. అంజయ్య, మాజీ ముఖ్యమంత్రి***

## నేడు 34వ వర్ధంతి



'ఇప్పుడు నేను రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడిగా ఉన్న. ఈ కాంగ్రెసును మొదట స్థాపించిన వ్యక్తి రావి నారాయణరెడ్డి. ఆయన నడిపిన పోరాటం ఇప్పటికీ నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ గుట్టలు రావి నారాయణ రెడ్డి, రావి నారాయణరెడ్డి అంటున్నయ్. కానీ మీ స్వప్నం నెరవేరలేదు. యియ్యాల గాకున్నా 10, 20, 30 ఎన్నేండ్లకైనా నెరవేరుతుంది'

**– జి. వెంకటస్వామి**

'కమ్యూనిస్టు నాయకుడే కాదు తెలంగాణాకు మార్గదర్శి. మాలాంటి వాళ్ళందరినీ రంగంలో దింపిన ఉద్యమకారుడు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు, ప్రజలు ఆయనను అభినందించడానికి కారణం వారు నిర్వహించిన పాత్ర'.

**– నల్లమల గిరిప్రసాద్**

'ప్రజలు చరిత్ర నిర్మిస్తారు. చరిత్రను నాయకులు సృష్టిస్తారు. నాయకులు ప్రజలను ముందుకు నడిపించడానికి తోడ్పడతారు. అదేవిధంగా తెలంగాణా పోరాటకాలంలో వందనినాదాలు వినిపిస్తే అందులో 50 నినాదాలు రావి, బద్ధం గురించే వుండేవి. ప్రపంచ చరిత్రకెక్కిన తెలంగాణా పోరాటంలో రావి నారాయణ రెడ్డి పాత్ర ప్రముఖమైనది'.

***యం.ఓంకార్ (సి.పి.ఐ. (యం))***

'విప్లవ వైతాళికుడు, ఆంధ్రప్రదేశ్ నిర్మాతగా నా మనసులో నిలిచిపోయాడు. ఒక యుగపురుషుడిగా చరిత్ర సృష్టించాడు'

**– ఎస్. జయపాల్ రెడ్డి (అప్పటి జనతాపార్టీ నాయకుడు)**

ఇది ఒక చారిత్రక సత్యానికి సాక్ష్యం, చారిత్రక సత్యాలను 'ముఖ్యంగా తెలంగాణా వీరోచిత పోరాటాన్ని ఏ పార్టీ నడిపిందో, ఆ పార్టీ ప్రతిష్టను పైకి రానీయకుండా,అణచడమో, రాజకీయ కక్షతో చూడటం, సరియైనది కాదు. ఆ చారిత్రక పోరాటాన్ని నడిపింది కమ్యూనిస్టు పార్టీ, దాని అగ్రనాయకుడు రావి నారాయణ రెడ్డి' అని తాను గీసిన చారిత్రక తెలంగాణా సాయుధ పోరాట చిత్రపటాన్ని ఆర్.ఎన్.కు సమర్పించారు.

***– ప్రఖ్యాత చిత్రకారుడు శేషగిరిరావు***

కాంగ్రెస్ నాయకులు, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ మీర్ అక్బర్ అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, తెలంగాణా పోరాట యోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కార్మిక నాయకుడు బి.ఎస్. మహాదేవ్ సింగ్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు దేవులపల్లి రామానుజరావు, కోదాటి, మహారాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు చంద్రగుప్త చౌదరి, ఆహ్వానసంఘ ప్రముఖులు సిహెచ్. రాజేశ్వరరావు, బూర్గుల నర్సింగరావు, ఓంకార్ ప్రసాద్, ఆలంకుందమీరి, డా॥పరంజపే, రావి నారాయణ రెడ్డి త్యాగనిరతిని కొనియాడారు.

1946–1948 నిజాం రాజరిక పాలన అంతంచేసి, హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేయాలని సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గుర్తించాలని, ఆ పోరాట యోధులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. 1975లో ఢిల్లీలో ఇందిరాగాంధీని కలిసి ఒప్పించి, ఆ పోరాటాన్ని భారత స్వాతంత్ర్యంలో భాగంగా, సమరయోధులకు పెన్షన్ అంగీకరింపజేశారు. ఫలితంగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల వేలాదిమంది సమరయోధులుగా గుర్తింపబడి పెన్షన్ పొందారు, పొందుతున్నారు.

ప్రధానంగా తెలంగాణా సాయుధ సమరంలో అసువులు బాసిన నాలుగువేల మంది అమరవీరులకు హైదరాబాదులో స్మారకచిహ్నం నిర్మించాలని. ఆ పోరాటంలో పాల్గొని త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తింపు, పెన్షన్ మంజూరు కోసం కృషి చేశాడు.

1991 సెప్టెంబరు 7 రాత్రి అరుణతార ఆర్.యన్. నిష్క్రమించాడు. మరుసటి రోజు ఉదయం ఆ విషాద వార్తను పత్రికలు పతాక శీర్షికలతో ప్రచురించాయి.

సమరం మార్గంగా సంఘర్షణ ఊపిరిగా తనువు మనసు బదుగు బతుకులకు కానుకగా సహస్ర మాసాధికంగా బతికినటువంటి 'రావి' ఇప్పుడు లేడు. అయినా, ఆయన ఉంటాడు.

కానీ ఆ మహానీయుడికి ప్రభుత్వాలు మారినా గుర్తింపు రాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రావి నారాయణ రెడ్డికి స్థల చిహ్నంగా ఎల్ నగర్ నిర్మాణం జరుగుతున్న టిమ్స్ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి నామకరణం చేయాలని, హైదరాబాద్ నగరంలో ముఖ్యమైన కేంద్రంలో ఆయన కాంస్య విగ్రహం నెలకొల్పాలని కోరుతున్నాం.


### రావి నారాయణ రెడ్డి జీవితంలో ప్రముఖ ఘట్టాలు :

- 1930 కాకినాడ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు.
- 1930 ఆంధ్ర మహాసభ వ్యవస్థాపక సభ్యులు
- 1932 హైదరాబాదు రాష్ట్ర హరిజన సేవాసంఘ్ కార్యదర్శిగా మహాత్మాగాంధీచే నియామకం
- 1934 అఖిల భారత కార్యవర్గ సభ్యుడు
- 1934 గాంధీజీని హైదరాబాదుకు ఆహ్వానించి హరిజన సేవా సంఘ్ నిధివసూలు, బహిరంగసభ నిర్వహించి రూ.20,000/లు స్వయంగా నిధిని అందజేశాడు. హైదరాబాదు రాష్ట్రంలో 100కు పైగా హరిజన విద్యార్థులకు హాస్టళ్లు స్థాపించారు.
- 1938 జూలై హైదరాబాదు రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెస్ నిర్మాణానికి సారథ్యం వహించిన తెలంగాణ ప్రథమ వ్యక్తి. స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయాలని సాగిన సత్యాగ్రహ ఉద్యమానికి తెలంగాణా ప్రాంత ప్రథమ సత్యాగ్రహ నాయకులు.(గోవిందరావు నానల్ మహారాష్ట్ర, రావినారాయణరెడ్డి తెలంగాణ, రామకృష్ణ దూత్ కర్ణాటక ప్రాతినిధ్యం వహించారు.) సత్యాగ్రహిగా మూడు నెలల జైలు శిక్ష
- 1938 హైదరాబాదు రాష్ట్రంలో రాజకీయ ఉద్యమానికి రూపకల్పన చేసినవారు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన... స్వామి రామానంద తీర్థ, తెలంగాణలో రావి నారాయణ రెడ్డి అగ్రగణ్యులు.
- 1941 ఆంధ్రమహాసభ అధ్యక్షుడిగా ఎన్నిక
- 1944 రెండవసారి ఎన్నిక
- 1946 భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి రద్దుకోసం, మహోద్యమానికి నేతృత్వం. 700 ఎకరాల స్వంతభూమిలో 500 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ.
- 1947 తెలంగాణ సాయుధ సమరానికి సారథ్యం
- 1952 నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి జవహర్ నెహ్రూ కంటే దేశంలో అత్యధిక ఓట్లతో విజయం.
- వినోబాభావే భూదాన ఉద్యమానికి ప్రేరణ రావి నారాయణ రెడ్డి
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను ఒప్పించి సాధించిన వ్యక్తి.
- 1954 విశాలాంధ్ర నిర్మాణం కోసం ఉద్యమం, ఉద్యమ కార్యదర్శిగా కృషి
- 1957 ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై ప్రతిపక్ష ఉపనాయకుడిగా, కొంతకాలం ప్రతిపక్ష నాయకుడి గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల నిర్వహణ.
- 1967 స్వచ్ఛందంగా ప్రత్యక్ష రాజకీయ పదవుల విరమణ.
- 1978 ఆంధ్ర విశ్వవిద్యాలయంచే గౌరవ డాక్టరేట్ పొందారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా భారత రాష్ట్రపతి వెంకటరామన్ చేత తామ్రపత్రం.
- 1986 తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టును స్థాపించి అధ్యక్షులుగా బాధ్యతల నిర్వహణ
- 1991 సెప్టెంబర్ 7న పరమపదించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు.
- 1992 రావినారాయణ రెడ్డి మరణానంతరం భారతప్రభుత్వం అత్యుత్తమ 'పద్మవిభూషణ్' బిరుదు ప్రకటించి, 1992 ఫిబ్రవరి 25న భారత రాష్ట్రపతి వెంకట్రామన్ రావి నారాయణ రెడ్డి సతీమణికి అందజేశారు.

# సిబిఐ... సస్పెన్షన్... సోషల్ మీడియా...

వారం రోజులుగా రాష్ట్ర రాజకీయాలలో జరుగుతున్న పరిణామాలు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్)ని ఇబ్బందులకు గురిచేస్తున్నవి. కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని ప్రభుత్వ నిర్ణయం, బిఆర్‌ఎస్ నుంచి ఎంఎల్‌సి కవిత సస్పెన్షన్, తరువాత సోషల్ మీడియా వార్ గులాబీ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. శనివారం(ఆగస్టు 30న) సాయంత్రం మొదలై గత ఆదివారం తెల్లవారుజాము 2:38 గంటల వరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభ చర్చించింది. చివరలో కాళేశ్వరం ప్రాజెక్టు మూడు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిబిఐ దర్యాప్తునకు ఇస్తున్నట్లుగా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో అంతర్‌రాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ ఏజెన్సీలు ఉన్నందున దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సముచితమని భావిస్తున్నట్లు వెల్లడించారాయన. నిజానికి సుమారు 20 మాసాల సుదీర్ఘ కసరత్తు అనంతరం సుమారు 665 పేజీలతో జస్టిస్ ఘోష్ సమగ్ర నివేదిక ఇచ్చారు. అందులో అవకతవకలపై పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్ల పాత్రను పేర్లతో సహా నిర్ధారించడమే కాకుండా, నాటి ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన మంత్రివర్గ సహచరులు హరీశ్ రావు,ఈటల రాజేంద్రలను కూడా బాధ్యులుగా చూపి, వారిపై చట్టంలో పేర్కొన్న విధంగా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. అయితే, ప్రభుత్వం ఈ నివేదిక ఆధారంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) లేదా ప్రత్యేక కోర్టు లేదా, సిఐడి లేదా ఎసిబి ఆధ్వర్యంలో తదుపరి చర్యలకు ఉపక్రమిస్తుందనే భావన నెలకొంది. తన నిర్ణయాన్ని వెల్లడించడానికి ముందుగా నివేదికను శాసనసభలో చర్చకు ఉంచి, శాసనసభాపక్షనాయకుల అభిప్రాయాలను ప్రజాస్వామ్య బద్ధంగా తీసుకుంది ప్రభుత్వం. అధికారేతర పక్షాలు ప్రభుత్వం ఏమి చేస్తుందో ముందుగా చెప్పాలని కోరాయి. సహజంగానే ప్రతిపక్ష బిఆర్‌ఎస్ తరుపున మాట్లాడిన సీనియర్ సభ్యులు టి.హరీశ్‌రావు ఆ నివేదిక ను తిరస్కరిస్తూ, అది చెత్త నివేదిక అని కొట్టిపారేశారు.






## రాజధాని సందడి

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

గతంలో సిబిఐ దర్యాప్తునకు డిమాండ్ చేసిన బిజెపి పక్షాన శాసనసభా పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి చర్చలో పాల్గొంటూ కమిషన్ పేరుతో నీరుగార్చాక సిబిఐకి ఇచ్చి ఏమి లాభమన్నారు. చివరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిబిఐ దర్యాప్తునకు ప్రకటన చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో విద్యు త్ కొనుగోలుపై వేసిన కమిషన్ తమకు కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌లోని 8 బి, 8 సి కింది నోటీసు ఇచ్చిందని కోర్టుకు ఎక్కిన బిఆర్‌ఎస్, కాళేశ్వరం విషయంలో 8బి, 8 సి కింద నోటీసులు ఇవ్వలేదని కోర్టుకు ఎక్కిన తీరును ఆయన ఎండగట్టారు.

ఘోష్ కమిషన్ నివేదికను సభ ముందుంచకముందు నుంచే బిఆర్‌ఎస్ దాని ఆధారంగా చర్యలు తీసుకోవద్దంటూ కోర్టుకు ఎక్కినప్పటికీ, చివరకు సిబిఐ దర్యాప్తును అడ్డుకోలేకపోయింది. చివరకు కాళేశ్వరం అక్రమాల బంతి రాష్ట్ర ప్రభుత్వం తన వైపు నుంచి కేంద్ర ప్రభుత్వం కోర్టులోకి వేసేసింది. అయితే, ముందే సిబిఐకి అప్పగించి ఉంటే, ఘోష్ కమిషన్ తీసుకున్న 20మాసాల సమయం కలిసొచ్చేది కదా అని కమలనాథులు ప్రశ్నిస్తున్నారు. తాము సిబిఐకి అప్పజెప్పడం ద్వారా బిఆర్‌ఎస్ విషయంలో కేంద్ర బిజెపి ఎలా వ్యవహరిస్తుందో ప్రజలకే తేటతెల్లమవుతుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ రెండు పార్టీల అంతర్గత సహకారం బట్టబయలవుతుందని భావిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ, సిబిఐ దర్యాప్తునకు అప్పగించడమనేది బిఆర్‌ఎస్‌ను ఇబ్బంది పెట్టే అంశమే. ఎందుకంటే సిబిఐని కేంద్ర ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఏ రకంగా ఆయుధంగా వాడుకుంటుందో దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు కోడై కూస్తున్నాయి. ఇప్పుడు బిఆర్‌ఎస్‌ను తమ చెప్పుచేతల్లోకి తీసుకొని, తాము బలపడేందుకు బిజెపి చూస్తుందని రాజకీయ విశ్లేషకులు గత ఉదంతాల ఆధారంగా అంచనా వేస్తున్నారు.

ఇక కాళేశ్వరంపై సిబిఐ ఎంక్వయిరీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజే అమెరికా నుంచి వచ్చిన బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్‌కు కాళేశ్వరం అవినీతి మరక అంటడానికి కారణం హరీశ్‌రావు, సంతోష్‌రావులేనని ప్రత్యక్ష ఆరోపణలు చేయడం ద్వారా బిఆర్‌ఎస్ శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేశారు. మరుసటి రోజే ఆమెపై బిఆర్‌ఎస్ సస్పెన్షన్ వేటు వేయడం, ఆ వెంటనే కవిత తన ఎంఎల్‌సి సభ్యత్వానికి, బిఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం చకచకా జరిగిపోయాయి. ఇక బిఆర్‌ఎస్‌లో అంతర్గత యుద్ధం ఒక్కసారిగా రెచ్చకెక్కడం మొదలైంది. కవిత రాజీనామా చేసిన వెంటనే ఆమెపై బిఆర్‌ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం మొదలైంది. యూట్యూబ్ ఛానల్‌లో ఆ పార్టీ నాయకులు, విశ్లేషకులు వ్యక్తిగతంగా కవితపై సున్నితమైన అంశాల ప్రస్తావన చేయడంతో ఒక్కసారిగా వైరం ముదిరింది.

### కలకలం సృష్టిస్తున్న కవితక్క అప్‌డేట్స్

తాజాగా కవితక్క అప్‌డేట్స్ పేరుతో ఉన్న "ఎక్స్" ఖాతాలో పోస్టులు సంచలనం సృష్టిస్తున్నాయి. 15 రోజుల్లో పలు సంచలన విషయాలను బైటపెడతామని, ఇప్పటికే గతంలో జరిగిన రెండు అంశాలను అందులో పోస్ట్ చేశారు. అందులో ఒకటి ట్రాక్టర్‌ల కుంభకోణానికి, మరొకటి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏల టూర్‌కు సంబంధించిన విషయాలు. అవి సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గతంలో ప్రత్యర్థి పార్టీలు ఆరోపణలు చేసినప్పటికీ, తాజాగా "ఎక్స్" వేదికగా వస్తున్న అప్‌డేట్స్ పోస్టులలో పెడుతున్న నిర్దిష్ట సమాచారం పాత ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా ఉం ది. అయితే, కవిత తన తండ్రి కెసిఆర్, సోదరుడు కె.టి.రామారావులను పల్లెత్తు మాట అనకుండా జాగ్రత్త పడుతూ, పార్టీలో కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులను లక్ష్యంగా తన రాజకీయ యుద్ధం చేస్తున్నారు. ఇదంతా ఎటు దారితీస్తుందోనని ఆందోళన బిఆర్‌ఎస్ శ్రేణులలో వ్యక్తమవుతోంది. ఒక విధంగా బిఆర్‌ఎస్ ముప్పేట దాడిని ఎదుర్కొంటోంది. ఈ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్న బిజెపి, త్వరలోనే రంగంలో దిగేందుకు అడుగులు వేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా పరిణామాలను మరింత అప్రమత్తతతో గమనిస్తోంది.

## పాప్‌కార్న్

### కొత్తరకం సెలవు!




సెలవు పెట్టడానికి చాలా మంది ఉద్యోగులు పడే పాట్లు అన్నీ ఇన్నీకావు. చనిపోయిన వారినే పదేపదే చంపుతుంటారు. హఠాత్తుగా ఏదో ఒక అనారోగ్యం వచ్చిపడిందని అంటా రు. ఒక్కోసారి అకారణంగానే ఆఫీసుకు వెళ్లాల ని అనిపించదు. అలాంటప్పుడు, ఇలాంటి ఒక కారణాన్ని వెతుక్కుంటారు. ఉద్యోగుల్లో ఉన్న ఈ మనస్తత్వాన్ని చైనాలోని ప్రముఖ రిటైల్ వ్యాపారి యూ డాంగ్ లై గుర్తించాడు. అందుకే, 'అన్‌హ్యాపీ లీవ్' అనే కొత్త స్కీమ్‌ను ప్రవేశపెట్టాడు. మానసికంగా సంతోషంగా లేని కారణంగా ఉద్యోగులు ఏడాదికి 10 రోజుల సెలవు తీసుకోవచ్చు. దీని కోసం మేనేజర్ లేదా అధికారి అనుమతి అవసరం లేదు. 'మీరు మానసికంగా ఉత్సాహంతో లేకపోయే, ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదు' అనేది డాంగ్ లై సూత్రం. అతని రిటైల్ చైన్ చైనాలోని హెనాన్ ప్రావీన్స్‌లో ఉంది. అతని సంస్థలో సుమారు 7,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సంస్థ కస్టమర్ సర్వీస్, ఉద్యోగుల సుఖసంతోషాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇక్కడ ఉద్యోగులకు రోజుకు 7 గంటల పని మాత్రమే ఉంటుంది. వారాంతంలో శని, ఆది సెలవు రోజులు. దీనికి అదనంగా సంవత్సరానికి, వారివారి అర్హతను బట్టి 30 నుంచి 40 రోజుల సెలవు ఉంటుంది. లూనార్ న్యూ ఇయర్‌కు ప్రత్యేకంగా 5 రోజుల సెలవు ఉంటుంది. చైనా లో విస్తృతంగా అమలవుతున్న 996 సంస్కృతికి డాంగ్ లై వ్యతిరేకిస్తున్నాడు. 996 అంటే, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ, వారానికి 6 రోజుల పని. అయితే, ఈ విధానం ఉద్యోగుల మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతుందని డాంగ్ లై అంటున్నాడు.

## నిజమైన మృత్యుంజయుడు



సాధారణంగా ఏదైనా ఒక ప్రమాదం నుంచి బయటపడిన వాడిని మృత్యుంజయుడు అంటారు. కానీ, నిజానికి ఈ పదం ఇస్మాయిల్ అజిజికి మాత్రమే అతికినట్టు సరిపోతుంది. టాంజానియా దేశానికి చెందిన ఒక సాధారణ వ్యక్తి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైద్య శాస్త్రానికి సవా ళ్లు విసురుతున్నాడు. ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా ఆరు పర్యాయాలు అతను మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతని కుటుంబ సభ్యులకు తేల్చిచెప్పారు కూడా. కానీ, ప్రతిసారీ అతను కొన్ని రోజుల్లో మళ్లీ బతికి బట్టకట్టాడు. నమ్మడం కష్టమేగానీ, ఇది ముమ్మాటికీ నిజం. మొదటి ఘటనలో అజిజి మరణించినట్టు నిర్ధారించిన వైద్యులు, అతని శరీరాన్ని మార్చురీకి పంపారు. అక్కడి నుంచి శవాన్ని తీసుకెళ్లడానికి వచ్చిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారిని ఆశ్చర్యానికి గురి చేస్తూ అజిజి కళ్లు తెరిచి చూశాడు. ఆ విధంగా మొదటిసారి బతికాడు. అది కాకతాళీయమని, వైద్యులు పొరబడ్డారని అంతా అనుకున్నారు. తర్వాత కొంతకాలానికి అతనికి మలేరియా సోకింది. వ్యాధి ఎంతకూ తగ్గలేదు. వైద్యులు అతను మరణించినట్టు చెప్పారు. మృత దేహాన్ని దహన సంస్కారాల కోసం అతని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. కానీ, ఆశ్చర్యకరంగా అతను లేచి కూర్చున్నాడు.

## పిఎస్‌బిలలో పని ఒత్తిడి!



ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బి)లో పని ఒత్తిడి పెరిగిందని, ముఖ్యంగా అధికారులు ఈ సమస్యను బాగా వేధిస్తున్నదని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గత దశాబ్దకాలంలో 500 మందికిపైగా పిఎస్‌బి అధికారులు ఆత్మహత్య చేసుకున్నారన్న సమాచారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఫైనాన్స్, ఇన్సూరెన్స్ వంటి రంగాలతోపాటు, బ్యాంకింగ్ రంగం కూడా తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. పిఎస్‌బిలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనను గమనించకపోవడం దుర్మార్గం. దీనిని వ్యక్తిగత సమస్యలతో ముడిపెట్టడం ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దకపోవడం అన్యాయం. ప్రముఖ బ్యాంకింగ్ విశ్లేషకుడు తమాల్ బందోపాధ్యాయ వ్యాసం ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ, పరిష్కరించే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖగానీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగానీ స్పందిస్తున్న దాఖలాలు లేవు. రోజురోజుకూ పెరుగుతున్న టార్గెట్లు ఉద్యోగులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఒక్కో బ్రాంచ్‌కి నాలుగు నుంచి ఆరుగురు మాత్రమే ఉంటున్నారు. దీనితో ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తున్నది. ఫలితంగా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇఎస్‌ఇ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను భారీగా తగ్గించింది. దీంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలలో ఉద్యోగుల కొరత పెరిగింది.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

## శ్రీనివాసరావుకు మంత్రి తుమ్మల నివాళి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఇటీవల మృతిచెందిన కుతుంబాక శ్రీనివాసరావుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. శనివారం ఖమ్మం నగరంలోని నెహ్రూ నగర్‌లో గల శ్రీనివాసరావు స్వగృహంకు వెళ్లి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. నాగార్జున గ్రామీణ బ్యాంకులో శ్రీనివాసరావు అందించిన సేవలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, కార్పొరేటర్ కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక శోభయాత్రలో ఎమ్మెల్యే సందడి



ప్రజాపక్షం/వైరా:వైరాలో శనివారం జరిగిన వినాయక నిమజ్జనం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ట్రాక్టర్ నడిపి పార్టీ నాయకుల్లో యువతలో భక్తుల్లో జోష్‌ను ఇచ్చారు. సంత బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుతో కలిసి వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత ఎమ్మెల్యేతో కరచాలనం చేయడానికి సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు. పోలీసులు ఎక్కడ ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

## పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలి

### ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి



ప్రజాపక్షం/చింతకాని:పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలని, పత్తికి మద్దతు ధర రూ.10,075/ ఇవ్వాలని ఏఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ కొండపర్తి గోవిందరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కెఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న జరిగే రైతు అవగాహన సదస్సు ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి రాఘవాపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే అవగాహన సదస్సులో రైతులు అధిక సంఖ్యలోమ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దొబ్బల వెంగళరావు, ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ అబ్బూరి మహేష్, బికెఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ, చింతకాని సహకార సంఘం డైరక్టర్ కొల్లి గోవిందరావు, సిపిఎం మండల నాయకులు దొబ్బల బాబు, రైతులు వడ్డె శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల పోస్టుల దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేసేందుకుగాను అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. తెలంగాణ రాష్ట్ర కళాశాల కమీషనర్ ఆదేశాల మేరకు 2025 26 వి ద్యాసంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్, ఎకానామిక్స్, హి స్టరీ, కెమిస్ట్రీ, బోటనీ విభాగాల్లో అతిథి అధ్యాపకుల నియామకాలకు ఈ నెల 11వ తేదీ ఉదయం 10గంటల నుంచి శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సై న్స్ ప్రభుత్వ కళాశాల కొత్తగూడెం ప్రాంగణంలో ఇంటర్వ్యూలు ద్వారా ని ర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టి అభ్యర్థులు 50శాతం మా ర్కులు ఉండాలని, నెట్, సెట్, పిహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత ఇ వ్వబడుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గ ంటల లోపు తమ పూర్తి బయోడేటాతో పాటు జతచేసిన సర్టిఫికెట్స్ అప్లికేషన్‌నుజెవిఆర్‌ప్రభుత్వ కళాశాల సత్తుపల్లి నందు సమర్పించాలని తెలిపా రు.

## వ్యవసాయ పథకాలపై అవగాహన



ప్రజాపక్షం/మణుగూరు: మండల పరిధిలోని గుట్టమల్లారం రైతు వేదిక నందు అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఐఎఎస్ పర్యటించారు. మణుగూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి తాతారావు, డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సౌరభ్ శర్మకి డివిజన్ లోని వ్యవసాయ పంటలు, వ్యవసాయ పథకాలు గురించి వివరించారు. రైతు భరోసా, రైతుబీమా, పంటల నమోదు, పంట కోత ప్రయోగాలు, ప్రకృతి వ్యవసాయం,సేంద్రియ వ్యవసాయం, బయో చర్కోల్, కంపోస్టు తయారీ, మునగ సాగు, ఎరువుల, పురుగు మందుల నాణ్యత పరిశీలన తదితర అన్ని విషయాలపై సమీక్షించారు. పంటల బీమా ప్రకృతి వైపరీత్యాలు కలిగినప్పుడు తీసుకొనే చర్యలు గురించి పరిశీలించారు. రసాయన ఎరువుల వాడకం, రైతులకు వ్యవసాయ శాఖ వారు ఇచే శిక్షణ కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ లు వెంకటేశ్వర్లు, ఛటర్జీ, రాహుల్ రెడ్డి, ఎఇఒలు ,వ్యవసాయ శాఖ సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కన్నుగప్పి తప్పించుకుపోయిన ఇసుక ట్రాక్టర్లు



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : మండలంలోని నారాయణపురం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తహశీల్దార్ రామకృష్ణ శనివారం సమాచారం మేరకు దారి కాసి వినాయకపురం సమీపంలో పట్టుకున్నారు. కార్యాలయానికి తరలిస్తుండగా మార్గమాధ్యంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను దౌర్జన్యంగా తీసుకువెళ్లటంతో తహశీల్దార్ రామకృష్ణ ట్రాక్టర్ల యజమానులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనంతారం నారాయణపురం, గుమ్మడివల్లి, కుడుములపాడు దెబ్బతోగు వాదుల నుండి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలించిపోతున్నట్లు సమాచారంలో భాగంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తహశీల్దార్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా అశ్వారావుపేట పట్టణంలోని ప్రవేశించాక రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాక్టర్లతో వస్తున్న సిబ్బంది ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఇదే అదునుగా భావించిన ఇసుక అక్రమణదారులు ట్రాక్టర్లను దొంగదారుల్లో తీసుకుపోయి కనిపించకుండా చేశారు. అక్రమదారులపై వాహనాల నెంబర్ల ఆధారంగా కేసు పెడుతున్నట్లు తహశీల్దార్ రామకృష్ణ తెలిపారు.

## జర్నలిస్టులను సన్మానించిన ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరు :మణుగూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లందు గెస్ట్ హౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన "జర్నలిస్టు డే" కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని, మణుగూరు మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు జర్నలిస్టు డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. మణుగూరు మండల శాఖ అధికారులు, సింగరేణి ఏరియా జిఎం, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గాండ్ల సురేష్‌పాల్గొన్నారు.

# తరగతి గదుల్లో టీచర్ల పాత్ర కీలకం

### విద్యా ప్రమాణాలు అందేలా కృషి
### గురుపూజోత్సవంలో పాల్గొన్న కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సాంకేతికత ఎంత అందుబాటులో ఉన్న తరగతి గదుల్లో టీచర్ల పాత్ర కీలకమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఒక టీచర్‌కు ఒక విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చే సామర్థ్యం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టీచర్స్‌డే సందర్భంగా శనివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి పి. శ్రీపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. స్వాగత నృత్యం అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా కారణంగా టీచర్ల యొక్క ప్రాముఖ్యత మనందరికీ మరోసారి తెలిసిందన్నారు. కోవిడ్ సమయంలో పాఠశాలలు మూసివేసి కంప్యూటర్ ద్వారా బోధన చేశామని దాని ఫలితంగా పిల్లల విద్యా ప్రమాణాలు సగానికి పైగా పడిపోయాయని కలెక్టర్ తెలిపారు. పిల్లల్లో పడిపోయిన ప్రమాణాలను పెంచేందుకు అనేక కార్యక్రమాలను విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్నామన్నారు. టీచర్ లేకుండా కేవలం ఆన్‌లైన్ వీడియో ద్వారా మనం పిల్లలకు మంచి విద్యను అందించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్ రూం అదనపు సౌకర్యం మాత్రమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన గతంతో పోలిస్తే చాలా మెరుగైందన్నారు. పిల్లలు చదవడం, రాయడం, అనర్గళంగా మాట్లాడటం నేర్పించడంలో కొంత వెనకబడి ఉన్నామన్నారు. ఉపాధ్యాయులంతా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులను ఇంప్రూవ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. తాను చిన్నతనంలో ఇంగ్లీష్ టీచర్ చూపించిన చొరవ కారణంగా నేడు కలెక్టర్ స్థాయికి తాను ఎదిగానన్నారు. సమాజంలో చాలా మంది జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉపాధ్యాయులకు లభించిందని దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నిర్వహించి దేశ రాష్ట్రపతి స్థాయికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎదిగారన్నారు. రాష్ట్రపతి హోదా నిర్వహించిన తర్వాత గొప్ప ఉద్యోగం ఉపాధ్యాయ వృత్తి అని భావించి మహనీయులు అబ్దుల్ కలాం టీచర్‌గా పనిచేశారన్నారు. ఉపాధ్యాయులకు అవార్డు అందించడం సంతోషంగా ఉందని ఈ అవార్డు ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లను ఘనంగా సన్మానించి మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, మండల విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి



ప్రజాపక్షం/చింతకాని:సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కెఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే రైతు అవగాహన సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపు నిచ్చారు.శనివారం చింతకాని మండలం నాగిలిగొండ లో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి దిగుమతి సుంకం 11 శాతం కొనసాగించాలని, పత్తికి మద్దతు ధర రూ.10,075/ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు.ఈ నెల 10న జరిగే రైతు సదస్సులో రైతుసోదరులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకీ రూ 12,000 , మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2500 , ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామన్న హామీలు తక్షణమే అమలు చేయాలని పలు డిమాండ్ల తో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎ ంయూ) ఆధ్వర్యంలో ఈనెల 8న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాలో వ్యవసాయ కార్మికులు , మహిళలు పెద్ద ఎత్తున పా ల్గొని ధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏపూరి రవీంద్రబాబు, సిపిఐ మండల కార్యదర్శి గోపాలరావు, రైతు సంఘం నాయకులు పావులూరి మల్లిఖార్జునరావు, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్లు తొలగింపుతో రైతుల ఇక్కట్లు



ప్రజాపక్షం/బోనకల్: గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు పనులలో భాగంగా గత ఐదు నెలల క్రితం బ్రాహ్మణపల్లి సమీపంలో విద్యుత్ లైన్లు తొలగించడంతో రైతు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో శనివారం బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న హైవే కార్యాలయ వద్ద రైతులు సమస్యను పరిష్కరించాలని వాహన రాకపోకలను అడ్డుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ గత ఐదు నెల క్రితం రైతులకు వ్యవసాయ మోటార్లు ఉపయోగించే లైన్లను హైవే పనుల నిమిత్తం తొలగించారని అన్నారు. సత్వరమే క్రొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ పునరుద్ధరణ చేస్తామని హైవే అధికారులు తెలిపినప్పటికీ, నేటికి నెలలు గడుస్తున్నా పునరుద్ధరణ చేయకపోవడం దారుణమని అన్నారు. నిత్యం రైతులు కార్యాలయం చుట్టూ తిరిగి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యుత్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కరించలేకపోయారని అన్నారు. దీంతో రైతులతో కలిసి హైవే కార్యాలయం వద్ద ధర్నా చేశామని, దీంతో హైవే అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. సమస్యను పరిష్కరించకుండా రైతులను వేధిస్తే పెద్ద ఎత్తున రైతులతో హైవే పనులను అడ్డగిస్తామని హెచ్చరించారు. రైతులు, సిపిఐ నాయకులు వంగాల నరసింహ, మడుపల్లి వెంకటేశ్వ ర్లు, యాదాల రవి, సాధినేని సురేష్, కొంగర జగన్‌మోహన్, ఏనుగు రవికుమార్, చావా కృ ష్ణయ్య, వంగాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నా రు.

## బ్యాంకర్లతో ఎంపిడిఒ సమావేశం

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు : ఎంపిడిఒ సక్రియ్య




ప్రజాపక్షం/ ఖమ్మం : రుణం చెల్లిస్తేనే ఇంటి బిల్లు అంటూ ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్న నగదును అప్పు క్రింద, ఓల్‌లో పెట్టవద్దని ఆదేశించారు. శనివారం వైరా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సక్రియ్య ఆంధ్రా బ్యాంక్ మేనేజర్, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సక్రియ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్లు అందించాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇండ్లను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇండ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న నగదును అప్పుల క్రింద జమ చేసుకోవద్దని ఎంపిడిఒ తెలిపారు. వైరా మండలం గరికపాడు గ్రామానికి చెందిన సువార్తకు ఇందిరమ్మ ఇంటి పథకం క్రింద నిర్మాణానికి సంబంధించి నగదు వారి ఖాతాల్లో పడితే మీరు ఓల్‌లో పెట్టడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారులు తమ ఖాతా నుంచి నగదు తీసుకునే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తే బ్యాంకర్లు ఇబ్బందిపెట్టవద్దని చెబుతున్నామని అయినా ఇబ్బందులు పె డుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ బ్యాంకు వారైనా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి ఖాతాల్లో జమ అయిన నగదును అప్పుల క్రింద ఓల్‌లో పెట్టవద్దన్నారు.

## పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి




ప్రజాపక్షం/దమ్మపేట:పంచాయతీ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో దమ్మపేట మండలం 31 గ్రామపంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఎంపిడిఒ కి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మండల కార్యదర్శి బెజవాడ రాము మాట్లాడుతూ సకాలంలో పంచాయతి కార్మికులకు జీతాలు అందక, తినడానికి తిం డి లేక, అనారోగ్యం వచ్చిన హాస్పిటల్‌కి వెళ్ళటానికి డబ్బు లు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే ఇటీవలే పంచాయతీ రాజ్ మంత్రి సొంత నియోజకవర్గంలో జీతాలు రాక అప్పుల పాలై పంచాయతీ కార్మిక సోదరుడు మైదం మహేష్ ఆత్మహత్యకు పాల్పడి మరణించిన సంగతి తెలిసిందే అన్నారు. ఇకనైనా పంచాయతీ కార్మికుల కష్టాలను తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్కని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సభ్యులు గొర్రెపాటి బసవయ్య, బద్దం భాస్కరరావు, ముత్యాలరావు, బాబు, గోడ వెంకటేశ్వరరావు, రాజు,పెరుమళ్ళ రాంబాబు,అన్నవరం, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పల్లె రహదారుల అభివృద్ధిలో కొత్తగూడెం నియోజకవర్గం ఆదర్శం

### విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:పల్లె రహదారులు అభివృద్ధి, ప్రజలకు కనీస మౌళిక వసతుల కల్పనలో కొత్తగూడెం నియోజకవర్గం ఆదర్శమని, వివిధ పథకాలలో మంజూరైన నిధులతో ఇప్పటికే గ్రామీణ అనుసందాన రోడ్లు, ప్రధాన రహదారులు పూర్తి చేశామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెంఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టుడే సందర్భంగా శనివారం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసిన అనంతరం పాత్రికేయులను శాలువాతో సన్మానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ రహదారులు, పట్టణ అంతర్గత రహదార్లు వంతెనల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా నియోజకవర్గంలోని ఐదు హై లెవల్ వంతెనలు, 5.90 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు లభించాయని, ఇందు కోసం రూ.16.05 కోట్లతో లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని పెద్దతండామాన్యతండ మధ్య రూ.1.80కోట్లతో హై లెవల్ వంతెన, హేమచంద్రాపురంఅనిశెట్టిపల్లి వరకు 2 కి.మి బీటి రో డ్డు, హై లెవల్ వంతెన నిర్మాణం, చుంచుపల్లిచిట్టిరామవరం వరకు 2.70 కి.మీ మేరా బీటిరోడ్డు, హైలెవల్ వంతెన, సుజాతనగర్ మండల పరిధిలో ని సీతంపేటఅంజనాపురం వరకు 1.20కి.మీ బీ టిరోడ్డు, హైలెవల్ వంతెన నిర్మాణం పనులు చే పట్టి త్వరలో ప్రజలకు అందుబాటులోనికి తెస్తామ ని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాష, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్,వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు వంగా వెంకట్, జి వీరస్వామి పాల్గొన్నా న్నరు.

## మూడు మండలాలకు భగీరథ నీరు బంద్

ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని సత్తేరు కుంటలో మిషన్ భగీరథ పెద్ద పైపులైను లీకేజీ గత పది రోజులు క్రితం కావడంతో లీకేజీ అయిన నీరు మూడు మండలాలకు సరఫరా చేశారు. సిబ్బంది సమాచారం మేరకు అధికారులు మూడు మండలాలకు కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, మండలాలకు సంబంధించిన ప్రజలకు తాగునీరు సరఫరా గత రెండు రోజుల నుంచి నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజుల నుంచి సొసైటీ వద్ద చెరువులో పెద్ద పైపులైను లీకేజీ నిర్లక్ష్యం కావడంతో కలుషిత నీటిని సరఫరా చేశారు. సిబ్బంది పర్యవేక్షణతో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను మూడు మండలాలకు నిలిపివేశారు. దీనివలన నిత్యం ఏదో ఒక ప్రాంతంలో లీకేజీలుగా కావడం తరచూ కలుషిత నీరు పైప్ లైన్ లీకేజీలతో భగీరథ నీరు పైప్లైన్ పగిలిపోవడం నీరు కలుషిత కావడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు.

## 'ఎండమావుల్లా' ..కొత్త పింఛన్లు

### అర్హుల ఎదురుచూపులు




ప్రజాపక్షం/నేలకొండపల్లి:ఆసరా పింఛన్లు కొత్తగా మంజూరు కాక పోవడంతో అర్హులైన వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. నాయకులు, ప్రభుత్వ కార్యాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వహయాం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అర్హులకు నూతనంగా పెన్షన్ మంజూరు చేయలేదు. దీంతో గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు ఆసరా కోసం నిరీక్షిస్తున్నారు.

**దరఖాస్తులు స్వీకరించినా**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలకు దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఆసరా పథకం ద్వారా పింఛన్ పొందేందుకు మండలంలోని అర్హులైన ఒంటరి మహిళలు దివ్యాంగులు వితంతువులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తుల స్వీకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు కూడా కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయలేదు.

**స్పష్టత కరువు**

కొత్త పింఛన్ల మంజూరు పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో 57 సంవత్సరాల వయసున్న వారికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు కోసం మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరించి విచారణ అనంతరం మంజూరు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో వృద్ధాప్య పెన్షన్ వయసు పెంచినట్టు గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ప్రభుత్వ చేయూత సైట్ లో 65 ఏళ్ల వారికి వృద్ధాప్య పింఛన్లకు అర్హులుగా కనిపిస్తుందని దీంతో గ్రామాల్లో 57 ఏళ్లు నిండిన వృద్ధులు అయోమయంలో పడ్డారు. వయసు నిర్ధారణ పై అధికారులు స్పష్ట త ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**కొందరికే అవకాశం**

ప్రస్తుతం పింఛన్ల మంజూరుకు కొందరికి మాత్రమే ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే ఆ స్థానంలో భార్య లేదా భ ర్తకు అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ ది వ్యాంగులైన వారికి వృద్ధాప్య పెన్షన్ నుంచి వికలాంగు ల పింఛనుకు మారుస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ పొ ందుతూ మరణించిన వారి పింఛను అధికారులు మా ర్చడం లేదు.

**ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చి**

నా భర్త మృతి చెంది నాలుగు సంవత్సరాలుఅవుతుంది. ఆసరా పెన్షన్ కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేశాను . కానీ ఇప్పటివరకు పింఛన్ రాలేదు. కూలి పని చేస్తూ జీవిస్తున్నాను. నాకు పింఛన్ అమలు చేయాలి.

**బొమ్మ కంటి పద్మ:భైరవునిపల్లి గ్రామం**




పట్టించుకోని ప్రభుత్వం ఆశ్రయించిన అమలు చేయడంలో గత ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైంది. మండలంలోని వితంతువులు దివ్యాంగులు ఒంటరి మహిళలు ఎందరో ఆసరా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పథకాన్ని నిరంతరం అమలు చేయాలి.

**ఆదేశాలు రాలేదు**

**మారిశెట్టి వెంకటేశ్వరరావు సిపిఐ మండల కార్యదర్శి**

పింఛన్ల కోసం ఎవరైనా దరఖాస్తు ఇస్తే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి తీసుకుంటారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లోవివరాలు నమోదు చే స్తాం కొత్త పింఛన్ కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆ దేశాలు అందలేదు.

ఎం.ఎర్రయ్య ఎంపిడిఒ నేలకొండపల్లి

## పత్తిపాక మాజీ సర్పంచ్ గుండెపోటుతో మృతి

**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక గ్రామ మాజీ సర్పంచ్, నెక్కొండలో జ్యోతి ఫోటో స్టూడియో నిర్వాహకుడైన, ఈదునూరి సమ్మయ్య గుండెపోటుతో శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న సమ్మయ్య మృతి చెందడంతో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ న్యాయవాది లావుడియా తిరుమల్ చౌహాన్,కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆ కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని దాన సంస్కరణ ఖర్చు నిమిత్తం అం దించారు. సమ్మయ్య మృతి పార్టీకి గ్రామానికి తినని లోటని ఆయన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉసిల్లపాటి రాజు, మాజీ అధ్యక్షుడు పసునూటి ల క్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు బానోత్ గోపి, మాజీ వార్డు సభ్యులు బొల్లబోయిన సురేష్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడ ప్ర వీణ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ లు లావుడియా సామ్య, దొమ్మేటి వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఉత్తమ ఉపాధ్యాయుడిగా నర్సంపేట పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదలు అందించారు. వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 05 గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో వరంగల్ పట్టణంలోని ఉర్సు గుట్ట ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై ఎర్ర జగన్మోహన్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించారు.



## పోలీస్ కంట్రోల్ రూంను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూంను సందర్శించారు. ఈ సందర్శనలో కమిషనర్ కంట్రోల్ రూంలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి, అత్యవసర కాల్స్ స్వీకరణ, స్పందన విధానం, డయల్ 100 కార్యకలాపాలను సమీక్షించారు.కమిషనర్ ప్రజల నుండి వచ్చే ప్రతి కాల్‌ను అత్యంత జాగ్రత్తగా, తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యం అర్ధరాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతో విధులు నిర్వహించాలని,సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా కంట్రోల్ రూం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## డిస్కౌంట్ నమ్మి మోసపోవద్దు





**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** దంత సమస్యల చికిత్స కోసం నగరంలోని కొందరు డెంటల్ క్లినిక్ వైద్యులు డిస్కౌంట్ ఆఫర్స్ ప్రకటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ వేణు యాదవ్‌లు తెలిపారు. హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో కొంతమంది అర్హత లేని నకిలీ వైద్యులు దంత వైద్యం చేయడానికి వైద్యం పేరిట ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని వారు ఆరోపించారు. నకిలీ ఇంప్లాంట్స్‌తో పాటు నాణ్యతలేని మెటీరియల్స్‌ను వాడుతూ ప్రజలకు మరింత అనారోగ్యానికి గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దంత వైద్యులు ప్రజల ఆరోగ్య సంరక్షణకు నేషనల్ దంత వైద్య గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు విరుద్ధంగా గుర్తింపు పొందక పోవడంతో పా టు స్పెషాలిటీ పూర్తి కానీ డాక్టర్ శేషుకుమార్ జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ పేరుతో చేస్తున్న ప్రకటనలను నమ్మి మోసపోవద్దని వారు ప్రజలకు సూచించారు. ఇలాంటి నకిలీ వైద్యుల పట్ల జాగ్రత్త వహించి క్వాలిటీ ఇంప్లాంట్స్, మెటీరియల్స్ వాడే వైద్యుల వైద్యాన్ని మాత్రమే పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ వారు సూచించారు. సమావేశంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మనోరంజన్ రెడ్డి ట్రెజరర్ డాక్టర్ కార్తీక్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నవోదయ స్కూల్ 9, 10 తరగతులకు అడ్మిషన్లు

**ప్రజాపక్షం / జనగామ :**వరంగల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 202526 సంవత్సరానికి గాను 9,11 తరగతుల్లో అడ్మిషన్లు జరగనున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ధరఖాస్తు గడువు ఈ నెల 23 కాగా ఎంపిక పరీక్ష 07 ఫిబ్రవరి 2026న జరగనుంది. అభ్యర్థులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, తొమ్మిదవ తరగతికి ధరఖాస్తు చేసుకునే వారు 1 మే 2011 నుండి జులై 2013 మధ్య జన్మించిన వారై ఉండాలి. 11వ తరగతికి ధరఖాస్తు చేసుకునే వారు 2025 56లో పదవ తరగతి పూర్తి చేయాలి, 1 జూన్ 2009 నుండి 31 జులై 2011 మధ్య జన్మించి ఉండాలి. ధరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు తెలిపారు.

## 'రైతుల భూమి హక్కు' సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి

రైతు కమిషన్ చైర్మన్‌ను కోరిన చైర్మన్ సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైతుల భూమి హక్కుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర రైతుసంఘం చైర్మన్, సభ్యులను ఆత్మకమిటి చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి సభ్యులు మేక సునీల్ మరియు ఇతర సభ్యులను ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ కొరవి మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, కలగూర నాగరాజులు, మర్యాదపూర్వకంగా కలిసి వారికి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో భూమి హక్కులకు సంబంధించినటువంటి వాటి గురించి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## మరిపెడ వాసికి ప్రశంసా పత్రం

**ప్రజాపక్షం/ మరిపెడ:**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన పగిండ్ల నర్సయ్య అదిలాబాద్ జిల్లాలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా తన బోధనతో పాటు విద్యార్థులలో ఉన్నత నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేసినందుకు ఆయనను అధికారులు ఉత్తమ ఉద్యోగిగా గుర్తించి స్థానిక ఎమ్మెల్యే వెడమ బొజ్జు, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. ఏడాది కాలంలోనే ఉత్తమ అధ్యాపకునిగా ప్రశంసా పత్రమును అందుకున్న నర్సయ్య ను సహచర ఉపాధ్యాయులు, మిత్రులు గ్రామస్తులు అభినందించారు.

# సమాజ నిర్మాతలు గురువులు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే సమాజ నిర్మాతలు గురువులని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో గురు పూజోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు గురు పూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆయన తెలిపారు. తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదేనని, గురువుకు మించిన దైవం ఈ లోకంలో లేదని పేర్కొన్నారు. విద్యా బోధనలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయులను విదేశాలకు పంపి ఆధునిక విద్యా విధానాలపై అధ్యయనం చేయించి అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు, పెండింగ్ ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో వాహనాలు ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించే అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, అందరం కలసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యకు ప్రథమ ప్రాధాన్యతనివ్వడమేనని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సమాంతరంగా కృషి చేస్తున్నామని, గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులని అన్నారు. విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి, సత్కరించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతమైన ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అభినందించారు. ఉపాధ్యాయుల మోటివేషన్ వల్లే తాను సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధం అయ్యానని. తల్లి లెక్చరర్ తండ్రి ప్రిన్సిపల్ కావడం తన ఉన్నతికి దోహదపడిందని కాబట్టే తాను ఐఏఎస్ కాగలిగానని తెలిపారు. ఉపాధ్యాయులు కృషిని అభినందిస్తూ, ఇదే కృషితో మన జిల్లా ఉత్తమ ఫలితాలతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, డిఇఒ రాజేందర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

రాష్ట్ర ప్రజారోగ్య విభాగం డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్



**ప్రజాపక్షం/తొర్రూరు :** వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ప్రజారోగ్య విభాగం డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం మండలంలోని మాటేడు గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని డాక్టర్ రవీంద్రనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణకు చర్యలు, ప్రసవాలు, దీర్ఘకాలిక వ్యాధులకు అందిస్తున్న మందులు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్‌తో కలిసి డాక్టర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులను అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నార్మల్ డెలివరీల బాధ్యత ఆశా వర్కర్లదేనని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గర్భిణీల వద్దకు వెళ్లి బలవర్ధకమైన ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు, గర్భిణీలకు టీకాలు అందించడం, అవసరమైన పరీక్షలు, ఎన్సీడీ కార్యక్రమాలు, టీబీ, లెప్రసీ, పోలియాపై స్థానికులకు అవగాహన కల్పించడం వంటివి విధిగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వర సర్వే నిర్వాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌రెడ్డి, వైద్యాధికారి నందనాదేవి, ఎంఎల్‌హెచ్ పి.సాయికుమార్, డీపీఎంఓ వనాకర్ రెడ్డి, సీహెచ్ఓ విద్యాసాగర్, సూపర్‌వైజర్లు జిలుకర రమేశ్, కమల, ఏఎన్ఎం చంద్రకళ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



**ప్రజాపక్షం / జనగామ :**తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగింగి. శుక్రవారం రాత్రి నుండి శనివారం తెల్లవారు జాము వరకు వినాయకులు నిమజ్జనాలు జరిగాయి. డిసిపి రాజమహేంద్రనాయక్, ఏసిపి పండరి చేతన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ దగ్గరుండి వినాయక నిమజ్జనాలు జరిపించారు. ఎలాంటి ఆటుపోట్లు జరగకుండా అధికారులను అప్రమత్తం చేస్తూ గణనాధుల నిమజ్జనాలు సజావుగా జరిపించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చేసిన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. నిమజ్జనం కోసం రెండు క్రేన్లు, రెండు తెప్పలు, 25మంది సిబ్బంది, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎవరు ఇబ్బందులు పడకుండా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనం ప్రశాంతం జరిగిందని కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఓ గోపిరాం, తహసీల్దార్ హుస్సేన్, సిఐ దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, డిఎఒ విజయనిర్మల, డిసిఒ వెంకటేశ్వర్లులతో కలిసి కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దారులు, ఎంపిడిఒలు, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో యూరియా పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 23,749.296, మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిపామని, శనివారం 750, మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించడం జరుగుతుందని, ఇంకా వచ్చే యూరియాను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మకాలు చేయుటకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు, జిల్లాలోని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, మండలాల వారీగా రైతులకు ముందస్తు సమాచారంతో యూరియాను ప్రణాళిక ప్రకారం ఆన్లైన్ విధానం ద్వారా పిఓఎస్, రిజిస్టర్లులలో నమోదు చేసి అమ్మకాలు కొనసాగించాలని, ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న నిల్వలను తనిఖీ చేస్తూ కలిగి ఉన్న స్టాకును రైతులకు అమ్మకాలు చేయుటకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ నిల్వలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను గుర్తించి ఇప్పటికే వారి లైసెన్సులను రద్దు చేయడం జరిగిందని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బంది పెడితే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. కేంద్రాల వద్ద యూరియా ప్రస్తుత స్టాకు వివరాలను ప్రదర్శించాలని అన్నారు. జిల్లా నియోజకవర్గ, మండల స్థాయిలలో యూరియా పంపిణీ చేయు తేదీ సమయాలు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, డి.ఎస్.పి లు తిరుపతిరావు, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ సహకార, రెవెన్యూ, పోలీస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ఎస్ఆర్ యూనివర్సిటీకి 91వ ర్యాంక్

ఎస్ఆర్ యూనివర్సిటీ చాన్సలర్ ఎ.వరదా రెడ్డి




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హసన్ పర్తి మండలం అనంతసాగర్‌లో గల ఎస్ఆర్ యూనివర్సిటీ మరోసారి తన ప్రతిభను చాటుకొని, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ (ఎమ్ఒఎమ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) 2025లో ఇంజనీరింగ్ కేటగిరీలో 91వ ర్యాంకు సా ధించింది. వరుసగా నాలుగో సారి విశ్వవిద్యాలయం కట్టుబాటును మరోసారి రుజువు చేసుకుంది. ఈ సందర్భంగా ఏడాది టాప్ 100లో చోటు దక్కించుకోవడం ద్వారా విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలపై ఎస్ఆర్ యూనివర్సిటీ తన ప్రతిభను మరోసారి రుజువు చేసుకుందని యూనివర్సిటీ చాన్సలర్ ఏ. వరదారెడ్డి తెలిపారు. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్స్ 2025ను విడుదల చేయగా ఎస్ఆర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కేటగిరీలో 91వ ర్యాంక్, యూనివర్సిటీ కేటగిరీలో 101–150బ్యాండ్, అలాగే ఓవరాల్ కేటగిరీలో 151–200 బ్యాండ్‌లో స్థానం సంపాదించడం గర్వకారణమన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థలలో ఇంజనీరింగ్ కేటగిరీలో టాప్ 100లో స్థానం పొందిన ఏకైక సంస్థ ఎస్ఆర్ యూనివర్సిటీ మాత్రమేనని, వరుసగా నాలుగో ఏడాది ఈ ప్రతిష్టాత్మక ర్యాంక్ దక్కించుకోవడం విశ్వవిద్యాలయం అందరి కృషి ఫలితం అని పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్డ్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల మధ్య ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఆంత్రప్రెన్యూర్షిప్ విలువలను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతోపాటు, బలమైన అధ్యాపక వర్గం, సమర్థవంతమైన పరిశోధన ఫలితంగా 5000 + పరిశోధన పత్రాలు, 1000+పేటెంట్లు, 50+ పేటెంట్ల మంజూరు, 50+ పరిశోధన ప్రాజెక్టుల ద్వారా 15 కోట్ల నిధులు, అలాగే మైక్రోసాఫ్ట్ నుండి 51 ఎల్‌పిఏ వంటి అత్యుత్తమ ప్లేస్మెంట్ అవకాశాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ అడ్మినిస్ట్రేషన్ టి. శేషగిరిరావు, ఎస్ఆర్ యూనివర్సిటీ కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

టిజిఎన్‌పిడిసిల్ వరంగల్ చైర్‌పర్సన్ ఎన్‌వి వేణుగోపాలచారి




**ప్రజాపక్షం / వేలేరు :** విద్యుత్ శాఖలో విద్యుత్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి వినియోగదారులకు సకాలంలో సేవలు అందించడమేకాకుండా రైతులకు వ్యవసాయానికి అనుకూలంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ విద్యుత్ మండలి వరంగల్ చైర్మన్ చీఫ్ ఇంజనీర్ ఎన్ వేణుగోపాలచారి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విద్యుత్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. విద్యుత్ శాఖఅధికారులు, సిబ్బంది వినియోగదారులయందు సత్ప్రవర్తన కలిగి ఉండాలని అలాగే రైతుల పట్లబాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విద్యుత్ నియంత్రణామండలి వారి నియమాళి రెగ్యులేషన్ 05/2016లో పొందుపరిచిన విధంగా సేవలు అందించాలని అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక (సిజిఆర్ఎఫ్)నందు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టిఎస్ఇఆర్‌సి) వారు నిర్దేశించిన ప్రకారం సేవలు మిన్నకుండుట, అమలులో జాప్యము,సమగ్రముగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం అందజేయబడునని అన్నారు. వినియోగదారుని సమస్యలను నర్దేశించిన కాలంలో పరిష్కరించకపోయినప్పుడు వినియోగదారుల ఫోరంవారి దృష్టికి తగిన ఆధారాలతో లిఖితపూర్వకముగా తెలియజేస్తే ఫోరం వారు వినియోగదారునికి సమస్య పరిష్కారంతోపాటు సేవఅమలులో జాప్యానికి గాను పరిహార రుసుము కూడా వినియోగదారునికి చెల్లించునట్లు తీర్పు ఇచ్చెదరు. ప్రస్తుతము వేలేరులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో రైతుల నుండి దాదాపుగా 25 రకాల దరఖాస్తులు పరిష్కారం కోసం రావడమే కాకుండా విద్యుత్ వినియోగదారుల నుండి డబ్బులు వసూలు చేశారని అభియోగం చేయడం జరిగింది కనుక వీటిపై పర్యవేక్షణచేసి తక్షణమే పరిష్కార మార్గం చూపాలని ఎడిఇ కి సూచించారు. ఈ కార్యక్రమంలో మెంబరు (టెక్నికల్) జనరల్ మేనేజర్ కె రమేష్,మెంబరు (ఫైనాన్స్) జనరల్ మేనేజర్ ఎన్ దేవేందర్, వినియోగదారుల ఫోరం మెంబరు ఎం రామారావు, డిఇ సామ్యనాయక్, ఎడిఇ రాజేశ్వర్‌రావు, ఎఇ కుమారస్వామి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధిపై ఎంపి కావ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**ప్రజాపక్షం/హనుమకొండ :** గోవా రాష్ట్రంలో ఫ్రిడ్రిక్ ఎబర్ట్ స్టిఫ్టుంజ్ ఇండియా సంస్థ ఆర్గనైజ్ చేసిన సెమినార్‌లో శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు డిజిటల్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల శక్తివృద్ధికి అవసరమైన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ చిన్న, మధ్యతరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు పురుషుల కంటే 8 శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారని, స్మార్ట్ ఫోన్ వినియోగంలో 13 శాతం తేడా ఉన్నట్లు వివరించారు. 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేదని, దీని వల్ల మహిళల అభివృద్ధికి పెద్ద ఆటంకమవుతున్నట్లు తెలిపారు. భారతదేశంలో 75 శాతం మహిళలు మాత్రమే మొబైల్ ఫోన్ కలిగి ఉండగా, స్మార్ట్ ఫోన్ వినియోగం కేవలం 35 శాతం మాత్రమే ఉందని వెల్లడించారు. ఈ డిజిటల్ గ్యాప్ వల్ల మహిళల ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్య సేవలు పొందడంలో సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు.మహిళల పురాతన శక్తి ప్రతీకగా వరంగల్ ప్రాంతంలోని చారిత్రక ఘటనలను వివరించారు. కాకతీయ రాణీ రుద్రమదేవి నాయకత్వం, సమ్మక్క సారలమ్మ పోరాటం వంటి చారిత్రక సంఘటనలతో మహిళల శక్తిని వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, వడ్డీరహిత రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీలేని రుణాలను విడుదల, ఆరోగ్యసేవలకు 10 లక్షల వరకూ సౌకర్యం, 2,500 నెలకు ఆర్థిక సహాయం వంటి సమర్థమైన పథకాలు అమలు అవుతున్నట్లు వివరించారు. డిజిటల్ లో మహిళల అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరకే మొబైల్ డివైసులు అందించడం, డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలు పెంపొందించడం అత్యవసరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య అన్నారు. ఈ దిశగా ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం గణనీయమైన కృషి చేస్తున్నదన్నారు. ఈ సదస్సులో మహిళ నాయకులు తమిళనాడు ఎంపీ ఆర్.సుధ , ఎమ్మెల్యే పర్ణికా రెడ్డితోబాటు పలువురు మహిళానాయకులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఆరుగురి నిందితుల అరెస్ట్

భూపాలపల్లి డిఎస్‌పి ఎ.సంపత్ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఎండి బాసిత్ గబ్బర్ సింగ్(20) భూపాలపల్లి అనే వ్యక్తిని పాత కక్షలు మనసులో పెట్టుకొని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఆరుగురు నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి డిఎస్‌పి సంపత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 4న బాసిత్ అనే వ్యక్తిని ను ఆరుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి పాత కక్షలు పెట్టుకొని ఆ వ్యక్తిని హతమరిచినట్లు తెలిపారు. ఏ1) రాదపాక భాస్కర్ అలియాస్ బబ్లు (22) డాన్స్ మాస్టర్ శాంతినగర్ నివాసి, భూపాలపల్లి, ఏ2) బుస్స ప్రశాంత్ అలియాస్ సోను (28) శాంతినగర్ భూపాలపల్లి, ఏ3) గాజుల కు షాల్( 26) శాంతినగర్, భూపాలపల్లి. ఏ4) పం దిల్ల శ్రవణ్ అలియాస్ పవన్ ( 22) 712, T2 క్వార్టర్స్ భూపాలపల్లి, ఏ5) బరిగల ప్రణయ్ (23) యాదవ్ కాలనీ భూపాలపల్లి, ఏ6) చొప్పరి నవీన్ (28) సుభాష్ కాలనీ, భూపాలపల్లి, లు కలిసి మృతున్ని కార్ లో తీసుకొని మేడారం శివారులో గల అటవి ప్రాంతానికి తీసుకువెళ్లి. అక్కడ కత్తితో పొడిచి చంపి, ఆ తర్వాత మృత దేహం పై పెట్రోల్ పోసి అంటించా రని ఆయన తెలిపారు. ఈ నేరంలో పాల్గొన్న పైన తెలిపిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపి, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ సిఐ డి నరేష్ కుమార్, ఎస్ఐ మచ్చ సాంబమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ



## చరిత్ర సృష్టించిన టెన్నిస్ స్టార్లు!

పురుషుల టెన్నిస్‌లో యువకెరటాలు కార్లోస్ అల్కరాజ్, జన్నిక్ సిన్నర్ జోరు చూపిస్తున్నారు. ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న ఇరువురు మరో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ పోరుకు సిద్ధమవుతున్నారు. ఇదివరకే ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్ పోరులోతలపడిన ఈ కుర్రాళ్లు.. ఇప్పుడు యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. దాంతో.. ఒకే సీజన్‌లో వరుసగా మూడు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్ ఆడిన ఆటగాళ్లుగా సరికొత్త చరిత్ర లిఖించారీ యంగ్ గన్స్. తద్వారా రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ వంటి దిగ్గజాలకు సైతం సాధ్యం కాని రికార్డు నెలకొల్పారీ టాప్ సీడ్స్.

అమెరికా వేదికగా జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లో ఆద్యంతం అదరగొట్టిన సిన్నర్, అల్కరాజ్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచారు. శుక్రవారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో ఫెలిక్స్ అగర్ అలియస్మిమెను చిత్తు చేశాడు ఇటలీ స్టార్. పొత్తి కడుపులో నొప్పి కారణంగా మ్యాచ్ మధ్యలో బ్రేక్ తీసుకున్న సిన్నర్ 6–1, 3–6, 6–3, 6–4తో ఫెలిక్స్ ఆట కట్టించాడు. రెండో సెమీస్‌లో నొవాక్ జకోవిచ్‌కు చెక్ పెట్టిన అల్కరాజ్ మూడేళ్ల తర్వాత ఫైనల్లో అడుగుపెట్టాడు.

ఈసారి 25వ గ్రాండ్‌స్లామ్ కొల్లగొట్టాలనుకున్న జకో కలను చెదరగొడుతూ ఇంటికి పంపించాడు. తొలి సెట్ కోల్పోయినప్పటికీ పట్టు వదలని ఈ రెండో సీడ్ 6–4, 7–6(4), 6–2తో జోకర్ కథ ముగించాడు. ఫైనల్ చేరడంతో మూడో సారి సిన్నర్‌తో అమీతుమీకి సిద్ధమయ్యాడీ స్పెయిన్ కుర్రాడు. ఈ ఇద్దరి కంటే ముందు 2012లో జకోవిచ్, నాదల్ మాత్రమే వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడారు.

## 28న బిసిసిఐ ఎన్నికలు..

### త్వరలోనే నోటిఫికేషన్ విడుదల!

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎన్నికల తేదీ వచ్చేసింది. సెప్టెంబర్‌లోనే కొత్త కార్యవర్గంను ఎన్నుకోనున్నారు. ఈ ఏడాది జరగబోయే వార్షిక సమావేశం రోజైన సెప్టెంబర్ 28న ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. ముంబైలో ఉన్న బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మీటింగ్‌లో ఎన్నికల ప్రక్రియ గురించి చర్చించనున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే బిసిసిఐ అధ్యక్షుడి స్థానం నుంచి రోజర్ బిన్నీ వైదొలగాడు. వయసు 70 ఏళ్లు దాటడంతో అతడు బాధ్యతల నుంచి తప్పుకోగా.. కార్యదర్శిగా ఉన్న రాజీవ్ శుక్లా మధ్యంతర అధ్యక్షుడిగా వ్యవహరించనున్నాడు. అయితే.. ప్రస్తుతం బోర్డులోని సభ్యుల పదవీకాలం కూడా ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 18న ఎన్నికలు జరపాలని బిసిసిఐ తీర్మానించింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శితో పాటు కోశాధికారి ఎంపిక కోసం ఎన్నికలు జరుగనున్నాయి.

ఈ సమావేశంలో అపెక్స్ కౌన్సిల్.. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ కోసం గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయడంపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానుందని సమాచారం. అపెక్స్ కౌన్సిల్‌లో బిసిసిఐ సాధారణ కార్యవర్గంలోని సభ్యుడు ఒకరు.. భారత క్రికెట్ అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులుగా ఉంటారని బిసిసిఐ వర్గాలు చెబుతున్నాయి.

## ఆసియా కప్ ఛాన్స్ మిస్..

### భారత 'ఏ' జట్టు కెప్టెన్‌గా అయ్యర్!

ఆసియా కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయాస్ అయ్యర్ కు సెలెక్టర్లు కొత్త బాధ్యతలు అప్పగించారు. రోహిత్ శర్మ వారసుడిగా వన్డే ఫార్మాట్‌కు కాబోయే సారథి అనిపించుకుంటున్న అయ్యర్‌కు.. భారత 'ఏ' జట్టు కెప్టెన్సీ అప్పగించారు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరుగబోయే రెండు మల్టీ డే మ్యాచ్‌లకు సర్పంచ్ సాబ్ నాయకుడిగా వ్యవహరించనున్నాడు.


ఆస్ట్రేలియా ఏ జట్టుతో మ్యాచ్‌లకు శనివారం సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. ఈ సిరీస్‌లో అయ్యర్‌కు డిప్యూటీగా ధ్రువ్ జురెల్ సహకరించనుండగా.. పలువురు టెస్టు ఆటగాళ్లను బృందలోకి తీసుకున్నారు. ఇంగ్లండ పర్యటనలో మెరిసిన సాయి సుదర్శన్, ప్రసిధ్ కృష్ణలతో పాటు దేశవాళీ హీరో అభిమన్యు ఈశ్వరన్, ఐపిఎల్ స్టార్లు ఆయుశ్ బదొని, దేవ్‌దత్ పడిక్కల్ ఉన్నారు. దేశవాళీలో ముంబై తరపున ఇరగదీస్తున్న తనుష్ కొతియాన్, సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్, వికెట్ కీపర్‌గా ఎన్.జగదీశన్ స్క్వాడ్‌లో చోటు సంపాదించారు. ఆసియా కప్ బృందంలో లేని సిరాజ్, కేఎల్ రాహుల్ సైతం రెండో మ్యాచ్‌కు భారత ఏ జట్టుతో చేరుతారని సమాచారం.



**భారత ఏ స్క్వాడ్ :** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఎన్.జగదీశన్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), దేవ్‌దత్ పడిక్కల్, హర్ష్ దూబే, ఆయుష్ బదొని, నితీశ్ రెడ్డి, తనుష్ కొతియాన్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్, యశ్ ఠాకూర్.

భారత ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య సెప్టెంబర్ 23న తొలి మ్యాచ్ జరుగనుంది. రెండు మల్టీ డే మ్యాచ్‌ల తర్వాత ఇరుజట్లు మూడు వన్డేల్లో తలపడనున్నాయి. కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 30న తొలి వన్డే, అక్టోబర్ 3న రెండో వన్డే, అక్టోబర్ 5న మూడో వన్డే నిర్వహించనున్నారు. స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సిరాజ్, రాహుల్, ప్రసిధ్‌కు ఇవి ప్రాక్టీస్ మ్యాచ్‌లుగా పనికొస్తాయి.

# ఫోకస్ బిజినెస్



## కుదుటపడుతున్న స్టాక్ మార్కెట్లు!

భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా 90కిపైగా దేశాలను ప్రభావితం చేసిన అమెరికా సుంకాల పెంపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ, చైనాలో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశం వంటి పలు కారణాలతో ఇటీవల కాలంలో గందరగోళంగా మారిన స్టాక్ మార్కెట్లు ఇప్పుకు కుదుటపడుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనున్న వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) కౌన్సిల్ సమావేశం ముగియడం, గతంలో అనుసరించిన వాధానంలో మార్పులు చేసి, కేవరం రెండు శ్లామ్‌ల తీరుతెన్నులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం జరిగిపోయాయి. గత కొన్ని నెలల్లో, ఇప్పుడే కొంత స్పష్టత వస్తున్నది. కాబట్టి, వచ్చే వారం స్టాక్ మార్కెట్లు కుదుటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే, స్టాక్ మార్కెట్లను ఇతరత్రా అంశాలు ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఈనెల ఒకటోతేదీ, సోమవారం రోజున బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్ 79,809.65 పాయింట్లు, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 24,426.85 పాయింట్ల వద్ద మొదలయ్యాయి. ఐదవ తేదీ, శుక్రవారం మిలాద్ ఉన్‌నబీ కారణంగా మార్కెట్‌కు సెలవు. దీనితో కేవలం నాలుగు రోజుల ట్రేడింగ్ మాత్రమే జరిగింది. వారాంతంలో మార్కెట్లు ఊరటనిచ్చిన నేపథ్యంలో, సెన్సెక్స్ 80,718.01 పాయింట్లు, నిఫ్టీ 24,734.30 పాయింట్లతో ముగిసింది. వచ్చే వారం పరిస్థితి మెరుగ్గా ఉండవచ్చని అంటున్నారు. కాగా, జిఎస్‌టి కొత్త శ్లాబ్ విధానంపై మదుపరులు ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తి రేపుతున్నది.



బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

## బంగారం ధరలు తగ్గుముఖం!

గత రెండు నెలల నుంచి పసిడి ప్రియులకు చుక్కలు చూపించిన బంగారం ధరలు, వరుసగా రెండు రోజులు ఊరటనిచ్చాయి. శుక్రవారం 76 రూపాయలు తగ్గిన బంగారం ధర, శనివారం ఒక్క రూపాయి తగ్గింది. ఈ తీరు కొంత ఆశాజనకంగా ఉంది. అయితే, మార్కెట్లు ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతాయన్నది ఊహించడం కష్టం. ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందుకే స్టాక్ మార్కెట్ల కంటే, బంగారంపై పెట్టుబడులు క్షేమమన్న అభిప్రాయం మదుపరుల్లో బలపడుతున్నది. ఫలితంగా బంగారం ధరలు చాలాకాలంగా పెరుగుతునే ఉన్నాయి. ఈవారాంతంలో కొంత తగ్గుముఖం పట్టాయి. శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాములు బంగారం ధర రూ.1,07,630 వద్ద ట్రేడ్ అయింది. ఇక 100 గ్రాములు బంగారం ధర రూ.100 పెరిగి రూ.10,76,300గా ఉంది. జాతీయ మార్కెట్‌లో 24 క్యారట్ల గ్రాము బంగారం ధర రూపాయి పెరిగింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,763 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,866, 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ. 8,073గా కొనసాగుతున్నది.

## 'పెట్రో' ఉత్పత్తులపై దాటవేత ధోరణి




పెట్రోలు, డీజిల్ వంటి పెట్రో ఉత్పత్తులను వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) పరిధిలోకి తీసుకురావలన్న డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శ్లామ్స్ విధానంలో భారీ మార్పులు చేపట్టినప్పటికీ, ఈ విషయంపై దాటవేత ధోరణినే ప్రదర్శించింది. రాష్ట్రాలు అంగీకరిస్తే, ఈ ప్రతిపాదనను అంగీకరిస్తామన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన, పరిస్థితిని మళ్లీ మొదటికి తీసుకెళ్లింది. 2017లో ప్రారంభమైన జిఎస్‌టి విధానంలో అతిపెద్ద సంస్కరణలను చేపట్టిన కేంద్రం, తాజా రెండు శ్లాబ్‌ల విధానాన్ని 'జిఎస్‌టి 2.0'గా అభివర్ణించింది. అయినప్పటికీ పెట్రోలు, డీజిల్ ప్రసక్తి తీసుకురాలేదు. సెప్టెంబర్ 22 నుంచి కొత్త శ్లాబ్ విధానాలు అమల్లోకి వస్తుండగా, 'ఇండియా టుడే' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మల పలు అంశాలను ప్రస్తావించారు. పెట్రోలు, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చ అంశాన్ని ప్రస్తావించగా, విచిత్రమైన సమాధానం చెప్పారు. జిఎస్‌టి రేటు తగ్గింపుతో సాధారణ ప్రజలకు నేరుగా లాభం చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. ఏదైనా కంపెనీ లేదా వ్యాపార సంస్థ పన్ను తగ్గింపు వల్ల వచ్చిన ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కూడా ఆమె హెచ్చరించారు. నిఘా యంత్రాంగం ఎక్కడా పని చేయడం లేదన్న విషయం తెలిసినప్పటికీ, తగ్గిన పన్నుల విధానాన్ని అమలు చేసే బాధ్యతను వ్యాపారులు లేదా వ్యాపార సంస్థలకే విడిచిపెట్టడంలో ఔచిత్యం ఏమిటో ప్రభుత్వానికే తెలియాలి. కాగా, పెట్రోల్‌డీజిల్ జిఎస్‌టిలో చేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందదని, అయితే, తాజా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చలే



దని వివరించారు. జిఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలోనే పెట్రోల్, డీజిల్‌లను కూడా చేర్చే ప్రయత్నం చేశామని అయితే రాష్ట్రాలు అంగీకరించలేదని ఆమె నెపాన్ని బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపైకి నెట్టారు. ఈసారి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఆ అంశాన్ని ఎందుకు చర్చించలేదనే ప్రశ్నకు బహుశా ఆమె వద్ద సమాధానం ఉండకపోవచ్చు.

## కడవరకూ కమ్యూనిస్టు పార్టీలోనే

### నారయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివళులు అర్పించిన సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/డిండి :** సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ వడ్డెమాను నారయ్య మృతి సిపిఐ పార్టీకి ఆయన కుటుంబానికి తీరని లోటని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి , సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు అన్నారు. శనివారం నల్గొండ జిల్లా డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో వడ్డెమాను నారయ్య స్వగృహంలో ఆయన పార్థివ దేహంపై ఎర్రజెండాను కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా కామ్రేడ్ నారయ్య చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ఎర్రజెండా కప్పుకొని తనువు చాలించడం గొప్ప అదృష్టమని, కామ్రేడ్ నారయ్య కమ్యూనిస్టు పార్టీలో సామాన్య కార్యకర్త నుండి మొదలు కొని ఖానాపూర్ ఉప సర్పంచ్‌గా, టిపి.గౌరారం ఎంపిటిసిగా, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ కార్యవర్గ సభ్యులుగా పనిచేశారని ఆయన కుటుంబం ఇప్పటికి కమ్యూనిస్టు పార్టీలోనే ఉండండం గర్వకారణమన్నారు. నారయ్య కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా పాల్గొనేవారని ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం క ల్పించారు, పార్టీ ఎల్లప్పుడు మీకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం నారయ్యకు నివాళులు అర్పించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ అంతిమ యాత్రలో పాల్గొన్న వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనొద్దిన్, కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు, సిపిఐ మండల కార్యదర్శులు శ్రీరామదాసు కనకాచారి,దేపా సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు బొల్లె శైలేష్, తిప్పర్తి విజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, రవీంద్ర శర్మ, వల్లమల్ల అంజనేయులు, ఎలిమినేటి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి వల్లే పెరిగిన హమాలీ రేట్లు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎఐటియుసి ఆధ్వర్యంలో దేవరకొండలోని ఎరువుల షాపుల దిగుమతి హమాలి రేట్లు పెంచుకోవడం జరిగిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర రెడ్డి, జిల్లా ఆధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు. శనివారం దేవరకొండ మార్కెట్ యార్డులో జరిగిన పెర్టిలైజర్స్ షాప్‌ల యాజమాన్యం ఎఐటియుసి హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారం మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచుకోవడం జరిగిందని దేవేందర్‌రెడ్డి తెలిపారు. రెండు సవంత్సరాలకొకసారి జరిగే అగ్రిమెంటులో గతంలో ఉన్నటువంటి రేట్లపై 15 శాతం అధనంగా పెంచుకోవడం జరిగిందన్నారు. ఎగుమతి, దిగుమతి హమాలి రేట్లతో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని తీర్మానించారు. కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి అండగా నిలబడి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి భీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలకు సిద్దం కావాలని వారు పిలుపునిచ్చారు.



# సింగరేణి కార్మికులకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ వెల్లడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు గుర్తింపు సంఘం ఎఐటియుసి చేసిన కృషి మేరకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు కు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి ఆస్పత్రుల నుండి అత్యవసర, మెరుగైన వైద్య సేవల కొరకు కార్మికులను, వారి కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని ఇతర కార్పొరేట్ హాస్పిటల్స్‌కు పంపిస్తున్న క్రమంలో అక్కడి ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందక, వెళ్లిన పేషేంట్ల నుండి అదనంగా ఆస్పత్రుల యాజమాన్యాలు వివిధ చార్జీల రూపంలో డబ్బులు గుంజుతున్నారని, అదేవిధంగా కార్మికుల జీతాల నుండి మెడికల్ ఖర్చుల కింద కోత విధించడంతో కార్మికులు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యూనియన్ దృష్టికి తీసుకరాగ, గుర్తింపు సంఘం ఎఐటియుసి స్పందించి యాజమాన్యంతో హైద్రాబాద్‌లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ మీటింగ్‌లో కార్మికులకు ఏటా రూ.500 కోట్లు ఖర్చు చేసినా కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదని అందుకుగాను సింగరేణిచే ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని హైద్రాబాద్‌లో నిర్వహించాలని చర్చల్లో డిమాండ్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అందుకు యాజమాన్యం స్పందించి ఒక కమిటీని వేసి చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే యాజమాన్యం హైద్రాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పడానికి అక్కడి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంస్థల నుండి ఆసుపత్రుల నిర్వహణపై వారి ఆసక్తిని తెలియచేయాలని కోరుతూ, ఈ నెల నాలుగున వివరాలకై నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. సూపర్ స్పెషాలిటీ సంస్థలు అందించిన వివరాల మేరకు ఒక ఆసుపత్రిని సెలెక్ట్ చేసి వారితో లీజు ఒప్పందం గాని, కొనుగోలు గాని చేయాలని యాజమాన్యం సంకల్పించిందని ఆయన అన్నారు. దీనివల్ల సింగరేణి కార్మికులకు వారి కుటుంబాలకు, రిటైర్డ్ కార్మికులకు మరియు అసంఘటిత కార్మికులకు త్వరలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎఐటియుసి పోరాటం వల్లనే హైదరాబాద్ లో యాజమాన్యం సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేస్తుందని, అందుకు స్పందించి నోటిఫికేషన్ జారీ చేసిన యాజమాన్యం కు కార్మికుల పక్షాన గుర్తింపు సంఘం ఏఐటియుసి అభినందనలు తెలుపుతుందని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, నాయకులు రమణమూర్తి, వీరాస్వామి, రాజేశ్వరరావు, బండారి మల్లయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.





## వాస్తవ చరిత్ర వక్రీకరిస్తూ బిజెపి గ్లోబల్ ప్రచారం

### సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సిహెచ్ రాజారెడ్డి పిలుపు

### సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



**ప్రజాపక్షం / జనగామ :** ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరిస్తూ బిజెపి చేస్తున్న గ్లోబల్ ప్రచారాన్ని నేటి యువత, విద్యార్థులు ఖండించాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం గబ్బెట గోపాల్ రెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా సమితి సమావేశంలో జీడి ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిహెచ్ రాజారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో భూమి, భుక్తి, విముక్తి, దున్నేవాడికే భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ప్రజల్ని పీడిస్తున్న నైజాం రాచరిక దురంతాలకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది చంపబడ్డారని, 10లక్షల ఎకరాల భూమి పంచడం జరిగిందన్నారు. అనేక మంది పోరాటం, ప్రాణ త్యాగం ఫలితంగా నైజాం ప్రభుత్వం 1947 సెప్టెంబర్ 17 హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం ఏయడం జరిగిందని, ఇది కేవలం కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ద్వారా స్థాదించిన విజయమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న జనగామలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి నల్లా నర్సింహులు విగ్రహం వద్ద నుండి ప్రచార జాతాను ప్రారంభించడం జరుగుతుందన్నారు. నల్లా నర్సింహులు విగ్రహం నుండి బయలుదేరిన జాత విస్నూర్ రాంచంద్రారెడ్డి గుండాల చేత హత్య గావించబడిన షేక్ బందగీ స్థూపం వద్ద నివాళ్లు అర్పించి ధర్మాపురంలోని జాటోత్ మృత వీరుల స్థూ పం వద్ద శ్రద్ధాంజలి ఘటించి పాలకుర్తిలోని వీర నారి సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వయించడం జరుగుతుందన్నారు. అక్కడి నుండి రఘునాథపల్లి మండలంలోని గబ్బెట గ్రామంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గెరిల్లా దళాలకు శిక్షణ ఇచ్చిన సెంట్రల్ దళ కమాండర్ గబ్బెట తిరుమల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పోరాట యోధులు స్థూపాల వద్ద బహిరంగ సభ నిర్వయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లప ల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పా ల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేష్, రావుల సదానందం, పాతూరి ప్రశాంత్, భువనగిరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పోరాట ఫలితంగానే పెరిగిన కొత్త బెనిఫిట్స్ : గన్నారపు

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఎఐటియుసి పోరాటాల ఫలితంగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయని, ప్రభుత్వం జారీచేసిన జిఒ ప్రకారం భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదంలో మరణించిన వారికి రూ.10లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ. 2లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నారని బిల్డింగ్, కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజిఒ వల్ల మరణించిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే పెళ్లి కానుక, ప్రసవ (డెలివర్) బెనిఫిట్స్ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని, ఇందుకు కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో ఐక్యంగా ముందుకు వచ్చి ఈ డిమాండ్ కూడా సాధించుకోవాలని కోరారు. సిఎస్‌సి హెల్త్ కేర్ సెంటర్ నుండి టెస్టుల పేరుతో వెల్ఫేర్ బోర్డులోని డబ్బులను వృధా చేయడం జరుగుతుందని, ఎందుకంటే ఈ రిపోర్టుల పేరుతో ఒక్కొక్క కార్మికునికి టెస్టులు ఫ్రీ చేస్తామని చెప్పి హెల్త్ కేర్ సెంటర్‌కు ఒక కార్మికుని పైన రూ. 3500 లు హెల్త్ కేర్ సెంటర్ తీసుకోవడం జరుగుతుందని, అందువల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు లేకుండా కార్మిక శాఖ నుండి డబ్బులు వృధాగా ఖర్చులు చేయడం జరుగుతుందన్నారు.ఒక్కొక్కరిపై రూ.3500 పెట్టె ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డుల క్లైమ్‌లను వెంటనే క్లియర్ చేసి అర్హులైన వారికి అందే విధంగా చూడాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డ్స్ కొత్తగా తీసుకునే కార్డులు అందజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలోని అన్ని రంగాల కార్మికులతో నెలకు ఒకసారి సమావేశం నిర్వహించి వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లా, మండల, పట్టణ ప్రాంతాలలో నగరాలలో గ్రామాలలో లేబర్ అడ్డాల వద్ద మూత్రశాలలు, మంచినీరు లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సహజ మరణాలు, యాక్సిడెంట్ కేసులను ప్రభుత్వం కాకుండా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పాలనే ఆలోచనను విరమించుకోవాలని, లేకుంటే రాష్ట్రంలో ఉన్న కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంఘటితంగా ఉండి పరిష్కరించుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కొట్టుకుపోయిన రహదారి పరిశీలన



ప్రజాపక్షం/నిజాంసాగర్: గత వారం పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా నిజాంసాగర్ మండలంలోని బొగ్గుగుడిసె ఎల్లారెడ్డి రహదారి ఆయా చోట్ల కొట్టుకుపోయి కోతకు గురైంది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ నేపథ్యంలో బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితాదేవి సబ్ కలెక్టర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి రోడ్డు కోతకు గురికావడంతో బాన్సువాడ నుండి ఎల్లారెడ్డి, నిజాంసాగర్ మండలాలకు రాకపోకలు స్తంభించిపోయాయని, ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందుకు గురవుతున్నట్లు తెలియజేశారు. విషయం తెలుసుకున్న వెంటనే సబ్ కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చే పట్టాలని సంబందిత రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ ప రిశీలన కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సరితా దేవి, తదితరులున్నారు.

## పింఛన్ల పెంపునకు ప్రభుత్వంపై పోరాడాలి



ప్రజాపక్షం/తాండూర్: పింఛన్ల పెంపునకు ప్రభుత్వంపై పింఛనుదారులు పోరాటం చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. తాండూర్‌లో జరిగిన బెల్లంపల్లి నియోజకవర్గ మహా గర్జన సన్నాహక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంఆర్‌పిఎస్ పోరాటాల కారణంగానే పింఛను రూ.200 నుంచి రూ.1000కి పెరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా పింఛను మొత్తాన్ని రూ.4,000 వరకు పెంచుతామని హామీ ఇచ్చినా, ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం కాలయాపన చేస్తూ పింఛన్ దారులకు అన్యాయం చేస్తోందని ఆయన ఆరోపించారు. కుల, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాడితేనే ప్రభుత్వం స్పందిస్తుందని, ఈ పోరాటాలకు ఎంఆర్‌పిఎస్ అండగా ఉంటుందని మందకృష్ణ హామీ ఇచ్చారు. ఈ నెల 8న కలెక్టరేట్ ముట్టడి, 9న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు, 21న గ్రామ పంచాయతీల ముందు ధర్నాలు, 26, 27న రహదారుల దిగ్బంధం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, పింఛనుదారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల భర్తీ

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా పర్యవేక్షణ అధికారి అవినాష్ కుమార్ అరిశె తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ టౌన్, బెజ్జూర్, కాగజ్‌నగర్, తిర్యాని, వాంకిడి, జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనస్థీషియా, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ డ్యూటీ డాక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దీనికిగాను ఈనెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావాలని సూచించారు. స్పెషలిస్ట్ వైద్యులకు రూ.1 లక్ష, జనరల్ డాక్టర్లకు రూ.52,351 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ



ప్రజాపక్షం/దహెగాం/చింతలమానేపల్లి: సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు 37 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణి చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన పత్రాల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ లబ్దిదారులందరూ వచ్చే దసరా నవరాత్రుల్లో ఇండ్ల పనులు ప్రారంభించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలవుతున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెసరకుంట, మొట్లగూడ గ్రామాలకు నూతన పంచాయతీ భవనాలు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మంజూరు అయ్యాయని, త్వరలో వాటికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. కల్వాడ ఒడ్డుగూడ మధ్య డబుల్ రహదారి, పిపి రావు కాలనీ సుర్జాపూర్ మధ్య బీటి రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. పంటనష్టం జరిగిన రైతులు ఆందోళన చెందవద్దు అని, అందరికి పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్, ఎమ్మార్వో షరీఫ్, ఎంపీఓ రవికుమార్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి గౌడ్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, దామోదర్, టెలికం అడ్వైజరీ కమిటి సభ్యులు ప్రభాకర్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి



ప్రజాపక్షం/జన్నారం: ధర్మారం, బాదంపల్లి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీర్పూర్ గ్రామానికి చెందిన పూదూరి నరేశ్ (20) అనే యువకుడు మృతి చెందాడు. బైక్ అదుపుతప్పి కాలువలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. నరేశ్‌తో పాటు ప్రయాణిస్తున్న అతని స్నేహితుడు విష్ణువర్ధన్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి నరేశ్ తన అక్క ఇంటి నుంచి తిరుగు ప్రయాణంలో ఉన్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. నరేశ్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల బైక్ అదుపు తప్పి కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నరేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.
వెనుక కూర్చున్న విష్ణువర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి పూదూరి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.అనూష తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్ పట్టివేత

ప్రజాపక్షం/ఖానాపూర్: ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్ పట్టుకున్నట్లు తాసిల్దార్ సుజాత తెలిపారు.తను మాట్లాడుతూ పట్టుకున్న మొరం ట్రాక్టర్ను తాసిల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.మండలంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ మొరం దందా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని,అక్రమ మొరం,ఇసుక దందా చేయడం చట్టరిత్య నేరమని అన్నారు.పట్టుకున్న మరో ట్రాక్టర్ ని సీజ్ చేసి జరిమానా విధించారు.మొరం టాక్టర్ సీజ్ చేయడంలో ఆర్ఐ నాగేష్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు





ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ నియోజకవర్గం కడం మండల కేంద్రంలో యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు,నిర్మల్ నుండి మంచిర్యాల్ వెళ్లే నేషనల్ హైవే 47 కడెం ప్రధాన రహదారిపై పలు గ్రామాల రైతులు యూరియా కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట వేసుకొని 20 రోజులు గడుస్తున్నా సకాలంలో పొలాలకి యూరియా వెయ్యడం లేదని పంట పొలాలు దెబ్బతింటున్నాయని, గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో అధిక నిర్మించి పంట నష్టం వాటిల్లితే, ఇప్పుడు ఈ వీడియో దొరకక పంట పూర్తిగా చేతికందెల లేదని సకాలంలో యూరియా లేకుంటే కాలం మారిన తర్వాత యూరియా అలికి ఏంచేయాలని స్థానిక వ్యవసాయ అధికారితో వాగ్దానం చేశారు. మూడు రోజులు సెలవులు ఉండటంతో మండలానికి రావాల్సిన యూరియా రాలేదని యూరియా కొరత ఏమీ లేదని సదరు అధికారి రైతులకు నచ్చజెప్పి ధర్నా విరామింప చేశారు. సోమవారం రోజు యూరియా రాగానే అందరికీ అందజేస్తామని యూరియా కొరత ఏమీ లేదని అందరికీ అందుతుందని ఎవరు కూడా ఆందోళన చెందవద్దని తెలిపారు.దాంతో అక్కడున్న రైతులు శాంతించి ధర్నా విరమించి అక్కడినుండి వెళ్లారు. ధర్నాలో సదర్ మాట్ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్, కడెం మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**మండలంలో తీవ్ర యూరియా కొరతా..**

దిలావర్‌పూర్ : మండలంలోని రైతులకు తీవ్ర యూరియా కొరతతో సతమతం అవుతున్నారు.రైతులు వరి నాట్లు వేసి నేలాలు గడుస్తున్న పొలానికి యూరియా చల్లడానికి మండలంలో యూరియా లభించక పొలాలు ఎర్రగా ఏర్పడి ఎదుగుదల ఆగిపోవడం జరుగుతుంది.మండలానికి అరకొరగా యూరియా వచ్చినప్పటికీ రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు ఇవ్వడం వల్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడుతుంది.పొలంలో వ్యవసాయ పనులు ఉన్నప్పటికీ యూరియా కొరకు రైతులు తిరుగడం వల్ల వ్యవసాయపరులకు ఇబ్బందిగా మారింది.ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడ యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం పోరాట ఫలితమే ఎక్స్‌గ్రేషియా పెంపు

ప్రజాపక్షం/అదిలాబాద్: ఎఐటియూసి అనుబంధం భవన నిర్మాణ కార్మిక సంఘం పోరాట ఫలితమే ఎక్స్‌గ్రేషియా పెంచడం జరిగిందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గాజంగుల రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల అభ్యున్నతి కోసం సిపిఐ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రస్తావించడం, ఏఐటియూసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా నాయకత్వల పోరాటాల వల్లనే ఈ విజయాలను సాదించామని అన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.6 లక్షలు ఇచ్చేది. నేడు రూ. 10 లక్షలు పెంచడం జరిగిందన్నారు. సాధారణ మరణానికి గతంలో 1 లక్ష 30వేలు ఇచ్చెది. నేడు రూ. 2 లక్షలు పెంచడం జరిగిందన్నారు. కార్మికుల ఆశయలను సాధించుకోవడంలో ఏఐటియూసి భవన నిర్మాణ కార్మిక సంఘం 1996 చట్టం ప్రకారం ఎయల్‌ఓ లేబర్ ఆఫీసు, లెబర్ కమిషన్ ఆఫీసు ముందు అనేకసార్లు ధర్నాలు చేయడం జరిగిందన్నారు. ఈ విజయం ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం పోరాట ఫలితమే అని వ్యక్తం చేశారు.

## ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రజాపక్షం/సంగారెడ్డి : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శనివారం కొండాపూర్ మండలం తొగరపల్లి ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మెగా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం విద్యార్థులకు పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా మాట్లాడారు పరీక్షలకు ముందుగానే అన్ని అంశాలపై విద్యార్థులు పట్టు సాదించి శతశాతం ఫలితాలు సాదించేలా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. శతశాతం ఫలితాల సాధనకు విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాలది అన్నారు. తొగరపల్లి ఉన్నత పాఠశాలలో సీఎం శ్రీకింద స్టోర్స్ మెటీరియల్ కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కాంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు పాఠశాలలో అమలవుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని బీసీ బాలుర వసతి గృహన్ని పరిశీలించారు. వసతి గృహంలో గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు అందుకున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా ఐన బెడ్ షీట్లు దుప్పటి కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను చదివిన చదువును ఉయోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా క్రమ శిక్షణ పౌరులుగా రూపొందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖల అదికారులు పాఠశాల ప్రదానోపాద్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి వద్ద వినాయక నిమజ్జనం పరిశీలన



ప్రజాపక్షం/నిజామాబాద్: వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శనివారం ఆయా ప్రాంతాలను సందర్శిస్తూ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. వినాయకులను నిమజ్జనం చేసిన ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు, నందిపేట్ మండలం ఉమ్మెడ, నవీపేట్ మండలం యంచ గోదావరి తదితర ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి వినాయక విగ్రహాల నిమజ్జనం తీరుతెన్నులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఏ చిన్న ప్రమాదానికి సైతం ఆస్కారం లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం పూర్తి అయ్యేంత వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలలో ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, బోట్లు, మెడికల్ టీంలు, క్రేన్ సదుపాయాలు, లైటింగ్, అంబులెన్స్ తదితర వసతులను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన విధులను పక్కాగా నిర్వహిస్తూ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసేలా చూడాలని అధికారులకు హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సార్వజనిక్ గణేష్ మండలి వద్ద ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సా యిచైతన్య, కేశ వేణు తదితరులు ప్రత్యేక పూ జలు చేసి శోభాయాత్ర రథం వద్ద కొబ్బరికాయలు కొట్టారు.శోభాయాత్ర సందర్భంగా సుమారు 2 వలే మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ సాయి చైతన్య తెలిపారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

**గంగమ్మ తల్లి ఒడిలోకి గణనాథులు**

వాడవాడలా నవరాత్రులతో పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయకులను భక్తిప్రవత్తులతో నిమజ్జనం చేశామన్నారు. ఉదయం నుంచి వాడవాడలా కొలువుదీరని వినాయకులను శోభాయాత్ర ద్వారా ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించామన్నారు. నిమజ్జన ఉత్సవాన్ని మండపం నిర్వాహకులు ఆనందోత్సహాల మధ్య నిర్వహించారు. నిమజ్జనోత్సవాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ డ్యాన్స్‌లు చేస్తూ వినాయక నిమజ్జనం చేస్తూ సంబురాలు జరుపుకున్నామన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికల పర్వం



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్/కాగజ్‌నగర్: సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. పెంచికల్‌పేట్, ఎల్లూరు గ్రామాల నుండి బిజెపి, బిఆర్ఎస్, బిఎస్‌పి పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పొట్టె నారాయణ, పగిడే ఆశన్న, జోడి శ్రీనివాస్, సత్యం, టి లచ్చు, రౌతు తిరుపతి, రాజు, పెంటు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ దండే విఠల్ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా దండే విఠల్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా అందరూ కలిసి కృషి చేయాలి. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుంది. అన్నారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట్ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేపర్ మిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/కాగజ్‌నగర్: కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్న జెకె పేపర్ మిల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం, ఈ విషయమై కలెక్టరేట్ ఎఓ కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి మాట్లాడుతూ పేపర్ మిల్ యాజమాన్యం కార్మికుల భద్రతను విస్మరించి వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. కార్మికుల విజ్ఞప్తులను, ఆందోళనలను పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమలో జరగాల్సిన కార్మిక సంఘ ఎన్నికలను కూడా యాజమాన్యం నిర్వహించడం లేదని విమర్శించారు. ఈ విషయమై కార్మిక సంఘ నాయకులు, స్థానిక రాజకీయ నాయకులు లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి దివాకర్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో సిపిఐ



ప్రజాపక్షం/ సంగారెడ్డి : స్థానిక సంస్థ ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీలో ఉంటుందని సిపిఐ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ నారాయణ ఖేడ్ డివిజన్ కార్యదర్శి యన్ ఆనంద్ మాట్లాడుతూ నిరంతరం కార్మిక కష్టజీవులు కోసం యువత పక్షాన ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ అణగారిన వర్గాల పక్షాన గళ్ళమెత్తేది కమ్యూనిస్టు పార్టీ ఎర్ర జండా సిపిఐ అన్నారు. ఇంతకాలం పోరాటాలు ధర్నాలు ,రాస్తారోఖోలు అని మాత్రం కాకుండా రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని జిల్లా పార్టీ నిర్ణయం మేరకు ఈ సారి పోటీలో ఉండాలని నారాయణ ఖేడ్ కార్యకర్తలు నాయకులు ఆవేశంలో చర్చించడం జరిగింది. మనకున్న శక్తి మేరకు సాధ్యమైనంత వరకు అన్ని మండలాలు జడ్పీటీసీ స్థానాలకు అట్లే సాధ్యమైనంత వరకు ఎంపిటీసీ స్థానాలకు కచ్చితంగా పోటీలో నిలవాలని కార్యకర్తలకు సూచనలు చేస్తూ గెలుపోటములు సహజం అయితే ఎర్ర జెండా పార్టీని ప్రతి గుడెసకు ప్రతి వాడకు తీసుకెళ్లే విదంగా ప్రచారం నిర్వహించడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయన్నారు. మనం శక్తి మరచిపోయి పనిచేస్తున్నాం మన కున్న వ్యక్తులు చాలా ప్రాముఖ్యమన్నారు. రిజర్వేషన్ కేటాయించిన అనంతరం అభ్యర్థులను కూడా కేటాయించుకోవడం జరగుతుందన్నారు. ప్రజలు కూడా ఆలోచన చేయాలి, ఎందుకంటే ఎర్రజెండా అనేది అధికార దాహంతో పని చేసేది కాదు . ప్రజల కోసమే ధ్యేయంగా కార్మికవ కష్టజీవులు క్షేమమే ధ్యేయంగా నిరంతరం అధికారంలో ఉన్నలేకున్నా ప్రజల పక్షాన నిలబడేది. ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అందుకోమని ప్రజల కోసం పని చేసే సిపీఐ ని అందుకని ప్రజలందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిరంజీవి పుష్పాల అశోక్, సిహెచ్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం వైపు కాంగ్రెస్ అడుగులు: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నిజాంసాగర్: కాంగ్రెస్ పార్టీ సంక్షేమం వైపు అడుగులు వేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. నిజాంసాగర్ మండలకేంద్రంలో శనివారం నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో పేదల కలలు సాకారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల భరాస పార్టీ పాలనలో ప్రజలు దోపిడికి గురయ్యారని దుయ్యబట్టారు. 100 సంవత్సరాల క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు చెక్కు చెదరకుండా ఉందని, ఇటీవల భారీ వరదలకు రెండున్నర లక్షల క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా దిగువకు విడుదల చేసిందని, లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప రాజెక్టు కళ్ళముందే కూలిపోయిందని, ఇది బీఆర్ఎస్ అవినీతికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో కేసీఆర్ కోట్ల రూపాయలు వాడుకున్నారన్నారు. అనంతరం ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఏఎంసీ చైర్మెన్ మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంధర్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు బిక్షపతి, సవాయిసింగ్, గంగాధర్, అనితరెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో నిమజ్జనం ఉత్సవాలు నిర్వహించాలి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: గణేశ్ నిమజ్జనోత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ కోరారు. శనివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన మట్టి గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పెద్దవాగులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రజలకు, పోలీసు సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగజ్ నగర్‌లో జరగబోయే నిమజ్జనోత్సవాల కోసం పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలు సజావుగా సాగడానికి ప్రజలు, భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వినాయక శోభా యాత్రలో ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు

ప్రజా పక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రం లో శుక్రవారం వినాయక నిమజ్జనం శోభా యాత్ర సందర్భంగా జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలైనట్లు మల్యాల ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మల్యాల తూర్పువాడకు చెందిన ఆదర్శ రైతు సంఘం ఆధ్వర్యం లో నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తూ ఉండగా అదే వాడ లో టీమ్ రాయల్ బుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్దకు రాగానే ,ఆ మండప నిర్వాహకులైన కోడారి రణధీర్, మనోజ్ లు పాత గొడవలు మనసులో పెట్టుకొని ఆ శోభా యాత్ర నిర్వాహకులను దుర్భాషలాడుతు దాడికి పాల్పడడంతో ఒకరికి ఒకరు ఘర్షణకు దిగడం తో పలువురికి గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. కైలాసపు మహేష్ పిర్యాదు మేరకు దాడికి పాల్పడిన కొడారి రణధీర్, కొడారి మనోజ్ మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు, అదేవిధంగా కొడారి రణధీర్,తల్లి పవిత్ర ఫిర్యాదు మేరకు కైలాసపు మహేష్, ముదం నాగరాజు, మరికొందరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 10న తుది జాబితా ప్రదర్శన



ప్రజాపక్షం/శంకరపట్నం:మండలప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ జాబితాను శనివారం ఎంపీడీవో కృష్ణప్రసాద్ ప్రదర్శించారు.ఈ సందర్భంగా మండలంలోని 13 ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ముసాయిదా పోలింగ్ కేంద్రాలను ఆయా ప్రాదేశిక నియోజకవర్గాల గ్రామపంచాయతీలతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో జాబితను ప్రదర్శించారు.జాబితలపై ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదిలలోపు మండల పరిషత్ కార్యాలయంలో తెలుపాలని వారు కోరారు.9వ తేది అభ్యంతరాలను పరిశీలించి పూర్తిచేసి పదవ తేది తుది జాబిత ప్రదర్శించనునట్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను డిప్యూటీ తాహశీల్దార్ షఫీ మహమ్మద్ శనివారం ముత్తారం మండలంలోని మచ్చుపేట నుండి బేగంపేట వైపు వెళ్తున్న ముత్తారం మండల కేంద్రంలో చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు.పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకే ఉచిత ఇసుక రవాణా చేసుకోవాలని అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించినట్లయితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆర్టిసి బస్సు ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాపక్షం/వీర్నపల్లి: ఆర్టీసీ బస్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం ఉదయం మండల కేంద్రంలోని కంచర్ల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన భూత వినోద్ గౌడ్ వేములవాడ మైనార్టీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే పని నిమిత్తం బైక్ పై వెళుతున్న క్రమంలో కంచర్ల గ్రామ సమీపంలో గల మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్ తలకు తీవ్ర గాయాలవ్వడంతో అంబులెన్స్‌లో ఎల్లారెడ్డిపేటలోని ఒ ప్రైవేట్ హస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రున్ని పలు పార్టీల నాయకులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

## మార్గదర్శకాల ప్రకారమే కౌన్సెలింగ్


కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రభుత్వమార్గదర్శకాలప్రకారమే గ్రామపాలన అధికారుల కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగిందని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిపిఓ పరీక్షలో పెజ్1, పేజ్ 2లో ఎంపికైన 149 జిపిఓలకు నియామక పత్రాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో సొంత నియోజకవర్గం కాకుండ వేరేనియోజక వర్గంలోని మెరిట్ ప్రకారం పలుగ్రామాలను ఎంచుకున్న జిపిఓలు వెంటనే జాయిన్ కావాలని సూచించారు.ఈ ప్రక్రియ రెకమేండేషన్‌లకు తావులేకుండ అత్యం త పారదర్శకంగా నియామక ప్రక్రియ జరిగిందన్నారు. మీరు వెంటనే పాత విధుల నుండి రిలివ్ కావాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషిచేసేలా పారదర్శకంగా పనిచేయాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఎఓ అబ్దుల్ రహమాన్, ఈడిఎం ఆనంద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



ప్రజాపక్షం/ సిద్దిపేట : ఉపాధ్యాయ వృత్తి చాల పవిత్రమైందని...సమాజమార్గదర్శకులని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుల కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టిటిసి భవనంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ హైమావతి, ఎంఎల్‌సిలు ముల్క కొమురయ్య, అంజిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి,విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు సూర్యవర్మ వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి విద్యార్థులను సమాజంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు తోడ్పాటు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషిచేయాలన్నారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందిందంటే దాని మూలాలు విద్యావ్యవస్థలో ఉన్నాయన్నారు. ఈ వ్యవస్థను నడిపించేది ఉపాధ్యాయులేనన్నారు. ఎంఎల్‌సి అంజిరెడ్డి మాట్లాడుతూ సూర్యుడు లేకపోతే వెలుతురు ఉం డదని, ఉపాధ్యాయులు లేకపోతే జ్ఞానం లేదన్నారు. విద్యతోనే వినయం దాగి ఉందన్నారు. ఎంఎల్‌సి కొమురయ్య మాట్లాడుతూ సర్వేపల్లి రాధకృష్ణ జయంతి రోజున టీచర్స్ డేను జరుపుకుంటారని, టీచర్స్ అందరు ఈ వృత్తిని ఎంచుకోవటం చాల గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడు రోల్ మోడల్‌గా ఉంటారన్నారు. మన దేశం వేగంగా అభివృద్ధి చేందే స్థాయిలో ప్రధానమంత్రి మోదీ కృషి ఏంతగానో ఉందన్నారు. ఆనంతరం కెరిర్ గైడెన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 63 మంది ఉపాధ్యాయులను ఘనంగా సనంగా సన్మానించి, ప్రశంస పత్రాలను అందచేశారు.

# సైన్స్ మ్యూజియంగా ఓల్డ్ హైస్కూలు



కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః ఓల్డ్ హైస్కూల్ భవనాన్ని పూర్తిగా సైన్స్ మ్యూజియంగా విద్యార్థులకు ఉపయోగపడేలా ఆధునికంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు కేటాయిస్తామని, పారదర్శకంగా సద్వినియోగం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో పురాతన ఉన్నత పాఠశాల భవనంలో కొనసాగుతున్న సైన్స్ మ్యూజియంను శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో చైతన్య జైనీతో కలిసి సందర్శించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతన పాఠశాల తరగతులను పక్కనున్న నూతన భవనంలోకి వారం రోజుల్లోగా తరలించాలన్నారు. ప్రస్తుతం అక్కడే కొనసాగుతున్న డిసిబి (ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం) కార్యాలయం మరోచోటకు, ఓపెన్ స్కూల్ కేంద్రం సీతారాంపూర్‌లోని ఎంపిపిఎస్ పాఠశాల సమీప భవనంలోకి తరలించాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ మ్యూజియం కలియ తిరుగుతూ మినీ ప్లానిటోరియం, డైనోసారోస్, ఇతర సైన్స్ పరికరాలు పరిశీలించారు. ఈ సంధర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పురాత పాఠశాల భవనాన్ని పూర్తిగా సైన్స్ మ్యూజియానికే కేటాయించాలన్నారు. సైన్స్ మ్యూజియంలో రోబోటిక్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ కంప్యూటర్ ల్యాబ్ కోసం ప్రత్యేక గదులు, విద్యార్థుల కోసం సెమినార్ హాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించకుండా సకాలంలో మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట సమగ్ర శిక్ష జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవాలి



ప్రజాపక్షం/కొత్తపల్లిః నేటి బాలలను రేపటి భావి పౌరులుగా ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కొత్తపల్లి స్వాగత్ ఫంక్షన్ హాలులో శనివారం తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నైతిక విలువలు బోధించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో ఆత్మవిశ్వాసం నింపి చదువుకునేలా చూడాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల టీచర్లు విద్యార్థులతో ప్రేమపూర్వకంగా మెలగాలన్నారు. ప్రభుత్వం తరపున ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛ ఎవం హరిత విద్యాలయ రేటింగ్‌లో అన్ని పాఠశాలలు పాల్గొనాలని సూచించారు. డిఇవో చైతన్య జైనీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు ప్రశంస పత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్మా సంఘం నాయకుడు యాదగిరి శేఖర్ రావు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఏఎంసి చైర్‌పర్సన్ చిలుముల లావణ్య



ప్రజాపక్షం / ధర్మపురి : మహిళల ఆర్థికాభివృద్ధియే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల జిల్లా ధర్మపురి ఏఎంసి చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మ ణ్ అన్నారు. మండలంలోని రాజారం గ్రామంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాలతో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసి చైర్‌పర్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులైన 32 మంది మహిళలకు కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ ఆర్థికాభివృద్ధికై కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభివృద్ధి కోసం విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక ప్రోత్సాహం అనే నాలుగు అంశాలపై దృష్టి నిలిపి పలు పథకాలకు రూపకల్పన చేస్తుందని చెప్పారు. ఈ రోజు అందిస్తున్న కుట్టు మిషన్లు కేవలం ఒక సాధనమనే కాకుండా మహిళా జీవనోపాధికి మార్గం గా చెప్పుకోవాలన్నారు. మహిళా ఆర్థికంగా బలపడ్డప్పుడే ముందుకు సాగుతుందని లావణ్య తెలిపారు. స్వయంఉపాధి ద్వారాఆర్థికంగా నిలదొక్కుకుంటే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే సమాజం బలపడుతుందని లావణ్య పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడి కిషోర్, జైన పిపిసిఎస్ చైర్మన్ సొల్ల నరేష్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్,తహశీల్దార్‌శ్రీనివాస్, స్టార్ మహిళా మండలి అధ్యక్షులు ఫాతిమా, కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు ఎస్.దినేష్, చిలుముల లక్ష్మ ణ్, జె.సుముఖ్, ఎదులాపురం మహేందర్, రంగు అశోక్ పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డ్స్‌లో ఆల్ఫోర్స్ విద్యార్థినికి చోటు

చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థిని ప్రతిష్ఠాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కళల పట్ల అవగాహన పెంపొందించి వివిధ కళా ప్రదర్శనలలో పాల్గొనేందుకు ఆసక్తిని పెంపొందించి విజేతలుగా నిలవాలని కోరారు. కళల ద్వారా విద్యార్థులకు రోజువారీ ఎదురవుతున్న ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించవచ్చని, కళలు విద్యార్థులకు ఎంతో సంతోషాన్ని చేకూరుస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. ప్రతిభను చాటి పాఠశాల ఔన్నత్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఇటీవల హైదరాబాదులోభారత్‌ఆర్ట్స్‌అకాడమీ ఆధ్వర్యంలో సుమారు 4500 మంది విద్యార్థుల పైగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాఠశాలకు చెందిన గజబింకార్ శ్రీనిత్య (6వ తరగతి) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకోవడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి పుష్పగుచ్ఛంతో పాటు జ్ఞాపికలను ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసవి వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు సన్మానం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః వాసవి వాగ్దేవి క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయని క్లబ్ సభ్యులు తెలిపారు. వాసవి వాగ్దేవి క్లబ్ సేవా కార్యక్రమాల వారోత్సవాల సంధర్బంగా శనివారం పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా సభ్యులు మాట్లాడుతూ వాసవి వాగ్దేవి క్లబ్ సమాజంలో అవసరమైన ప్రతి రంగంలో సేవా దృక్పథంతో ముందుకు సాగుతోందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కిట్లు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందించడం ద్వారా వారి విద్యా ప్రయాణానికి తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాల రోగులకు వైద్య సహాయం, ఉచిత ఆరోగ్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించడం ద్వారా ఎన్నో కుటుంబాలకు ప్రాణాదారమవుతున్నారని తెలిపారు. అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, వికలాంగుల ఆశ్రమాల్లో ఆహారం, బట్టలు పంపిణీ చేసి వారితో పండుగలు జరుపుకోవడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటుతున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించే ప్రచారం, శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మహిళా సాధికారత కోసం స్వయం ఉపాధి శిక్షణలు, కుట్టు యంత్రాల పంపిణీ, వృత్తి నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతను మించిన సేవా భావనతో వాసవి వాగ్దేవి క్లబ్ సమాజానికి అండగా నిలుస్తోందన్నారు. సమాజానికి అద్దం పట్టే పాత్రికేయుల సేవను గుర్తించి శాలువాలతో సన్మానించడం జరిగిందని తెలిపారు. పాత్రికేయులు గుంటపల్లి స్వామి, సదానందం, చేతన్‌క్రాంత్, మహేందర్‌చారి, రంగినేని శ్రీనివాస్, వేణుతో పాటు పలువురు మీడియా ప్రతినిధులున్నారు.

## ఇసుక లభ్యతపై సర్వే చేయండి : కలెక్టర్



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఇసుక లభ్యతపై సర్వే రిపోర్ట్ సకాలంలో తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మైనింగ్ శాఖ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక లభ్య త సంబంధించి జిల్లా సర్వే నివేదికను రెవెన్యూ శాఖ, మైన్స్ అండ్ జియాలజి, టిజిఎండిసి,గ్రౌండ్‌వాటర్,అటవీశాఖ, నీటిపారుదల శాఖ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ అధికారులుసంయుక్తంగా పరిశీలించి అక్టోబ ర్ 1 నాటికి ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సర్వే రిపోర్ట్ ఆధారంగా లీజులుఅనుమతి ఇవ్వడం జరుగుతుందని, ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లభిస్తాయని, సర్వే రిపోర్ట్ కట్టుదిట్టంగా తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ తమకు సంబంధించిన నివేదికలను సెప్టెంబర్ 15 లోపు అందజేయాలని తద్వారా తుది నివేదిక అక్టోబర్ 1 నాటికి సిద్ధం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు ఏడి మైన్స్ శ్రీనివాస్, లావణ్య, శివయ్య, శ్రీనివాస్, బాప్సింగ్ పాల్గొన్నారు.

### వరద ప్రాంతాల్లో మరమ్మతులు

పెద్దపల్లి : వరద ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం కలెక్టరేట్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనుల పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలో దెబ్బ తిన్న రోడ్లు, అంగన్వాడి భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగు నీటి పైప్ లైన్, పి.హెచ్.సి, ప్రభుత్వ పాఠశాలలు, విద్యుత్ తీగలు స్తంభాలు మొదలగు మౌలిక వసతుల మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాకు వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.డి.పి.ఓ వీర బుచ్చయ్య, జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, డీఈవో మాధవి, జిల్లా ఇన్చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి వాణి శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి



ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠినచర్యలు తప్పవని ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మం పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల సందరెల్లి శివారులోని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ప్రభుత్వ భూమిలో కొంత భాగం పల్లె పకృతి వనానికి కేటాయించారు. మిగిలిన భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించి భూమిని ట్రాక్టర్లతో చదును చేసి కబ్జా చేసే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని పలు పత్రికల్లో వార్త కథనాలు రాగా ఇటీవలే తహసీల్దార్ తో పాటు ఉన్నతాధికారులకు కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్స్, ఆర్ఐ రాజబాబు, సరీన్ సాయి సిబ్బందితో ప్రభుత్వ భూమిలో ఎవరు చదును చేయవద్దు అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయగా ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

## ట్రినిటీ బాలికల జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే'



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీఃకరీంనగర్‌లోని ట్రినిటీ బాలికల జూనియర్ కళాశాలలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అత్యంత సందడి భరితంగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, ట్రినిసి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్, గౌరవ అతిధిగా గ్రూప్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. విద్య మన జీవితానికి వెలుగు అని, ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను మెరుగుపర్చుకోవడం కోసం సదా కృషి చేయాలన్నారు. విద్యార్థుల విజయ ప్రయాణానికి ట్రినిటీ బలమైన ప్రేరణగానిలవనుందన్నారు. జీవితంలో మరొక కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందని, ట్రినిటి జూనియర్ కళాశాలలు విద్యార్థిగా కాకుండా జీవితాన్ని నేర్చుకునే వేదికగా మారాలన్నారు. ప్రయాణమంతా ఆధ్యాత్మికత, విద్య, క్రీడా,సాంస్కృతిఅభివృద్ధితోనిండి ఉండాలన్నారు. కృషి, పట్టుదల, నిబద్ధతో లక్ష్యాలను సాధించి దేశానికి,సమాజానికిసేవలందించాలని అన్నారు. ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, క్రీడా విభాగంలో ప్రత్యేక గుర్తింపుతో రాష్ట్ర, జాతీయ స్థాయి విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు ప్రధానం చేశారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సిబిఎస్ఇ పరీక్షల మాదిరిగా కొంత ముందుగానే నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం ఉం దని, కావున విద్యార్థులు ఇప్పటి నుంచే ఆ దిశగా సన్నద్ధం కావాలని సూచించారు. మరో నాలుగు నెలల్లో జెఇఇ మెయిన్స్, మేలో నీట్ పరీక్షలకు సిద్దమయ్యే విధంగా ప్రణాళిక ఏర్పరచుకుని ముందుకెళ్లాలన్నారు.ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా తల్మలిదండ్రుల మనస్సులో ఆనందం నింపాలని, పదివేల లోపు ర్యాంకు సాధిస్తే ప్రభుత్వం పూర్తిగా ఫీజు రాయితీ కల్పించే అవకాశం ఉన్నందున పరీక్షకు సన్నద్ధమవ్వాలని కోరారు. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః ప్రస్తుతకాలంలో విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ అర్బన్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఇ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అర్బన్ కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నూతన క్రీడా పాలసీతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుండడం గర్వకారణమన్నారు. జిల్లాలో మానేరు విద్యాసంస్థలు క్రీడారంగానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ఆద్వర్యంలో ప్రతి సంవత్సరం క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, తదితరులున్నారు.

# రీల్



## 'జాతస్య మరణం ధ్రువం' టీజర్ విడుదల

జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రిష ప్రెజెంటర్‌గా సురక్ష్ బ్యానర్‌పై మల్కాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రీతీ జంఘియానీ రీఎంట్రీ ఇస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా జె.డి చక్రవర్ మాట్లాడుతూ 'జాతస్య మరణం ధ్రువం' పోస్ట్ ప్రొడక్షన్ ముంబైలో ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా చేస్తున్నారు. సీరత్ మంచి డాన్సర్, కొరియోగ్రాఫర్, సింగర్. తనకి సినిమా అంటే పిచ్చి. ఈ సినిమాలో తన పెర్ఫార్మెన్స్ అందరికీ నచ్చుతుంది. నరేష్‌కి నాకు చాలా పోలికలు ఉన్నాయి. తనకి చాలా మొహమాటం. డైరెక్టర్ శ్రవణ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. 'జాతస్య మరణం ధ్రువం' టైటిల్ సజెస్ట్ చేసింది నేనే. టైటిల్ క్రెడిట్ నాకే వస్తుంది(నవ్వుతూ) మలయాళం నుంచి వచ్చే సినిమాలు బావుంటాయంటాం. 'జాతస్య మరణం ధ్రువం' ఆ కోవకి చెందిన సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు.

## నరేష్@65



వారసుల జనరేషన్‌లో అతి వేగంగా సినిమాలు చేస్తున్న హీరో అల్లరి నరేష్. దివంగత ప్రముఖ దర్శకుడు ఈ వివి సత్యనారాయణ వారసుడిగా అల్లరి అనే సినిమాతో తెరంగేట్రం చేసిన నరేష్‌కు అల్లరి నరేష్‌గా ముద్ర పడింది. రాజేంద్ర ప్రసాద్ తరువాత పూర్తి స్థాయిలో కామెడీ ప్రధానంగా నరేష్ సినిమాలు చేసి మెప్పించారు. అయితే ఈ మధ్య కాలంలో యాక్షన్ ఓరియంటేండ సినిమాలు కూడా చేసి మెప్పిస్తున్న నరేష్ ఏకంగా తన కెరీర్‌లో 65వ సినిమాకు చేరుకున్నారు. ఒక్కో హీరో ఒక్కో సినిమాకు మూడేళ్ళ సమయం తీసుకుంటున్న తరుణంలో నరేష్ అతి త్వరలోనే వంద సినిమాలు పూర్తి చేస్తారని ఫిలిం ఇండస్ట్రీ చర్చించుకుంటోంది. ఆదివారం నరేష్ హీరోగా 65వ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవంలో హీరో నాగ చైతన్య క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ఆనంద్ దర్శకత్వం వహించారు. వసిష్ఠ, రామ్ అబ్బరాజు, విజయ్ స్క్రిప్ట్‌ను అందజేశారు. హరీష్ శంకర్, సుప్రియ యార్లగడ్డ, జెమిని కిరణ్ అతిధులుగా హాజరైయ్యారు. అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు నిర్మాతలు రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు.




## 'లిటిల్ హార్ట్స్' సక్సెస్ మీట్




మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ప్రేక్షకుల ముందు కొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై థియేటర్లలో రిలీజ్ చేశారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా అన్నివర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాకు మంచి టాక్ వస్తోంది. ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. టికెట్ బుకింగ్స్ భారీగా జరుగుతున్నాయి. సినిమా జెన్యూన్‌గా సక్సెస్ అయితేనే మేము ఈటీవీ విన్ నుంచి సక్సెస్ మీట్స్ పెడతాం అని అన్నారు. డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' లాంటి చిన్న సినిమాకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో అనే సందేహంతోనే నిన్న ఉదయం 11 గంటలకు 3 షోస్‌తో ప్రీమియర్స్ స్టార్ట్ చేశాం. సాయంత్రం 7 గంటలకు 29 షోస్ పడ్డాయి. ఈ షోస్ అన్నీ దాదాపు 90 పర్సెంట్ ఫిల్ అయ్యాయి. ఇప్పుడు మల్టీప్లెక్స్‌లో ఒక్క టికెట్ కూడా లేదు. మొత్తం సేల్ అయ్యాయి. ఒక చిన్న చిత్రానికి ప్రేక్షకులు అసాధారణ విజయాన్ని అందించడం గొప్ప విషయం అని చెప్పారు.

## 'విద్రోహి' పాట విడుదల




రవి ప్రకాష్, శివకుమార్, చరిష్మా శ్రీఖర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'విద్రోహి'. వివిఎస్‌వి దర్శకత్వంలో సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని విజ్జన వెంకట సుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ చేతుల మీదుగా ఈ సినిమా తొలి పాటను ఆవిష్కరించారు. ఇటీవల ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంగ్ విడుదల అనంతరం వి వి వినాయక్ మాట్లాడుతూ.. 'విద్రోహి' ఫస్ట్ లుక్ చూశాను. అలాగే ఈ కథ గురించి కూడా విన్నాను. చాలా మంచి కథ. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని అనుకుంటున్నాను. నేను విడుదల చేసిన సాంగ్ కూడా చాలా బాగుంది. దర్శక నిర్మాతలకు ఆల్ ది బెస్ట్. ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా చేసిన రవి ప్రకాష్ నాకు ఎప్పటి నుంచో తెలుసు. మంచి ఆర్టిస్ట్. ఈ సినిమా, టీమ్ అందరికీ మంచి సక్సెస్‌ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

## 'నీది నాది ఓ చిరులోకం' పాట ఆవిష్కరణ




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కౌశిక్ పెగాళ్ళపాటి దర్శకత్వంలో నిర్మించిన కిష్కిందాపురి సినిమాలోని 'నీది నాది ఓ చిరులోకం' పాటను విడుదల చేశారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సస్పెన్స్, థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. సాహు గారపాటి, సందీప్ తోలేటి ఈ సినిమాకు నిర్మాతలు. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. చిన్మయి సలస్కర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. ఇంతవరకు సాయి శ్రీనివాస్ చేసిన పాత్రలకు ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుందని దర్శకుడు కౌశిక్ తెలిపారు. సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తయ్యాయని అన్నారు. ఈ నెల 12న సినిమాను విడుదల చేస్తున్నామని చెప్పారు.

## బీస్ట్ మోడ్‌లో నేచురల్ స్టార్



నేచురల్ స్టార్ నాని అద్భుతమైన సినీప్రయాణం 17 ఏళ్ళు పూర్తయింది. ఈ సందర్భంగా నాని తాజాగా చేస్తున్న 'ది ప్యారడైజ్' నుంచి పవర్ ఫుల్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఈ స్టిల్‌లో నాని కంప్లీట్ బీస్ట్ మోడ్‌లో కనిపిస్తూ, ఇప్పటివరకు ఎన్నడూ చూడని ఫెరోషియస్ అవాతర్‌లో ఆకట్టుకున్నారు. ప్యారడైజ్‌లో నాని నెవర్ బిఫోర్ జడల్ క్యారెక్టర్‌లో కనిపిస్తున్నారు. ఈ క్యారెక్టర్ కోసం జిమ్‌లో ఇంటెన్స్‌గా వర్క్ అవుట్ చేస్తున్నారని ఈ స్టిల్ చూస్తే అర్థమవుతుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, రా స్టేట్మెంట్, గ్లింప్స్ వీడియోలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా టాకీ పార్ట్ షూటింగు హైదరాబాదులో వేసిన సెట్స్‌లో జరుగుతోంది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'భద్రకాళి'లో జిల్ జిల్ పాట విడుదల



విజయ్ ఆంటోనీ హీరోగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. తాజాగా జిల్ జిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని పవర్ ఫుల్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భోలే షావలి స్వయంగా రాసి పాడిన ఈ సాంగ్ హై ఎనర్జీతో ఆకట్టుకుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సహకారం అందిస్తోంది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

---



## 'గణపతి బప్పా మోరియా..'

### భక్తులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి నినాదాలు..

హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు.. భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ట్యాంక్ బ్ండ వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి ఎలాంటి భద్రత లేకుండా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జన ఏర్పాట్లను సిఎం పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్న సిఎం భాగ్య నగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేశారు. క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన సిఎం రేవంత్‌కు వివరించారు. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా సిఎం రేవంత్ రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్షం కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా హుస్సేన్ సాగర్ వద్దకు సిఎం రేవంత్ రెడ్డి వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్య నగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## గణేశ్ నిమజ్జనోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. మహా నిమజ్జనం సాఫీగా సాగేందుకు జిహెచ్ఎంసి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని నిమిషం నిమిషం పర్యవేక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు.

**భక్తి ఉత్సాహాల మధ్య నిమజ్జనం..** నగరంలోని ప్రతి వీధిలో గణనాథుడి నినాదాలు, డిజెలు, బ్యాండ్, కోలాటం, డప్పు చప్పుళ్లతో శోభాయాత్రలు ముందుకు కదిలాయి. యువత, పిల్లలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఒక ఆసక్తికరమైన సన్నివేశంలో, పోలీసు అధికారులు కూడా భక్తులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేసి అందరిలో జోష్ నింపారు.

**పకడ్బందీ ఏర్పాటు..** నిమజ్జనం సజావుగా సాగేందుకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. వేగవంతమైన నిమజ్జనం కోసం 134 స్థిర క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి 20 ప్రధాన సరస్సులతో పాటు 72ప్రత్యేక కృత్రిమ కొలనులను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసింది. హుస్సేన్ సాగర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 9బోట్లు, డిఆర్ఎఫ్ బృందాలు, 200 మం ది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారు. 303 కిలో మీటర్ల ప్రధాన ఊరేగింపు మార్గంలో రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేసి శోభాయాత్రకు అనువుగా మార్చారు. మూడు షిఫ్టులలో 15,000మంది పారిశుధ్య కార్మికులు పనిచేసి, నిమజ్జన ప్రాంతాలను శుభ్రం చేశారు. రాత్రిపూట భక్తుల సౌలభ్యం కోసం 56,187 తాత్కాలిక లైటింగ్‌ల ను, అత్యవసర వైద్య సేవలకు 7 వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో 5,000 మందికి ఉచిత భోజనాలు అందించారు.

**మెట్రో, ఎంఎంటిఎస్ సేవలు..** నిమజ్జనం సందర్భంగా భక్తుల సౌలభ్యం కోసం మెట్రో రైళ్లు రాత్రి ఒంటిగంట వరకు నడిచాయి. ఎంఎంటిఎస్ సర్వీసులు కూడా అదనపు గంటలు నడిపారు.

**జిహెచ్ఎంసి ఉచిత భోజన సౌకర్యం..** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో 5000వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. పీపుల్స్ ప్లాజా, ప్రసాద్ ఐమాక్స్ వద్ద ఉచిత భోజనాలు ఏర్పాటు చేయగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**నిమజ్జన ఏర్పాట్లు, భద్రత..** నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రభుత్వం 303 కిలోమీటర్ల మేర శోభాయాత్రల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిహెచ్ఎంసీ 13 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 15 వేల మంది సిబ్బందిని, 30 వేల మంది పోలీసులను విధులు నిర్వహించేందుకు నియమించింది. 160 యాక్షన్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారు. నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులు, 74 కృత్రిమ కొలనులు, 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేశారు. హుస్సేన్‌సాగర్‌లో 9 బోట్లు, 200 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నీరు, వైద్య సిబ్బంది, ఫైర్ ఇంజన్‌లను అందుబాటులో ఉంచారు.





## మంత్రి పొన్నం ఏరియల్ సర్వే

హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అధికారులతో పాటు హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. గణనాథుల నిమజ్జనాలను పరిశీలించేందుకు మంత్రిపొన్నం ప్రభాకర్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిజిపి డాక్టర్ జితేందర్, పోలీసు కమిషనర్ సివి ఆనంద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, కలెక్టర్ హరిచందన హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతోందని తెలిపారు. ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది కలిసి నిమజ్జనాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల్లోగా నిమజ్జనాలు పూర్తవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. గతంలో నిమజ్జనాలకు 3 రోజుల సమయం పట్టేదని, ఇప్పుడు ఒకరోజులో పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. మరోవైపు బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర తెలుగుతల్లి ఫ్లై ఓవర్ మీదుగా చేరుకుని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జనం జరిగిందన్నారు.

## రూ.35 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ

### వేలంలో లడ్డును దక్కించుకున్న లింగాల దశరథ్ గౌడ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దేశవ్యాప్తంగా ఎంతో ప్రత్యేకత కలిగి హైదరాబాద్ బాలాపూర్ గణేష్ లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. హైదరాబాద్ కర్మాన్ ఘాట్ కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ 35 లక్షల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి సుమారు రూ.5 లక్షలు ఎక్కువగా లడ్డూకు ధర పలకడం విశేషం. వేలం అనంతరం లింగాల దశరథ్ గౌడ్ బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు డబ్బులను అందజేశారు.ముందు గా రూ.1,116తో వేలం ప్రారంభం కాగా పోటాపోటీగా సాగిన వేలంలో లింగాల దశరథ్ గౌడ్ లడ్డూను దక్కించుకున్నారు. ఈసారి వేలంలో మొత్తం 38 మంది పాల్గొన్నారు. గతంలో లడ్డూ దక్కించుకున్న 31 మందితో పాటుగా కొత్తగా మరో ఏడుగురు లడ్డూ వేలంలో పోటీపడ్డారు.గత ఏడాది లడ్డూ ధర రూ.30,01,000తో పాటు రూ.5000 వేలు నాన్ రిఫండబుల్ అమౌంట్ ఉత్సవ కమిటీకి డిపాజిట్ చేశారు. గతేడాది బాలాపూర్‌కు చెందిన కొలను శంకర్ రెడ్డి అనే వ్యక్తి 30 లక్షల 1000 రూపాయలకు లడ్డూను వేలంలో సొంతం చేసుకున్నాడు. కాగా బాలాపూర్ లడ్డూ కోసం గత ఆరు సంవత్సరాలుగా వేలంలో పాల్గొంటున్న లింగాల దశరథ్ గౌడ్ దేవుడి కృపతో ఈసారి సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఈసారి వేలంలో లడ్డూ దక్కించుకోవటం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



## బంగారు కలశాలు చోరీ

(మొదటి పేజీ తరువాయి)

బరువున్న బంగారు కొబ్బరికాయ, వజ్రాలు, పచ్చలు, మాణిక్యాలతో పొదిగిన చిన్న పరిమాణంలో ఉన్న 115 గ్రాముల బంగారు 'జారి' ఉన్నాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. దొంగిలించబడిన వస్తువులు వ్యాపారవేత్త సుధీర్ జైన్‌వి కాగా, అతను ప్రతిరోజూ పూజ నిమిత్తం ఇక్కడికి తీసుకువస్తారు. ఎర్రకోట ప్రాంగణంలోని 15 ఆగస్టు పార్క్‌లో 10 రోజుల పాటు జరిగే 'దసలక్షణ మహా పర్వం' సందర్భంగా బుధవారం దొంగతనం జరిగింది. జైన పూజారి వేషంలో ఉన్న నిందితుడు విలువైన వస్తువులు ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లినట్లు సిసిటివిలో కనిపించింది. నిర్వాహకులు ప్రముఖులను స్వాగతించడానికి ఏర్పాట్లు చేస్తున్నప్పుడు దొంగతనం జరిగినట్లు బయటపడింది. ఉత్సవ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమైనప్పుడు వేదికపై వస్తువులు కనిపించకుండా పోయాయి. రద్దీగా ఉండడంతో దొంగ దానిని ఆసరాగా చేసుకున్నాడని, రత్నాలు కేవలం సౌందర్యం కోసమేనని, 'కలశం' మన మనోభావాలతో ముడిపడి ఉండగా, అలాంటి వస్తువుకు మనం విలువ కట్టలేమని సుధీర్ జైన్ విలేకరులతో అన్నారు. పోలీసులకు ఆధారాలు లభించాయని, వారు త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తారని ఆయన అన్నారు. దొంగ గతంలో మూడు దేవాలయాలపై ఇలాంటి ప్రయత్నాలు చేశాడని సుధీర్ జైన్‌కు బంధువు అయిన పునీత్ జైన్ ఆరోపించారు.

## మహా గణపతికి ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

చేర్చారు. దారిపొడవున ఎక్కడ చూసినా 'గణపతి బప్ప మోరియా' అంటూ చిన్నాపెద్దా అంతా వారి భక్తిని చాటుకున్నారు. అడుగడుగున మహాగణపతికి నీరాజనం పలికారు. మహాగణపతిని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ట్యాంక్ బాండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన వాహనంలో 70 టన్నుల భారీ గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ ఎన్‌టిఆర్ మార్గ్‌లోని నాలుగో క్రేన్ వద్దకు చేరిన లంబోధరుడికి ఖైరతాబాద్ ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు.

**ఆద్యంతం కనుల పండువగా సాగిన ఖైరతాబాద్ గణేశుడి శోభయాత్ర..** పూజల అనంతరం సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర నిర్వహించారు. మహాగణపతి శోభాయాత్ర ఆద్యంతం కనుల పండువగా సాగింది. జైబోలో గణేశ్ మహారాజ్ కీ జై! అంటూ జయజయధ్వానాలు మార్మోగాయి. అశేష భక్తజనావళి చూస్తుండగానే కనురెప్పపాటు కాలంలో ఆ పార్వతీ తనయుడు గంగ ఒడిలోకి చేరాడు. శుక్రవారం అర్ధరాత్రి చివరిసారిగా కలశపూజ నిర్వహించారు. శనివారం వేకువజామున 69 అడుగుల ఎత్తు, 50 టన్నులున్న గణనాథుడిని ప్రత్యేక వాహనంపైకి చేర్చారు. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర గంగమ్మ దిశగా సాగింది. భక్తులు గణనాథుడిపైకి పూలు చల్లుతూ, డోలు వాయి స్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. దారి పొడవునా నీరాజనాలు పలికారు. శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి చేరుకున్నాడు. ఖైరతాబాద్ గణేశ్ హుస్సేన్‌సాగర్ తీరానికి చేరగానే కోలాహలం అంబరాన్నంటింది. లక్షలాది మంది భక్తులు వినాయక నామ స్మరణతో సాగర తీరం మారు మోగింది. గణేశ్ మహారాజ్‌కి జై అంటూ భక్తులు హోరెత్తించారు. హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన నాలుగో క్రేన్ (బాహుబలి క్రేన్) వద్ద నిమజ్జనానికి సంబంధించిన ప్రక్రి య పూర్తి చేశారు. భారీ క్రేన్ సాయంతో మహగణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com